RNI No.: TELTEL2015/62825

# తెలంగాణ సేన

TELANGANA SENA TELUGU DAILY

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో

తెలంగాణ సేన దినపత్రికలో పనిచేయుటకు

విలేకరులు కావలెను

జిల్లా రిపోర్టర్ లు, నియోజకవర్గ రిపోర్టర్ లు, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ లు కావలెను.

9959236324 9951247932

PUBLISHED FROM : HYDERABAD

సంపుటి : 10 సంచిక : 228 ఆదివారం 16 - 03 - 2025 ఎడిటర్ : బొమ్మరబోయున వెంకన్న ముదిరాజ్ అసోసియేట్ ఎడిటర్ : కే రాజేంద్ర ప్రసాద్ పేజీలు : 08 వెల : 2 రూ/-

## విమానాశ్రయాల తరహాలో బేగంపేట రైల్వే స్టేషన్




- బేగంపేట రైల్వే స్టేషన్‌లో పునరాభివృద్ధి పనులు ప్రారంభం
- అమృత్‌భారత్ స్టేషన్ పథకం కింద దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం వివిధ రైల్వే స్టేషన్లను అభివృద్ధి
- బేగంపేట రైల్వేస్టేషన్‌లో అందరూ మహిళలే ఉద్యోగులు ఉండేలా చూస్తాం
- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

# ప్రధాని మోదీని కలవడంలో రాజకీయం ఏముంది?

- ప్రధాని నరేంద్రమోదీ రాష్ట్రాల సీఎంలకు పెద్దన్న
- దిల్లీ పర్యటన పేరుతో ఎలాంటి దుబారా చేయడం లేదు
- కమీషన్లు తీసుకొని హైదరాబాద్ నగరాన్ని సర్వనాశనం చేశారు
- కేసీఆర్ పాలనలో తప్పులు.. అప్పులే చేశారు
- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం



దిల్లీ పర్యటన పేరుతో ఎలాంటి దుబారా చేయడం లేదని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రధాని నరేంద్రమోదీ రాష్ట్రాల సీఎంలకు పెద్దన్న లాంటివారని.. ఆయన్ను తాను కలవడంలో రాజకీయం ఏముందని ప్రశ్నించారు. ప్రధాని, కేంద్ర మంత్రివర్గం నిర్ణయాలు రాష్ట్రాల - మిగతా 2 లో

## బెట్టింగ్ యాప్‌లపై యుద్ధం




- సామాజిక మార్పు కోసం సజ్జనార్ పిలుపు
- బెట్టింగ్ యాప్స్ మాయ..
- సామాజిక మార్పు కోసం పిలుపు
- హర్ష సాయికి సంబంధించిన వీడియోను సజ్జనార్ షేర్
- తప్పే చేస్తున్నా, దాన్ని సమర్థించుకోవడం సరికాదు

## టెస్లా షోరూంలపై కొనసాగుతున్న దాడులు




- అదృష్టం కొద్దీ ఎవరికీ హాని జరగలేదు
- డోజ్ చీఫ్ పేరిట ఫెడరల్ ఉద్యోగుల తొలింపు చర్యలతో వ్యతిరేకత
- దాడిలో పలు ఈవీ వాహనాలు ధ్వంసం
- బోస్టన్‌లోని టెస్లా ఛార్జింగ్ స్టేషన్‌కు దుండగుల నిప్పు

## డ్యాన్స్ చేయకపోతే సస్పెండ్ చేస్తా

- హోలీ వేడుకల్లో పోలీసుకు ఆర్జేడీ నేత ఆర్డర్
- యూనిఫాంలో ఉండగానే తేజ్ ప్రతాప్ సింగ్ ఆయన్ను డ్యాన్స్ చేయమంటూ ఆదేశాలు జారీ
- ప్రస్తుతం ఇందుకు సంబధించిన వీడియో నెట్టింట వైరల్
- నృత్యం చేయకపోతే ఉద్యోగంలోంచి సస్పెండ్ చేస్తామని బెదిరించడం దారుణం




ఆర్జేడీ నేత తేజ్ ప్రతాప్ సింగ్ యాదవ్ ఇంట్లో హోలీ సంబురాలు నిర్వహించుకుంటుండగా.. ఓ పోలీసు అధికారి బందోబస్తు కోసం అక్కడకు వెళ్లారు. అయితే ఆయన యూనిఫాంలో ఉండగానే తేజ్ ప్రతాప్ సింగ్ ఆయన్ను డ్యాన్స్ చేయమంటూ ఆదేశాలు జారీ చేశారు.పాట ప్లే కాగానే డ్యాన్స్ చేయకపోతే.. నిన్ను ఉద్యోగంలోంచి సస్పెండ్ చేస్తానంటూ హెచ్చరించారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన - మిగతా 2 లో

## పీఎం కిసాన్ వారికి లేనట్టే..!




- పీఎం కిసాన్ ద్వారా ప్రతి సంవత్సరం 6000 రూపాయల పెట్టుబడి సాయం
- దాదాపు 3,000 మంది రైతులు 19వ విడత పిఎం కిసాన్ నగదు పొందలేకపోయారు
- అర్హత లేకపోవడం, ఈ కేవైసీ పూర్తి చేయకపోవడం, ఆధార్ లింకింగ్‌లో తప్పుడు సమాచారం తప్పుడు ఖాతాల వివరాలు అందించడం సమస్యలు

# ‘స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర’




ఎక్కడా చెత్త కనిపించొద్దు - ఎప్పుడైనా వచ్చి తనిఖీ చేస్తా

- పారిశుద్ధ్య పనులు చేయకపోతే అధికారులు, ప్రజాప్రతినిధులదే బాధ్యత
- స్వచ్ఛాంధ్ర కోసం ప్రతిఒక్కరూ కంకణం కట్టుకోవాలి
- అమరావతిలో రూ.40 వేల కోట్ల పనులకు పచ్చజెండా
- మాది ప్రజా ప్రభుత్వం, ప్రజల సమస్యలు వినేందుకే వచ్చా

రాష్ట్రాన్ని వైఎస్సార్సీపీ పూర్తిగా విధ్వంసం చేసి వెళ్లిందని సీఎం చంద్రబాబు మండిపడ్డారు. తాము అభివృద్ధి, సంక్షేమం సుపరిపాలనతో ముందుకెళ్తున్నామని చెప్పారు. పశ్చిమగోదావరి జిల్లా తణుకులో చంద్రబాబు పర్యటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ‘స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర’ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు.“గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రి ఎప్పుడైనా ప్రజల్లో తిరిగారా ప్రజల్లోకి వస్తే పరదాలు కట్టుకుని వచ్చేవారు. విమానంలో వస్తే చెట్లను నరక్కుంటూ వచ్చేవాళ్లు. ప్రజల సమస్యలు వినేందుకు కనీసం మాట్లాడనిచ్చేవారు - మిగతా 2 లో

# బహు భాషా విధానంపై నా వైఖరి మారలేదు

- నేను ఎప్పుడూ హిందీని ఒక భాషగా వ్యతిరేకించలేదు
- ఒక భాషను బలవంతంగా రుద్దడం లేదా ఒక భాషను వ్యతిరేకించడం సరైంది కాదు
- ఎన్ఈపీ-2020 ప్రకారం విద్యార్థులు విదేశీ భాషతో పాటు ఏవైనా రెండు భారతీయ భాషలు నేర్చుకునే వెసులుబాటు



ఒక భాషను బలవంతంగా రుద్దడం లేదా ఒక భాషను వ్యతిరేకించడం సరైంది కాదని జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు.ఒక భాషను బలవంతంగా రుద్దడం లేదా ఒక భాషను వ్యతిరేకించడం సరి కాదని జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. భారతదేశ జాతీయ, సాంస్కృతిక ఏకీకరణ లక్ష్యాన్ని సాధించడంలో ఈ రెండు అంశాలు దోహదపడవన్నారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు.“నేను ఎప్పుడూ హిందీని ఒక భాషగా వ్యతిరేకించలేదు. దానిని తప్పనిసరి చేయడాన్ని మాత్రమే వ్యతిరేకించాను. ఎన్ఈపీ-2020 స్వయంగా హిందీని అమలు చేయలేదు. - మిగతా 2 లో

# మొదటిపేజీ తరువాయి

## పీఎం కిసాన్ వారికి లేనట్టే..!



దేశవ్యాప్తంగా రైతాంగాన్ని ఆదుకోవడానికి రైతులకు వ్యవసాయానికి కావలసిన సాయం అందించడానికి పిఎం కిసాన్ యోజన పథకం అందుబాటులో ఉంది. దేశవ్యాప్తంగా కోట్ల మంది రైతులు పీఎం కిసాన్ పథకం ద్వారా ప్రతి సంవత్సరం 6000 రూపాయల పెట్టుబడి సాయం పొందుతున్నారు.మొత్తం మూడు విడతలుగా ఒక్కో విడతకు 2000 చొప్పున అందించాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకొని ప్రతి సంవత్సరం ఈ సహాయాన్ని అందిస్తోంది.

**పీఎం కిసాన్ నుండి వారి పేర్లు తొలగింపు**

ఇక ముఖ్యంగా దాదాపు 3,000 మంది రైతులు 19వ విడత పిఎం కిసాన్ నగదు పొందలేకపోయారని తెలుస్తుంది. లబ్ధిదారుల జాబితా నుంచి వారి పేర్లను తొలగించినట్టుగా సమాచారం. కొందరు రైతులు అర్హత లేకపోవడం, ఈ కేవైసీ పూర్తి చేయకపోవడం, ఆధార్ లింకింగ్ లో ఉన్న సమస్యలు, తప్పుడు సమాచారం అందించడం వంటి ఇబ్బందులతో పిఎం కిసాన్ డబ్బులను పొందలేకపోయారని అధికారులు చెబున్నారు.

**ఏపీ, తెలంగాణాలలో సమస్య**

ముఖ్యంగా ఈ సమస్య తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని కొన్ని జిల్లాలలో ఎక్కువగా ఉందని వారు చెబుతున్నారు. గత ఆర్థిక సంవత్సరంలో ఆదాయపన్ను చెల్లించిన రైతులు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగులు, పదివేల రూపాయల కంటే ఎక్కువ పింఛన్ పొందే పింఛన్ దారులు, వ్యవసాయ భూమి సంస్థల పేరుతో ఉన్నవారు ప్రజా ప్రతినిధులు ఈ అనర్హుల జాబితాలో ఉన్నారు.

**ఆధార్ లింక్ లేకపోవటం, సాంకేతిక సమస్యలు**

తెలంగాణ రాష్ట్రంలోనూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కొన్ని జిల్లాలలో రైతులు తమ బ్యాంకు ఖాతాలను ఆధార్ తో లింక్ చేయకపోవడం, తప్పుడు ఖాతాల వివరాలు ఇవ్వడం వంటి సాంకేతిక సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. ఇక ఏపీలో కూడా ఇటువంటి సమస్యలతోనే రైతులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలోనే వీరు పీఎం కిసాన్ డబ్బులను పొందలేకపోయారు.

**రైతులు ఇలా చెయ్యండి**

ఈ సమస్యలను పరిష్కరించుకోవడానికి రైతులు %జూఎని౹అయిఖఅ.స్త్రశీజ.ఱఅ% వెబ్ సైట్ లో తమ స్థితిని తనిఖీ చేసుకొని ఈ కేవైసీ పూర్తి చేసుకోవాలని సూచిస్తున్నారు. సమీపంలో మీ సేవ కేంద్రాలు, వ్యవసాయ శాఖ కార్యాలయాలను సంప్రదించడం ద్వారా సమస్యలను పరిష్కరించుకోవచ్చు అని వారు సలహా ఇస్తున్నారు. సాంకేతిక సమస్యలతో పీఎం కిసాన్ రానివాళ్లను మినహాయించి, పైన పేర్కొన్న అనర్హుల జాబితాలోని వారికి పీఎం కిసాన్ రానట్టే.

## టెస్లా షోరూంలపై కొనసాగుతున్న దాడులు




అమెరికాలో టెస్లా షోరూంపై మళ్లీ దాడి జరిగింది. ఒరెగాన్‌లోని షోరూమ్‌పై గురువారం కొందరు దుండగులు కాల్పులకు దిగారు. ఈ దాడిలో షోరూం అద్దాలు ధ్వంసం కాగా.. పలు వాహనాలు సైతం దెబ్బ తిన్నాయి. అయితే అదృష్టం కొద్దీ ఎవరికీ హాని జరగలేదు. వారం వ్యవధిలో ఇదే షోరూమ్‌పై ఇలా దాడి జరగడం ఇది రెండోసారి కావడం గమనార్హం.డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వంలో ఇలాన్ మస్క్ కీలకంగా మారిన సంగతి తెలిసిందే. ఎప్పుడైతే ఆయన డోజ్ ఓవెల్ ఆఫీస్‌లో అడుగుపెట్టారో.. అప్పటి నుంచి ఆయనపై ప్రజల్లో వ్యతిరేకత మొదలైంది. డోజ్ చీఫ్ పేరిట ఫెడరల్ ఉద్యోగుల తొలింపు చర్యలతో ఆ వ్యతిరేకత పెరుగుతూ వస్తోంది. ఈ క్రమంలో ఆయన సీఈవోగా వ్యవహరిస్తున్న టెస్లా కంపెనీ లక్ష్యంగా వరుసగా దాడులు జరుగుతున్నాయి. మార్చి 6వ తేదీన ఒరెగాన్ పోర్ట్‌లాండ్ సబర్బ్ అయిన టిగార్డ్‌లోని టెస్లా డీలర్‌షిప్‌పై కాల్పులు జరిగాయి. ఈ దాడిలో పలు ఈవీ వాహనాలు ధ్వంసం అయ్యాయి. కొలరాడో లవ్‌ల్యాండ్‌లోని షోరూమ్‌ను ఓ మహిళ ధ్వంసం చేసింది. ఆపై మస్క్ వ్యతిరేక రాతలు రాసి.. బొమ్మలు గీసింది.బోస్టన్‌లోని టెస్లా ఛార్జింగ్ స్టేషన్‌కు దుండగుల నిప్పు సియాటెల్‌లో టెస్లా వాహనాలకు మంట పెట్టిన ఆగంతకులు వాషింగ్టన్ లీన్‌వుడ్‌లో టెస్లా సైబర్ ట్రక్కులపై స్వస్తిక్ గుర్తులతో పాటు మస్క్ వ్యతిరేక రాతలు మార్చి 13వ తేదీన.. ఒరెగాన్ టిగార్డ్ షోరూంపై మరోసారి కాల్పులు.. షోరూం ధ్వంసం వారం వ్యవధిలో రెండుసార్లు ఒరెగాన్ షోరూంపై దాడి జరిగింది. దీంతో ఎఫ్‌బీఐ, ఇతర దర్యాప్తు సంస్థల సమన్వయంతో పని చేస్తామని పోలీసులు ప్రకటించారు. మరోవైపు టెస్లాపై జరుగుతున్న దాడులను దేశీయ ఉగ్రవాదంగా అభివర్ణించిన ట్రంప్.. ఘటనలపై ఉన్నత స్థాయి దర్యాప్తు జరిపిస్తామని చెబుతున్నారు. ఇలాంటి చర్యలు ఓ గొప్ప కంపెనీకి తీరని నష్టం కలిగిస్తాయని.. అమెరికా ఆర్థిక వ్యవస్థకు మస్క్ కంపెనీలు అందిస్తున్న సేవలు మరిచిపోకూడదని ట్రంప్ చెబుతున్నారు.

## ‘స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర’




కాదు. మాది ప్రజా ప్రభుత్వం, ప్రజల సమస్యలు వినేందుకే వచ్చా. పరిపాలనలో సంస్కరణలు తేవాలన్నదే మా ఏకైక లక్ష్యం. గత ప్రభుత్వం పది లక్షల కోట్ల అప్పు మనకు మిగిల్చి వెళ్లింది. అప్పు తీర్చడంతోపాటు వడ్డీ కూడా కట్టాల్సి వస్తోంది. గత సీఎం కనీసం మురికి కాల్వల్లో పూడిక కూడా తీయించలేదు. జగన్ 45 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను వారసత్వంగా ఇచ్చారు. స్వచ్ఛాంధ్ర కోసం ప్రతిఒక్కరూ కంకణం కట్టుకోవాలి. పరిసర ప్రాంతాలన్నీ పరిశుభ్రంగా ఉంచుకోవాలి” అని చంద్రబాబు తెలిపారు.“పేదల పింఛన్లు రూ.3 వేల నుంచి రూ.4 వేలకు పెంచాం. దివ్యాంగులకు పింఛన్ రూ.3 వేల నుంచి రూ.6 వేలకు పెంచాం. చరిత్రలో తొలిసారిగా మధ్యతరగతి కుటుంబాలకు బీమా కల్పిస్తున్నాం. స్వర్ణాంధ్ర-2047 పేరుతో ఒక స్పష్టమైన విధానం తీసుకొచ్చాం. ప్రజల తలసరి ఆదాయం పెంచేందుకు కృషి చేస్తున్నాం” అని సీఎం అన్నారు.ఈ సందర్భంగా అక్టోబర్ 2 నాటికి రాష్ట్రంలో ఎక్కడా చెత్త కనిపించకూడదని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఏ ఊరు వస్తానో చెప్పను, ఆకస్మికంగా వచ్చి తనిఖీ చేస్తానని హెచ్చరించారు. అప్రమత్తంగా ఉండకపోతే చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర తన జీవిత ఆశయమన్న ముఖ్యమంత్రి గతంలో ఆత్మగౌరవం పేరుతో మరుగుదొడ్లు నిర్మాణం చేయించినట్లు చెప్పారు. మళ్లీ కొత్తగా 4 లక్షల 60 వేల మరుగుదొడ్లు నిర్మించబోతున్నామన్నారు. రాష్ట్రాన్ని స్వచ్ఛాంధ్రగా మార్చేందుకు ప్రజలతో పాటు ప్రజా ప్రతినిధులు కూడా కలిసి రావాలని కోరారు.అమరావతిలో రూ.40 వేల కోట్ల పనులకు పచ్చజెండా - త్వరలోనే ప్రారంభం.అంతకుముందు స్థానిక ఎన్టీఆర్ పార్క్ లో పారిశుద్ధ్య కార్మికులతో సీఎం చంద్రబాబు ముఖాముఖిలో పాల్గొన్నారు. వారి సమస్యలు తెలుసుకున్నారు. కార్మికులతో కలిసి ఉద్యానవనంలో చెత్త ఊడ్చారు. అనంతరం కూరగాయల హోల్‌సేల్ మార్కెట్‌ను పరిశీలించారు. వ్యర్థాల నుంచి ఎరువుల తయారీపై సీఎంకు అధికారులు అవగాహన కల్పించారు. కూరగాయల మార్కెట్ నుంచి ఐక్యనగర్ పార్కుకు వెళ్లిన చంద్రబాబు పీ-4 విధానంలో ఉద్యానవనం అభివృద్ధి ప్రణాళిక రూపకల్పనపై అధికారులతో చర్చించారు. జడ్పీ బాలుర పాఠశాల వేదిక వద్దకు స్టాళ్లను పరిశీలించారు. జనపనార ఉత్పత్తులను, చేతి సంచులను చూశారు.

# ప్రధాని మోదీని కలవడంలో రాజకీయం ఏముంది?

మొదటిపేజీ తరువాయి

అభివృద్ధికి దోహదపడతాయని.. అందువల్ల కేంద్రంతో సత్సంబంధాలు కొనసాగించాలన్నారు. కేవలం రాష్ట్ర ప్రయోజనాల కోసమే ప్రధాని మోదీని కలిశానని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. “ప్రధానిని గౌరవించే విజ్ఞత మాది. రాజకీయాలకు వచ్చినప్పుడు నేను కాంగ్రెస్ నేతను.. ఆయన భాజపా నాయకుడు. అవసరమైతే మహేశ్వర్‌రెడ్డిని దిల్లీ తీసుకెళ్తాం. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని నాలుగు సార్లు కలిశాం. నిర్మలాసీతారామన్, అమిత్ షాలను కూడా కలిశాం” అని సీఎం వివరించారు.

**హైదరాబాద్‌ను సర్వనాశనం చేశారు..**

కమీషన్లు తీసుకొని హైదరాబాద్ నగరాన్ని సర్వనాశనం చేశారని సీఎం విమర్శించారు. చెరువులు, కుంటలు మాయం చేశారన్నారు. అపార్ట్‌మెంట్‌లకు తగినట్లు డ్రైనేజీ వ్యవస్థ లేకుండా పోయిందన్నారు. చెరువులు, కుంటలను పునరుద్ధరించాలని ప్రయత్నిస్తుంటే అనవసరంగా గగ్గోలు పెడుతున్నారని అసహనం వ్యక్తం చేశారు. లెక్క లేకుండా అనుమతులిచ్చి నగరంలో గందరగోళం సృష్టించారని గత భారాస ప్రభుత్వ పనితీరుపై మండిపడ్డారు. ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీని ఏర్పాటు చేశాం. ప్రపంచ దేశాలతో పోటీపడేలా నగరాన్ని నిర్మించాలని చూస్తే అడ్డం పడుతున్నారు. పరిశ్రమలు తీసుకొచ్చి అభివృద్ధి చేస్తామంటే అడ్డుపడుతున్నారు. మాజీ సీఎం కేసీఆర్ సలహాలు, సూచనలిస్తే పాటించేందుకు సిద్ధంగా ఉన్నాం. అనుభవం ఉన్న వ్యక్తిగా ఆయన చెప్పినవి పాటిస్తాం.

**అప్పులు పెట్టింది కాకుండా తిరిగి మాపైనే విమర్శలా..**

అప్పులు పెండింగ్‌లో పెట్టి పారిపోతే మేము కట్టుకుంటున్నాం. కేసీఆర్ పాలనలో తప్పులు.. అప్పులే చేశారు. ఈ 15 నెలల కాలమంతా కేసీఆర్ చేసిన అప్పులు, తప్పులు సరిచేయడానికే సరిపోయింది. వాళు పెట్టిన అప్పులకు వడ్డీలు కట్టడమే భారంగా ఉంది. అప్పులు పెట్టింది కాకుండా తిరిగి మాపైనే విమర్శలు



చేస్తున్నారు. డిస్కంలు, సింగరేణి, కాంట్రాక్టర్లకు బిల్లులు పెండింగ్ పెట్టి వెళ్లిపోయారు. రూ.8 లక్షల కోట్ల అప్పులు మాపై వేశారు. రూ.1.52 లక్షల కోట్లు అప్పు చేశామని మాపై బురద జల్లుతున్నారు. ప్రస్తుతం తెలంగాణ అప్పు రూ.7,38,707 కోట్లు. అబద్ధాల పునాదుల మీద ప్రభుత్వాన్ని నడపాలని అనుకోవడం లేదు. ప్రజలే మా బాసులు.. నన్ను సీఎం కుర్చీలో కూర్చోబెట్టిన ప్రజలకు నేను జవాబుదారిగా ఉండాల్సిన బాధ్యత నాపై ఉంది” అని సీఎం వివరించారు.

# విమానాశ్రయాల తరహాలో బేగంపేట రైల్వే స్టేషన్



మొదటిపేజీ తరువాయి

అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం వివిధ రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేస్తోందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్‌తో కలిసి బేగంపేట రైల్వేస్టేషన్‌ను సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడారు. రైల్వేలో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయని కిషన్‌రెడ్డి అన్నారు. త్వరలోనే బేగంపేట రైల్వే స్టేషన్‌ను ప్రారంభిస్తామని తెలిపారు. మరో 10 శాతం పనులు పూర్తి కావాల్సి ఉందని, విమానాశ్రయాల తరహాలో రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేస్తున్నామని అన్నారు.

**ఆ రైల్వేస్టేషన్‌లో అందరూ మహిళలే :** రూ.26.55 కోట్లతో మొదటి విడత పనులు జరుగుతున్నాయని, మరో రూ.12 కోట్లతో రెండో విడత పనులు పూర్తి చేస్తామని కిషన్ రెడ్డి అన్నారు. ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా దశల వారీగా అభివృద్ధి పనులను పూర్తి చేస్తున్నామని తెలిపారు. ఒకప్పుడు రైల్వేస్టేషన్‌కు వస్తే ముక్కు మూసుకొని రావాల్సిన పరిస్థితి ఉండేదని, ప్రధాని నరేంద్ర మోదీ స్వచ్ఛభారత్ ద్వారా స్వచ్ఛ రైల్వేస్టేషన్ పేరుతో వినూత్న మార్పులను తీసుకొచ్చారని గుర్తు చేశారు. చర్లపల్లి రైల్వే స్టేషన్‌ని కూడా అధునాతనంగా నిర్మించుకొని ప్రారంభించుకున్నామని, బేగంపేట రైల్వేస్టేషన్‌లో అందరూ మహిళలే ఉద్యోగులు ఉండేలా చూస్తామని అన్నారు.

**కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పటి విధానాలే ఇప్పటికీ కొనసాగుతున్నాయి :** త్రిభాషా విధానం దేశంలో కొత్తది ఏమీ కాదని, కేంద్ర ప్రభుత్వం బలవంతంగా తమపై హిందీ రుద్దుతోందని దుష్ప్రచారం చేస్తున్నారని కిషన్?రెడ్డి పేర్కొన్నారు. ఏ ఒక్కరిపై కూడా బలవంతంగా హిందీని రుద్దే ప్రయత్నం చేయలేదని, ఏ భాష కావాలంటే అందులో చదువుకునే అవకాశం ఉందని తెలిపారు. తమిళ భాషలో తీసిన సినిమాలు హిందీలో డబ్ చేసి రూ.కోట్లు లాభాలను నిర్మాతలు పొందుతున్నారని, వాళ్లకా లాభాలు ఎలా వస్తున్నాయని ప్రశ్నించారు. భాష పేరుతో దేశాన్ని విభజించాలని చూడటం సరికాదని అన్నారు.సీఎంగా స్టాలిన్ ఏం చేశాడో చెప్పి తమిళనాడు ప్రజల్ని ఓట్లు అడగాలని కోరారు. ఆయనేం చేయలేదు కాబట్టే భాష పేరు మీద దుష్ప్రచారం చేస్తూ ఎన్నికలు దాటేయాలని చూస్తున్నారని అన్నారు. పునర్విభజనకు సంబంధించి 2009 సంవత్సరంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పటి విధానాలే ఇప్పటికీ కొనసాగుతున్నాయని అన్నారు. పార్లమెంట్ నియోజకవర్గాల పునర్విభజనపై కొత్త విధానం రాలేదని, డీ లిమిటేషన్ చేస్తే సీట్లు తగ్గుతాయనేది దుష్ప్రచారం మాత్రమేనని అన్నారు.“బేగంపేట రైల్వే స్టేషన్‌లో పునరాభివృద్ధి పనులు ప్రారంభించాం. త్వరలోనే బేగంపేట రైల్వే స్టేషన్‌ను ప్రారంభిస్తాం. విమానాశ్రయాల తరహాలో రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేస్తున్నాం. రైల్వేలో విప్లవాత్మక మార్పులు వస్తున్నాయి.

# బహు భాషా విధానంపై నా వైఖరి మారలేదు

మొదటిపేజీ తరువాయి

హిందీ భాష అమలు విషయంలో తప్పుడు కథనాలను వ్యాప్తి చేయడం ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం తప్ప మరొకటి కాదు. ఎన్ఈపీ-2020 ప్రకారం విద్యార్థులు విదేశీ భాషతో పాటు ఏవైనా రెండు భారతీయ భాషలు నేర్చుకునే వెసులుబాటు ఉంటుంది. హిందీ వద్దనుకుంటే వారి మాతృ భాషతో పాటు తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ, మరాఠీ

ఇలా ఏదైనా ఇతర భారతీయ భాషను ఎంచుకోవచ్చు. విద్యార్థులకు ఎంపిక చేసుకునే సాధికారత కల్పించడం ద్వారా జాతీయ ఐక్యతను ప్రోత్సహించడం, భారతదేశ గొప్ప భాషా వైవిధ్యాన్ని కాపాడటం కోసం బహుభాషా విధానాన్ని రూపొందించారు.

దీన్ని రాజకీయ అజెండా కోసం తప్పుగా అర్థం చేసుకోకూడదు. బహు భాషా విధానంపై పవన్ కల్యాణ్ తన వైఖరిని మార్చుకున్నారని చెప్పడం పూర్తిగా అవగాహనా రాహిత్యమే అవుతుంది.

ప్రతి భారతీయుడికి భాషా స్వేచ్ఛ, విద్యను ఎంపిక చేసుకొనే స్వేచ్ఛ ఉండాలన్న విషయంలో జనసేన పార్టీ కట్టుబడి ఉంది.



# బెట్టింగ్ యాప్‌లపై యుద్ధం

మొదటిపేజీ తరువాయి

గత కొన్ని రోజులుగా దేశవ్యాప్తంగా బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్లు చర్చనీయాంశంగా మారాయి. చాలా మంది యువత ఈ యాప్స్‌కు బానిసై అప్పుల్లో కూరుకుపోతున్నారు. ఫలితంగా ఆర్థికంగా నష్టపోయి, కొందరు తీవ్ర నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఈ బెట్టింగ్ యాప్స్‌ను అనేక మంది సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు విస్తృతంగా ప్రమోట్ చేస్తున్నారు.ఈ నేపథ్యంలో, ఐపీఎస్ అధికారి, టీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ తమదైన శైలిలో స్పందిస్తున్నారు. అమాయక యువతను బెట్టింగ్ వైపు మళ్లిస్తున్న సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లపై చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీసులకు సూచించారు. ఇటీవల ఏపీకి చెందిన యూట్యూబర్ లోకల్ బాయ్ నాని, రైడర్ భయ్యా సన్నీ యాదవ్‌పై నమోదైన కేసుల్లో సజ్జనార్ కీలక పాత్ర పోషించిన విషయం తెలిసిందే. తాజాగా, ఆయన ప్రముఖ యూట్యూబర్ హర్ష సాయి పై కూడా దృష్టి సారించారు.సజ్జనార్ హర్ష సాయికి సంబంధించిన ఓ వీడియోను షేర్ చేశారు, ఇందులో హర్ష సాయి తన బెట్టింగ్ యాప్ ప్రమోషన్లను సమర్థించుకుంటూ మాట్లాడుతూ కనిపించారు. “నేను ప్రమోట్ చేయకపోతే వేరే వాళ్లు చేస్తారు, కనుక ఇది తప్పు కాదు” అంటూ ఆయన వ్యాఖ్యానించారు. దీనిపై స్పందించిన సజ్జనార్, “తప్పే చేస్తున్నా, దాన్ని సమర్థించుకోవడం సరికాదు. అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నా కనీస బాధ్యత లేకుండా డబ్బే ముఖ్యం అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు” అంటూ ఆయన మండిపడ్డారు. ఆయన యువతను ఇలాంటి ఇన్‌ఫ్లుయెన్సర్లను అన్‌ఫాలో చేయాలని, వారి అకౌంట్లను రిపోర్ట్ చేయాలని సూచించారు. అలాగే, ఈ వీడియోను కేంద్రం, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, సైబర్ పోలీసులకు ట్యాగ్ చేశారు. దీంతో ఈ అంశం వైరల్‌గా మారింది.సజ్జనార్ తన ట్విట్టర్ ఖాతా ద్వారా,




“బెట్టింగ్ యాప్‌ల ప్రమోషన్లను అరికట్టేందుకు మనమందరం కలిసి కృషి చేయాలి. అనేక మంది ప్రాణాలను రక్షించాలి” అంటూ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ ఉద్యమంలో అందరూ భాగస్వాములు కావాలని, సామాజిక మార్పు కోసం తమ వంతు ప్రయత్నం చేయాలని పిలుపునిచ్చారు. అతడి తాజా చర్యలు మరికొందరు ఇన్‌ఫ్లుయెన్సర్లను కూడా బేరీజు వేసుకునేలా చేస్తున్నాయి.

# డ్యాన్స్ చేయకపోతే సస్పెండ్ చేస్తా




వీడియో నెట్టింట వైరల్ అవుతుండగా.. అంతా విమర్శలు గుప్పిస్తున్నారు. ఆ పూర్తి వివరాలు మీకోసం.రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్జేడీ) నాయకుడు తేజ్ ప్రతాత్ సింగ్ యాదవ్ శనివారం రోజు పాట్నాలోని తన అధికారిక నివాసంలో పార్టీ కార్యకర్తలతో కలిసి హోలీ సంబురాలు చేసుకున్నారు. అయితే ఆ వేడుకల్లో పాల్గొన్న వారంతా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుని ఫొటోలు దిగారు. ఆపై ఓ చోట కూర్చుని కార్యక్రమం నిర్వహించుకున్నారు. ఈక్రమంలోనే బందోబస్తు కోసం అక్కడకు వచ్చిన ఓ పోలీసు అధికారి కూడా యూనిఫామ్ వేసుకుని నిలబడి ఉన్నారు.అయితే ఈ విషయం గుర్తించిన ఆర్జేడీ నాయకుడు తేజ్ ప్రతాప్ సింగ్ యాదవ్.. పోలీసు అధికారికి ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా ఇప్పుడు ఒక పాట ప్లే చేస్తామని అందుకు నువ్వు నృత్యం చేయాల్సి ఉంటుందని చెప్పారు. ఒకవేళ నువ్వు డ్యాన్స్ చేయకపోతే నిన్ను సస్పెండ్ చేస్తామంటూ హెచ్చరికలు జారీ చేశారు. దీంతో ఏం చేయాలో పాలుపోని అధికారి.. తెగ ఇబ్బంది పడిపోతూనే రెండు స్టెప్పులు వేశారు. ప్రస్తుతం ఇందుకు సంబధించిన వీడియో నెట్టింట వైరల్ అవుతుండగా.. అంతా తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు.ముఖ్యంగా బీజేపీ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా మాట్లాడుతూ.. తండ్రిలాగే కొడుకు ఉన్నాడంటూ చెప్పారు. ఆయన తండ్రి లాలూ ప్రసాద్ యాదవ్ కూడా ముఖ్యమంత్రిగా పని చేస్తున్న సయమంలో చట్టాన్ని చేతుల్లోకి తీసుకున్నారని ఆరోపించారు. ఇప్పుడు కొడకు అధికారంలో లేకపోయినా.. బెదిరింపులు, ఒత్తిడి ద్వారా చట్టాలను, చట్టాన్ని కాపాడేవారిని ఇబ్బంది పెడుతున్నారని విమర్శించారు. నృత్యం చేయకపోతే ఉద్యోగంలోంచి సస్పెండ్ చేస్తామని బెదిరించడం చాలా దారుణం అంటూ వ్యాఖ్యానించారు.అలాగే దీనిపై జేడీయూ అధికార ప్రతినిధి రాజీవ్ రంజన్ ప్రసాద్ స్పందించారు. బిహార్ ప్రజలు పూర్తిగా మారిపోయాయని.. ఇప్పుడు వారు అందరినీ చూస్తూ ఏది మంచి, ఏది చెడో నిర్ణయించుకుంటున్నారని వివరించారు. తేజస్వీ యాదవ్‌కు అయినా, తేజ్ ప్రతాప్ యాదవ్‌కు అయినా.. తప్పు ఎవరు చేసినా ప్రజలు గుర్తించి వారికి గట్టిగా బుద్ధి చెబుతున్నారని పేర్కొన్నారు.

# సెంట్ పీటర్స్ టాలెంట్ స్కూల్లో ఘనంగా కాన్ఫరెన్స్ (ఎస్ఎల్సి) కార్యక్రమం



**తెలంగాణ సేన :** సిద్దిపేట జిల్లా గజ్వేల్ తూప్రాన్ రోడ్డు గల సెంట్ పీటర్స్ టాలెంట్ స్కూల్లో ఘనంగా విద్యార్థి నేతృత్వంలోని కాన్ఫరెన్స్ (ఎస్ఎల్సి) కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జానెట్ హాజరై కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఫాదర్ ఫిలిక్స్ ,కరస్పాండెంట్ సేవియర్ వారు మాట్లాడుతూ విద్యార్థులు తన విద్యార్థుల జ్ఞానం మరియు నైపుణ్యాలను ప్రదర్శించే వార్షిక విద్యార్థులనేతృత్వంలోని సమావేశం (ఎస్ ఎల్ సి )ను నిర్వహించి కార్యక్రమంలో సైన్స్ ఎగ్జిబిషన్ మరియు కళలు మరియు చేతిపనుల ప్రదర్శన కూడా చేశారు అన్నారు ప్రారంభించబడిన విద్యార్థుల నేతృత్వంలోని సమావేశం, 1 నుండి 5 వ తరగతి వరకు విద్యార్థులు తమ జ్ఞానం మరియు నైపుణ్యాలను స్వతంత్రంగా ప్రదర్శించడానికి ఒక వేదికను అందిస్తుంది. ప్రతి తరగతి వారి సబ్జెక్టులకు సంబంధించిన అంశాన్ని ఎంచుకుని, వారి ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంతో దానిని ప్రదర్శిస్తుంది. విద్యార్థుల ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడం, వారి అభ్యాసాన్ని ప్రదర్శించడానికి ఒక వేదికను అందించడం మరియు వారి పిల్లల విద్యా పురోగతిని అర్థం చేసుకోవడంలో తల్లిదండ్రులను నిమగ్నం చేయడం ఈ సమావేశం లక్ష్యం హౌస్ సైన్స్ ఎగ్జిబిషన్ కూడా జరిగింది, దీనిలో పాఠశాలలోని నాలుగు గృహాలు వివిధ శాస్త్రీయ ప్రదర్శనలలో పోటీపడ్డాయి. కార్యక్రమంలో తల్లిదండ్రులను ఇటువంటి సమావేశం నిర్వహించడం వల్ల మా పాఠశాల విద్యార్థుల ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడం, వారి ప్రతిభను ప్రదర్శించడానికి మరియు వారు తమ పాఠశాలలో ఎంత నేర్చుకున్నారో చూపించడానికి ఒక వేదికను అందించడం జరుగుతుంది. ఇది పాఠశాలలో ఏమి జరుగుతుందో తల్లిదండ్రులకు చూపించడానికి అవకాశాన్ని కూడా ఇస్తుంది" అని అన్నారు. తల్లిదండ్రులతో సంభాషించినప్పుడు వారు సమావేశం పట్ల సంతృప్తి చెందారని మరియు విద్యార్థులు చురుకుగా పాల్గొనడం చూసి చాలా సంతోషంగా ఉన్నారని మేము తెలుసుకోగలిగాము .శనివారం, పాఠశాల ప్రాంగణం విద్యార్థులు మరియు ఆసక్తిగల తల్లిదండ్రులతో నిండిపోయింది, విద్యార్థుల నేతృత్వంలోని సమావేశం మరియు ప్రదర్శనను వీక్షించడానికి వచ్చారు ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఫాదర్ ఫిలిక్స్ ,కరస్పాండెంట్ సేవియర్ ఉపాధ్యాయులు యాజమాన్యం మరియు సిబ్బంది విద్యార్థుని విద్యార్థులు పాల్గొన్నారు.

# స్వర్ణ గిరిలో శోభాయమానంగా శ్రీవారి వసంతోత్సవం



**భువనగిరి, మార్చ్ 15 తెలంగాణ సేన న్యూస్ :** శ్రీవారి వసంతోత్సవం స్వర్ణ గిరి వెంకటేశ్వర స్వామి ఆలయంలో శోభాయమానంగా నిర్వహించారు.అంగరంగ వైభవంగా స్వామి వారి నిత్య కళ్యాణోత్సవం జరిగింది.ప్రాతః కాలంలో అర్చక స్వాములు సుప్రభాత సేవను విశేషంగా ఆకట్టుకుంది. సుప్రభాతసేవ అనంతరం శ్రీ మహాలక్ష్మి అమ్మవారు, ముప్పది మూడు కోట్ల దేవతలు కొలువుతీరినట్టి గోపృష్ఠ దర్శనాన్ని చేయించడం జరిగింది.వేకువజామున 5:45 నిమిషాలకు నిత్యారాధన నిమిత్తం అర్చక స్వాములు వేదమంత్రోచ్చారణలతో సువర్ణ బిందె తీర్థమును బంగారుబావి నుండి తీసుకువచ్చారు.ఉదయం 6 గంటలకు అలంకార ప్రియుడైన స్వామి వారికి అర్చక స్వాములు మేళతాళ మృదంగ మంగళ ధ్వనుల మధ్య సుగంధ భరితమైన పుష్పమాలలతో తోమాల సేవను నయన మనోహరంగా నిర్వహించారు.ఉదయం 7 గంటలకు మని మయ శోభిత స్వర్ణాభరణాలతో పరిమళభరిత పుష్పమాలలతో శోభాయమానంగా అలంకరించి సహస్ర నామార్చన సేవను ఘనంగా నిర్వహించారు.ఈరోజు ఉదయం స్వర్ణగిరి క్షేత్రంలో లోక కళ్యాణం కోసం అర్చక స్వాములు శ్రీ సుదర్శన నారసింహ హవనంను నిర్వహించారు.స్వామి వారి దివ్యక్షేత్రం లో శ్రీ అష్టలక్ష్మి మండపంలో శ్రీ పద్మావతి గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి పంచామృతములు, పసుపు, సుగంధ ద్రవ్యాలతో వేదమంత్రోచ్చారణలతో వసంతోత్సవ సేవను శోభాయ మానంగా నిర్వహించడం జరిగింది. అనంతరం అర్చక స్వాములు కర్పూర



మంగళహారతులు సమర్పించారు.ఉదయం 10:30 లకు విశ్వేశ్వరుడైన పట్టు పీతాంబరాలు ధరింపజేసి మరియు సుగంధ భరిత పుష్పమాలలతో అలంకరించి అర్చక స్వాములు స్వామివారి నిత్య కళ్యాణ మహోత్సవాన్ని శ్రీవారి వైభవోత్సవ మండపంలో వేదమంత్రాలతో మంగళ ధ్వనుల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు.భక్తులు శ్రీ స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని తిలకించి ఆనంద పరవశు లైనారు.ప్రతిరోజు అన్న ప్రసాద వితరణలో భాగంగా ఈరోజు సుమారు 5000 మందికి పైగా భక్తులు నిత్యాన్న ప్రసాదాన్ని స్వీకరించారు.సాయంత్రం 6:30 కు ఆదిమధ్యాంతరహితుడైన స్వామి వారిని మాడవీధులలో శోభాయ మానంగా ఊరేగిస్తూ భక్తుల గోవింద నామస్మరణలతో మేళతాళ మృదంగ మంగళ ధ్వనుల మధ్య శ్రీ స్వామివారికి తిరువీధి ఉత్సవ సేవను ఘనంగా నిర్వహించారు.తిరువీధి ఉత్సవ సేవ అనంతరం శ్రీ పద్మావతి గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారు జాజ్వల్యమానంగా వెలుగుతున్న సహస్రదీప కాంతుల మధ్య ఊయలలో ఆసీనులై భక్తులకు దర్శనమిచ్చారు అర్చక స్వాములు వేదమంత్రోచ్చారణలతో శ్రీ స్వామివారికి మంగళహారతులు సమర్పించారు భక్తులు నయనానందకరంగా శ్రీవారినీ దర్శించుకున్నారు.భారత దేశంలో స్వర్ణగిరి క్షేత్రంలో తప్ప మరెక్కడా లేని జలనారాయణ స్వామి వారికి శనివారం సందర్భంగా నక్షత్ర హారతిని భక్తుల గోవింద నామ స్మరణల మధ్య సమర్పించారు.

# భగత్ సింగ్ వర్ధంతి సభలు కాగడాల ప్రదర్శన జిల్లా వ్యాప్తంగా జరుపుకుందాం

**దేశభక్తి పట్ల భగత్ సింగ్ రాజగురు సుఖదేవుల ను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలి**

**దక్షిణాది పై బలవంతంగా రుద్దాలనుకుంటున్న త్రిభాషా విధానాన్ని వ్యతిరేకిద్దాం**

**మతం పేరుతో యువతని పక్కదారి పట్టించి దేశాన్ని వెనక్కి నెట్టేస్తున్న కాషాయం**

**కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో 50 రూపాయలు ఉన్న డాలర్ విలువ నేడు 87 రూపాయలకు**

**బిజెపి ఆర్ఎస్ఎస్ నిజమైన భావజాలాన్ని యువత అర్థం చేసుకోవాలి**

**ప్రగతిశీల యువజన సంఘం పివైఎల్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బేజాడి కుమార్**



**భువనగిరి మార్చు 15 తెలంగాణ సేన న్యూస్ :** భగత్ సింగ్ 94 వ వర్ధంతి సభలు, కాగడాల ప్రదర్శన జిల్లా వ్యాప్తంగా జరుపుకుందాం అని ప్రగతిశీల యువజన సంఘం పి వై ఎల్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బేజాడి కుమార్ పిలుపునిచ్చారు.ఆలేరు పట్టణం లోని న్యూ డెమోక్రసీ పార్టీ కార్యాలయంలో జరిగిన పివైఎల్ జిల్లా కమిటీ సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొని కుమార్ మాట్లాడారు.భారత దేశ స్వాతంత్ర్య కోసం 23 ఏళ్ల పిన్న వయసులోనే తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన వేగు చుక్కలు భగత్ సింగ్, రాజగురు, సుఖదేవులు అని శ్లాఘించారు. 94వ వర్ధంతి సభలు జిల్లా వ్యాప్తంగా గ్రామ గ్రామాన వాడ వాడల జరపాలని తెలిపారు. కుమార్ మాట్లాడుతూ వ్యాపారం కోసం వచ్చి ఈ దేశ ప్రజలని బానిసలుగా చేసి 200 ఏళ్ళు పాలించిన బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకంగా పోరాడి, తమ అమూల్యమైన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడి వీరమరణం పొందిన భగత్ సింగ్ తన సహచరులు రాజగురు, సుఖదేవులు ఈ దేశ యువతకి ఆదర్శమని, తమ స్వార్థం మాత్రమే చూస్కొని బ్రతుకుతున్న ఈనాటి యువత దేశం కోసం దేశ ప్రజల కోసం ఎలా బతకాలో భగత్ సింగ్ ని చూసి నేర్చుకోవాలి అని అన్నారు. మతం పేరుతో యువతని పక్కదారి పట్టించి, ఈ దేశాన్ని వెనక్కి నెట్టేస్తున్న బీజేపీ , ఆర్.ఎస్.ఎస్. నిజమైన భావజాలాన్ని యువతరం అర్థం చేసుకోవాలనీ, మన దేశంతో ఏ విధంగా పోటీ పడ లేని పాకిస్తాన్ని బూచి గా చూపించి, పాకిస్తాన్ మనల్ని ఏదో చేస్తుంది అనే అబద్ధపు ప్రచారాన్ని చేస్తూ దేశ సమస్యల నుంచి ప్రజల దృష్టి మళ్లిస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో 50 రూపాయలు ఉన్న డాలర్ విలువ నేడు 87 రూపాయలకు పెరిగిందని, 50 రూపాయలు ఉంటేనే రూపాయి ఐ.సీ.యూ.లో చేరింది అన్న నరేంద్ర మోడీ ఇప్పుడు 87 కి చేరితే కిమ్ అనటం లేదు ఎందుకు అన్నారు . హిందూ ముస్లిం గొడవలతో ప్రభుత్వాన్ని కొనసాగిస్తున్నారని, నిరుద్యోగం,పెట్రోల్,డీజిల్ ధరల పెరుగుదల తద్వారా నిత్యావసర ధరలు పెరుగుదల, మతపరమైన హింసా లాంటి ఎన్నో సమస్యలు దేశంలో ఉంటే ఎప్పటి లాగే ఏదో ఒక కొత్త విషయాన్ని తెచ్చి పక్కదారి పట్టించే ప్రక్రియలో భాగంగా త్రిభాషా విధానాన్ని ముందుకు తెచ్చాడని, ఉత్తర భారతన తెలుగు, తమిళ్ లాంటి భాషలు లేనప్పుడు దక్షిణాన హిందీ ఎందుకనీ, మాతృభాష రక్షణ కోసం తప్పనిసరిగా ఉద్యమించాలని, బలవంతంగా హిందీ రుద్దాలని చూస్తే తిరుగుబాటు తప్పదని ఈ సందర్భంగా హెచ్చరించారు. అదే విదంగా అధికారంలోకి వచ్చి కేసీఆర్ పాలనకు భిన్నంగా మేం పరిపాలిస్తాం అన్న రేవంత్ రెడ్డి కేసీఆర్ బాటలోనే నడుస్తున్నాడనీ, ఇచ్చిన ఆరు గారెంటీలను గంగలో కలిపాడని, యువతకు ఉద్యోగ కల్పన, అది ఆలస్యమైతే నిరుద్యోగ భృతి ఇస్తానని 14 నెలలు గడిచినా ఏదీ ఇవ్వకుండా మోసం చేశాడని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ ఉద్యమించాల్సిన కర్తవ్యం యువతపై ఉందని గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో ప్రగతిశీల యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సాదుల శ్రీకాంత్, జిల్లా సహాయ కార్యదర్శి చిరబోయిన బాలకృష్ణ, కోశాధికారి పగడాల శివ, జిల్లా నాయకులు దడిగే కృష్ణ, ఆకుల కృష్ణ,పోతగల నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

# పట్టాలు పొందిన వారికి ఇందిరమ్మ ఇండ్ల నిర్మించి ఇవ్వండి

**సర్వే నెంబర్ 252 లో 36 మంది పట్టాల లబ్ధిదారులు**

**రావుల కిష్టయ్య ఇంటి నుంచి వడ్డబోయిన స్వామి ఇంటి వరకు సిసి రోడ్డు నిర్మాణం వెంటనే చేపట్టాలి**

**సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ**




**భువనగిరి , మార్చ్ 15 తెలంగాణ సేన న్యూస్ :** పాతిక సంవత్సరాలకు పూర్వమే ఇంటి స్థలాల పట్టాలు పొందిన వారికి, ఇండ్లు నిర్మించి ఇవ్వాలని, సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు నరసింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పోరు బాట కార్యక్రమంలో భాగంగా శనివారం మండలం చీమలకొండూరు గ్రామంలో సమస్యలపై అధ్యయనం చేశారు.ఈ సందర్భంగా నర్సింహ మాట్లాడుతూ, 1999లో నాటి ప్రభుత్వం సర్వే నెంబర్ 252లోని రెండు ఎకరాల భూమిని 36 మంది లబ్ధిదారులుగా, నిరుపేదలకు ఇండ్ల స్థలాలు ఇచ్చినప్పటికీ, నేటికి ఆర్థిక స్తోమత లేక పోవడంతో ఇండ్లు నిర్మించు కోలేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు . గత ప్రభుత్వము డబల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మాణం చేపట్టి లబ్ధిదారులకు అప్పగిస్తాం అని చెప్పి 10 సంవత్సరాలు కాలం వెల్ల దీశారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు ఇస్తానని చెప్తున్న పరిస్థితులలో ఆ ప్లాట్లు ఉన్న ప్రతి ఒక్కరికి 15 లక్షల రూపాయలు ఇంటి నిర్మాణానికి ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీ బాధ్యత తీసుకొని ఆ ప్లాట్ల స్థలాలలో పెరిగిన పిచ్చి మొక్కలు, కంప చెట్లను తొలగించి లబ్ధిదారులకు ఇవ్వాలని సూచించారు. కొత్త కాలనీలో సీసీ రోడ్డు లేక అవార్డులో 30 కుటుంబాలు గత 25 సంవత్సరాలుగా బాధపడుతుంటే ,ఎందుకు పాలకులు పట్టించుకోరని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రావుల కృష్ణయ్య ఇంటి నుండి వడ్డెబోయిన స్వామి ఇంటి వరకు ,సిసి రోడ్డు లేకపోవడంతో పాములు, తేళ్లు, క్రిమి కీటకాలు వచ్చి ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారని, ఇప్పటికైనా రోడ్డు నిర్మాణం చేయాలని కోరారు. సిపిఎం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోరాటాలలో ప్రజలు పాల్గొనాలని నర్సింహ కోరారు. ఇంకా ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి పల్లెర్ల అంజయ్య, శాఖ కార్యదర్శి బోడ ఆంజనేయులు, సిపిఎం నాయకులు, గ్రామ ప్రజలు పల్లెర్ల వినోద్, నార్కాడపు గోపాల్, జంగంపల్లి రాములు, నార్కాడపు స్వామి, పల్లెర్ల పెద్ద అంజయ్య, ఎలిమినేటి అయియ్య, పల్లెర్ల పెద్ద స్వామి, డప్పు పోచమ్మ, పల్లెర్ల స్వామి, లాలయ్య అంజయ్య, లింగయ్య, శ్రీనివాసు, మల్లమ్మ, భారతమ్మ, జానమ్మ, పద్మ, రాంనర్సమ్మ ,అంజమ్మ, జంగంపల్లి రాములు, ఎలిమినేటి ఐలయ్య, కిషన్, స్వామి, రమేష్ ,సాయమ్మ, సుగుణ, లక్ష్మి, మాతమ్మ, శంకరమ్మ, శ్రీశైలం, సుగుణ, పద్మ, శ్రీనివాస్, లాలయ్య తదితరులు పాల్గొన్నారు.

# బుట్టాయిగూడెంలో కాళోజి గ్రంధాలయం ప్రారంభించిన తెలంగాణ కన్వీనర్ కవితా రెడ్డి



**కన్నాయిగూడెం : తెలంగాణ సేన న్యూస్ :** ఈరోజు కన్నాయిగూడెం మండలం బుట్టాయిగూడెం గ్రామంలో గ్రామస్థుల సహకారంతో జెడి లక్ష్మినారాయణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ శ్రీమతి కవిత రెడ్డి చేతుల మీదుగా గ్రంథాలయం ప్రారంభించారు. ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బుట్టాయిగూడెం గ్రామానికి చెందిన యువకుడు, విద్యావేత్త, నిత్య ప్రజా సమస్య లపైన పోరాడే యువకుడు దుర్గం రాజ్ కుమార్ బుట్టాయిగూడెం యువతీ, యువకులు, గ్రామ ప్రజలు హాజరైనారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కవిత రెడ్డి మాట్లాడుతూ జేడీ లక్ష్మినారాయణ పౌండేషన్ అనేది పేద ప్రజల కోసం ప్రజలకు ఎన్ని సమస్యలు వున్నా పౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామ స్థాయిలో గానీ మండలం లో గానీ ఎక్కడైనా పౌండేషన్ పేదలకు ఉపయోగ పడుతుందని తెలియజేశారు. పౌండేషన్ ఆధ్వర్యంలో పేద పిల్లల చదువులకు ఎంత ఖర్చు అయినా పౌండేషన్ భారయిస్తుందని డాక్టర్ అంబేద్కర్ చెప్పినట్లు అక్షరం చాలా విలువైనది అని నేటి బాలలు దేశ పౌరులు అని అన్నారు. ఇక్కడ గ్రంథాలయంలో కావాల్సిన అన్ని రకాల సాహిత్యం ఇచ్చినారు. అదే విధంగా బుట్టాయిగూడెం గ్రామ యువ నాయకుడు దుర్గం రాజ్ కుమార్ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతమైన బుట్టాయిగూడెం గ్రామంలో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయడం చాలా సబతోషమని ఈ గ్రంథాలయం %జఞాఖీ% పోలీస్ శాఖ ఫండ్స్ నుండి కట్టించడం జరిగిందని, ఈ గ్రంథాలయం నిర్మించిన నుండి ఇప్పటి ఎవరు పట్టించుకోలేదని, ప్రస్తుతం పౌండేషన్ గ్రంథాలయాన్ని ఓపెన్ చేసి, గ్రంథాలయానికి కావాల్సిన పాఠ్య పుస్తకాలు అందజేయడం చాలా సంతోషకరమని అన్నారు. ఇక్కడ యువతీ, యువకులు అలాగే కన్నాయిగూడెం మండల నిరుద్యోగులు ఈ గ్రంథాలయాన్ని వినియోగించుకొని పై చదువులు చదివి ఈ సమాజానికి ఉపయోగ పడాలని తెలియజేస్తూ జిల్లా గ్రంథాలయ చైర్మన్, అలాగే స్థానిక మంత్రి శ్రద్ధ తీసుకొని గ్రంథాలయానికి కావాలిసిన మెటీరియల్, గ్రంథాలయం మైనర్ రిపేర్ అలాగే గ్రంథాలయానికి కావాల్సిన పుస్తకాలు ఏర్పాటు చేస్తూ గ్రంథాలయంలో ఈ గ్రామానికి చెందిన ఒక నిరుద్యోగిని కేటాయిస్తూ వెంటనే చర్యలు చేపట్టాలని, ప్రభుత్వం పూర్తి బాధ్యత తీసుకోవాలని తెలియజేశారు. అదేవిధంగా ఈ మండలంలో యువతీ, యువకులు పెద్ద చదులు చదివి మండలానికి మంచి పేరు తీసుకురావాలని కోరినారు. ఇట్టి గ్రంథాలయ ఓపింగ్ కార్యక్రమం లో మండలంలోని యువతీ, యువకులు, గ్రామం లోని ప్రజలు భారీ ఎత్తున తరలి వచ్చి కాయాక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్, కుమ్మరి వెంకట్, కావేరి నరసింహారావు, జనగాం దశంకరరావు, సునార్కని మల్లేష్, జనకం సమ్మయ్య, కుమ్మరి కోటేష్, దుర్గం రవి, చిలుముల రాంబాబు, చిలుముల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# బీసీలకు మద్దతు సినీ నటులు సుమన్



**శేర్లింగంపల్లి నియోజకవర్గం తెలంగాణ సేన న్యూస్ :** మర్యాదపూర్వకంగా కలిసిన బిసి ఐక్య వేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు..రామచందర్ యాదవ్ ఈ సందర్భంగా బీసీలకు మద్దతుగా అండగా ఉంటానని సినీ హీరో సుమన్ మాట్లాడుతూ .బీసీలందరూ ఐక్యంగా ముందుకు సాగాలని బీసీల బలోపేతానికి నేను అహర్నిశలు కృషి చేస్తానని అన్నారు.ఈ కార్యక్రమంలో బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు తెలంగాణ రాష్ట్ర గొర్రెల మేకల పెంపకం వృత్తిదారుల సంఘం రాష్ట్ర సలహాదారి భేరి రామచందర్ యాదవ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో మరియు ఆంధ్రప్రదేశ్లో బీసీలకు దామాషా పద్ధతిన రిజర్వేషన్లు కల్పనకై మీ మద్దతు కావాలని కోరగా వారు సానుకూలంగా స్పందిస్తూ మేము సైతం బీసీలకు పూర్తి మద్దతు తెలియజేస్తున్నాము బీసీల హక్కులకై పోరాటంలో భాగస్వాములమైతామని అన్నారు.నాయకులు టీఎస్ జిఎం టీవీఎస్ రాష్ట్ర సలహాదారి జాతీయ బీసీ కౌన్సిల్ మెంబర్ మహేంద్ర నాథ్ యాదవ్ సర్పంచుల ఫోరం వ్యవస్థాపకులు రాష్ట్ర అధ్యక్షులు సౌధాని భూమన్న యాదవులు పాల్గొన్నారు.

# బోరు బావి వేయించిన ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి



**భువనగిరి, తెలంగాణ సేన న్యూస్ :** వడపర్తి గ్రామము లో నీటి కొరత తీర్చుటకు భువనగిరి శాసన సభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి బోరు బావి వేయించారు.ఈ కార్యక్రమము లో వాడపర్తి తాజా మాజీ సర్పంచ్ మరియు కాంగ్రెస్ పార్టీ భువనగిరి మండల అధ్యక్షులు ఎలిమినేటి కృష్ణ రెడ్డి,మాజీ వార్డ్ సభ్యులు ఎర్ర మహేష్,షేక్ శనూర్ బాబా,మెడబోయిన నరసింహ,రాజా శేఖర్,షేక్ జహంగీర్,మహేష్ పాల్గొన్నారు.

# ఎస్సీలను మోసం చేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి



**జూబ్లీహిల్స్ నియోజకవర్గం తెలంగాణ సేన న్యూస్ :** ఈరోజు పద్మ శ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు.జూబ్లీహిల్స్ నియోజకవర్గం రహమత్ నగర్ డివిజన్ సమన్వయకర్త ఎం చిన్న మాదిగ ఆధ్వర్యంలో రహమత్ నగర్ చౌరస్తా అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించే అంతవరకు ఎటువంటి ప్రభుత్వ ఉద్యోగ నియమకాలు చేపట్టకూడదని డిమాండ్ చేస్తూ,గ్రూప్ 1,2, 3 నియామకాలు తక్షణమే నిలిపివేయాలని జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో వర్గీకరణ బిల్లుకు దామశ ప్రకారం ప్రకారం చట్టబద్ధత కల్పించాలని ఎంఆర్పిఎస్ పక్షన డిమాండ్ చేయడం జరిగింది. బిడ్డ రేవంత్ రెడ్డి నీకు మాదిగలు నీ చావు డబ్బు కొట్టే రోజులు దగ్గరలో ఉన్నాయి.ఈ కార్యక్రమంలో పాల్గొన్న నియోజకవర్గ ఇంచార్జ్ రామకృష్ణ మాదిగ ఎం,ఎస్,పి హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొంద్రపల్లి శివకుమార్ మాదిగ. సీనియర్ నాయకులు సోమరాజు సీనియర్ నాయకులు పరశురాం మాదిగ,మాదిగ వెంగళరావు నగర్ డివిజన్ అధ్యక్షులు భవాని రాజు మాదిగ, శ్రీనగర్ కాలనీ డివిజన్ సమన్వయకర్త పురుషోత్తం మాదిగ, డివిజన్ నాయకులు యూసుఫ్ గూడా డివిజన్ ఫ్రేమ్ మాదిగ, చింటూ మాదిగ,బన్నీ మాదిగ, భాను ప్రకాష్ మాదిగ,త్రిపుల్ పాల్గొన్నారు.

# ఘనంగా మాన్యశ్రీ కాన్షిరాం 91 జయంతి వేడుకలు



**తెలంగాణ సేన న్యూస్ :** యాదాద్రి భువనగిరి జిల్లా, చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని బస్టాప్ పరిధిలో బహుజన్ సమాజ్ పార్టీ వ్యవస్థాపకులు మాన్యశ్రీ కాన్షిరం గారి 91వ జయంతిని చౌటుప్పల్ మున్సిపాలిటీ మరియు మండల కమిటీ ఆధ్వర్యంలో జయంతి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మాన్యశ్రీ కాన్సిరాం గారి చిత్రపటానికి పూలమాలవేసి, అనంతరం కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా చౌటుప్పల్ మండల అధ్యక్షులు మాద రమేష్, మున్సిపాలిటీ అధ్యక్షులు కత్తుల పరమేష్ మాట్లాడుతూ బాబాసాహెబ్ అంబేద్కర్ గారి ఆలోచనను అనుసరించి బహుజన వర్గాలకు, రాజ్యాధికారం సాధించడమే లక్ష్యంగా, కాశ్మీ నుండి కన్యాకుమారి వరకు సైకిల్ యాత్ర చేసి బహుజన వర్గాలను ఏకం చేసి, అణగారిన బహుజన వర్గాలకు అధికారాన్ని అందించి, దేశ రాజకీయాల్లో కొత్త చరిత్ర లిఖించిన మహోన్నత రాజకీయ శిఖరం అని అన్నారు.ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు మస్కు ఉదయ్, గడ్డమీది బాబురావు, సుక్క సుదర్శన్, ఎర్రోళ్ల ఇస్తారి, మాద యాదగిరి, ఎస్ డి రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

# ఈనెల 16న తుంగతుర్తిలో జరిగే కృతజ్ఞత సభను విజయవంతం చేయాలి

**యూత్ కాంగ్రెస్ నియోజవర్గ ప్రధాన కార్యదర్శి వేముల గోపీనాథ్**



**శాలిగౌరారం,తెలంగాణ సేన :** తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీ బీసీ కులాల అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వం తోటే సాధ్యం అవుతుందని తుంగతుర్తి నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వేముల గోపినాథ్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా వేముల గోపీనాథ్ శాలిగౌరారం మండల కేంద్రంలో మాట్లాడుతూ ఈ నెల16న తుంగతుర్తి లో వ్యవసాయ మార్కెట్ యార్డ్ నందు నిర్వహించే కాంగ్రెస్ కృతజ్ఞత సభను విజయవంతం చేయాలన్నారు. దశాబ్ద కాలంగా ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణ బిసి కుల గణాలను చేయడంలో గత ప్రభుత్వాలు విఫలం అయ్యాయని నేడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోగ్యంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం రెండిటిని విజయవంతంగా అమలు చేసినందుకుగాను కృతజ్ఞత పూర్వకంగా ఎమ్మెల్యే మందుల సామేలు అధ్యక్షతన నిర్వహించే సభను విజయవంతం చేయాలన్నారు. అసెంబ్లీలో స్పీకర్ పై అగ్రవర్ణ ఎమ్మెల్యే అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నామని, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్వర్ రెడ్డిని పూర్తిగా ఎమ్మెల్యే సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. స్పీకర్ పై ఏక వచనంగా సంబోధించిన తీరు ను ప్రజలంతా ఖండిస్తున్నారని తెలిపారు.

# రాష్ట్రంలో సాగు నీరును చివరి ఆయకట్టు వరకు అందించాలి

**పంటలు ఎండిపోయి నష్టపోయిన వారికి ఎకరాకు 30 వేల నష్ట పరిహారం ప్రకటించాలి.**

**తెలంగాణ రైతాంగ సమితి**



**తెలంగాణ సేన :** రాష్ట్ర ప్రభుత్వం 50 లక్షల ఎకరాల పంటలకు ఆయకట్టు ప్రకటించింది. అనధికార ఆయకట్టు ప్రకారము 60 లక్షల ఎకరాలలో పంటలు సాగు చేశారు. ప్రాజెక్టులలో ఉన్న సాగునీరును అంచనా వేసి ఆయకట్టు 50 లక్షల ఎకరాలు ప్రకటించారు. చెరువులు, కుంటలు, బోర్ బావుల కింద 10 లక్షల ఎకరాలు సాగు చేశారు. పంటలు వేసి 3 నెలలు అవుతోంది. వేసిన పంటలు సాగునీరు అందక వేలాది ఎకరాలు ఎండి పోయాయి, ఎండిపోతున్నాయి.వరి పంట ఎకరాకు ఉత్పత్తి ఖర్చులు 30 వేల నుంచి 40 వేల రూపాయల ఖర్చులు అవుతుంది. ఆరుతడి పంటలు మొక్కజొన్న, వేరుశనగ, మినుము, పెసర తదితర పంటలకు ఎకరాకు 25 వేల నుంచి 30 వేల ఉత్పత్తి ఖర్చులు అవుతాయి ఈ పంటలు వేసిన రైతులు ఆరుగాలం కష్టపడి పని చేస్తే పంటలు చేతికి వచ్చే దశలో నీరు లేక లక్షలాది ఎకరాలు ఎండిపోతున్నాయి.రాష్ట్రంలో పూర్వ నల్లగొండ, వరంగల్, మహబూబ్నగర్, కరీంనగర్ ఖమ్మం, నిజాంబాద్, మెదక్ అన్ని ఉమ్మడి జిల్లాలలో కూడా సాగునీటి కొరత తీవ్రంగా ఉన్నది. ప్రభుత్వం ప్రకటించిన ఆయకట్టు పంటల చివరి సాగు భూముల వరకు సరిపడ నీరును అందించి, వేసిన పంటలను కాపాడాలి.నీటి కొరత వల్ల చివరి దశలో ఉన్న పంటలు ఇప్పటికే వేలాది ఎకరాలు ఎండి పోయాయి. ఈ పంటలను గుర్తించి ఎండిపోయిన అన్ని పంటలకు ఎకరాకు 30వేల నష్టపరిహారం ప్రభుత్వం ప్రకటించాలి. ప్రభుత్వం అన్ని జిల్లాలలో సాగునీటి సమస్యపై సమీక్ష చేసి ఎక్కడెక్కడ పంటలు ఎండుతున్నాయో వాటిని పరిశీలన చేసి సాగు నీరును తక్షణమే పారించే విధంగా ప్రభుత్వ సాగునీటి యంత్రాంగాన్ని సిద్ధం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం.


# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత అల్పాహారం పంపిణీ




**తెలంగాణ సేన :** సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రభుత్వ దవాఖాన వద్ద లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత అల్పాహార పంపిణీ శనివారం నాలుగో సంవత్సరం 258 వ రోజుకు చేరుకుంది, ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ అధ్యక్షులు మల్లేశం గౌడ్ మాట్లాడుతూ మానవసేవే మాధవసేవా అని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రతిరోజు ఉదయం ప్రభుత్వ దవాఖాన వద్ద రోగులకు వారి బంధువులకు అల్పాహారం అందజేయడం జరుగుతుందని ఈరోజు లయన్ జగ్గయ్యగారి శ్రీనివాస్ గౌరీ దంపతుల పెళ్లిరోజు సందర్భంగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అల్పాహారంతో పాటు బ్రెడ్, అరటి పండ్లు, పులిహోర పంపిణీ చేయడం జరిగిందని అన్నారు ఈ కార్యక్రమంలో లయన్ నేతి శ్రీనివాస్, దొంతుల సత్యనారాయణ, సామ శ్రీధర్, జగ్గయ్యగారి శ్రీనివాస్ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సేన
TELANGANA SENA TELUGU DAILY
ఆదివారం 16 - 03 - 2025

# ఇలా చేస్తే మరిన్ని ఆరోగ్య ప్రయోజనాలు!




నడక.. ఆరోగ్యానికి దివ్యౌషధం! అత్యంత ప్రభావశీలమైన వ్యాయామం! అయితే, మామూలుగా నడిచేకన్నా.. వెనక్కి నడవడం వల్ల మరిన్ని ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చని అంటున్నారు నిపుణులు. సాధారణంగా వాకింగ్ చేసేటప్పుడు.. శక్తి అనేది చీలమండ నుంచి పుడుతుంది. అదే.. వెనక్కి నడిచే సమయంలో తుంటి, మోకాళ్ల నుంచి శక్తి వస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఈ మార్పు శరీరంలో అనేక ప్రయోజనాలను అందిస్తుందని అంటున్నారు. వెనక్కి నడవడం వల్ల నడకలో సమతుల్యత, వేగం మెరుగుపడుతుంది. రివర్స్ వాకింగ్.. కార్డియోరెస్పిరేటరీ ఫిట్‌నెస్‌ను మెరుగుపరుస్తుందట. అంటే, వ్యాయామం చేసేటప్పుడు గుండె, ఊపిరితిత్తులు ఆక్సిజన్‌ను మరింత ఎక్కువగా గ్రహించడానికి తోడ్పాటు అందిస్తుంది. రివర్స్‌లో నడవడం వల్ల మోకీలు, మోకాళ్లపై ఒత్తిడి తగ్గుతుంది. ఇక రోజూ వ్యాయామం చేసేటప్పుడు 10 15 నిమిషాలు వెనక్కి నడిస్తే.. ఎముకలు దృఢంగా తయారవుతాయట. బోలు ఎముకల వ్యాధి బారినుంచి తప్పించుకోవచ్చుట. మామూలు వాకింగ్‌తో పోలిస్తే.. వెనక్కి నడవడం వల్ల కొలెస్ట్రాల్ ఎక్కువ మొత్తంలో కరుగుతుందట. రివర్స్ వాకింగ్.. మెదడు పనితీరుపై సానుకూల ప్రభావం చూపుతుంది. అందుకే, పిల్లలకూ ఇలా వెనక్కి నడవడం నేర్పించాలనీ, దానివల్ల వారి జ్ఞాపకశక్తి మెరుగుపడుతుందని నిపుణులు అంటున్నారు. వారి ఆలోచన విధానంలో మార్పులు వస్తాయని చెబుతున్నారు. అయితే, మొదట్లో వెనక్కి నడవడం కష్టంగానే ఉంటుంది. రోజూ 10 %-% 15 అడుగులు వెనక్కి నడుస్తూ.. ఆ తర్వాత పెంచుకుంటూపోతే అలవాటు అవుతుంది.

# సూప్‌లతో ఫ్లూ తగ్గుతుందా?



చలికాలంలో గొంతుకు, పొట్టకు హాయిగా ఉంటుందని చాలామంది సూప్‌లను తీసుకోవడానికి ఇష్టపడుతుంటారు. అయితే వేడివేడిగా కడుపులోకి జారే ఈ సూప్‌లు ఆరోగ్యానికి ఏమైనా మేలు చేస్తాయంటారా? అసలు సూప్‌లో ఏముంటుంది? చలికాలంలో సూప్‌లు తాగడం అన్నది కేవలం హాయినిచ్చే అంశమే కాదు, ఆరోగ్యాన్నీ అందిస్తుంది. వాతావరణం చల్లగా ఉండే ఈ సమయంలో జీవక్రియ మందగించి పెద్దగా ఆకలివేయదు. అలాంటప్పుడు సూప్ తాగడం ద్వారా సులభంగా పొట్ట నిండటంతోపాటు ఆకలి కూడా పెరుగుతుంది. దీనివల్ల మరింత ఆహారాన్ని తీసుకోగలం. వేడి వేడిగా ద్రవ రూపంలో ఉండే ఈ సూప్‌లు జీర్ణ వ్యవస్థను చురుగ్గా పనిచేసేలా చేస్తాయి. అంతేకాదు, రకరకాల కూరగాయలతో చేసే ఈ ద్రవాలలో పీచులు ఎక్కువ. తిన్నది బాగా అరిగేందుకు, విసర్జక వ్యవస్థ పనితీరు మెరుగుపడేందుకు ఇవి సాయపడతాయి. విభిన్న రకాల ఆకుకూరలు, కూరగాయల మిశ్రమంగా తయారయ్యే సూప్‌లలో ప్రొటీన్, విటమిన్-సి, డి, జింక్, బీటా కెరాటిన్‌లాంటి పోషకాలెన్నో ఉంటాయి. ఇవి శరీరంలో ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గించి శ్లేష్మం అధికంగా ఏర్పడకుండా సాయపడతాయి. జలుబులాంటి ఫ్లూలు అధికంగా వచ్చే సమయంలో వివిధ విటమిన్లు, మినరళ్లు, సూక్ష్మ పోషకాల సమాహారం అయిన సూప్‌లు తాగడం వల్ల వాటి నుంచి రక్షణ పొందొచ్చు. బోన్ బ్రాత్ ఆధారిత సూప్‌లు తాగడం వల్ల ఎముకలకు బలాన్నిచ్చే కాల్షియం, మెగ్నీషియంలాంటి ఖనిజ లవణాలు లభిస్తాయి. అలాగే సూప్‌లకు పనీర్, సోయాబీన్, శనగలు, పెసర్లు లాంటివి జోడించడం వల్ల అందులో ప్రొటీన్ కూడా చేరుతుంది. దీంతో ఇది శరీరానికి మరింత బలమైన ఆహారంగా మారుతుంది. చికెన్‌ను జోడించినా మాంసకృత్తులు అధికంగా శరీరానికి అందుతాయి. దాల్చిన చెక్క, ఆకు, మిరియాల పొడిలాంటి దినుసులు దీనికి సుగంధంతోపాటు మరిన్ని సుగుణాలను జోడిస్తాయి. అల్లం, వెల్లుల్లిలాంటివీ ఉండటంతో రోగ నిరోధక వ్యవస్థను బలపరుస్తాయి. ఇక, ఆరోగ్యంగా బరువు తగ్గాలనుకునేవారికి సూప్‌లు మంచి ఎంపిక. మొత్తంగా, చలికాలానికి సూప్‌లు ఆరోగ్యపు దుప్పటి లాంటివి అన్నమాట!

# చీమల దండు నేర్పే ట్రాఫిక్ పాఠాలు!



చీమలకూ ట్రాఫిక్ సెన్స్ ఉంటుందని, అవి సమన్వయంతో, తెలివిగా ప్రయాణిస్తాయని ఇటలీలోని యూనివర్సిటీ ఆఫ్ ట్రెన్టోకు చెందిన పరిశోధకులు గుర్తించారు. ప్రొఫెసర్లు మార్కో గెరియ్యేరి, నికోలా పుగ్నో నేతృత్వంలో చీమలదండు ప్రయాణంపై నిర్వహించిన అధ్యయనం వివరాలు 'ట్రాన్స్‌పోర్టేషన్ రిసెర్చ్ ఇంటర్‌డిసిప్లీనరీ పెర్స్‌పెక్టీవ్స్' అనే జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. డీప్ లెర్నింగ్ ద్వారా చీమల ప్రయాణతీరును గమనించారు. ప్రయాణంలో చీమలు ప్లాటూన్‌గా ఏర్పడటం వంటి అనేక వ్యూహాలు పాటిస్తాయని, ఒకే వేగంతో వెళ్తాయని పరిశోధకులు గుర్తించారు. ఎంత రద్దీ ఉన్నా జామ్‌లు కానివ్వవని, ఓవర్‌టెక్ చేయవని తేల్చారు. మన రోడ్లపై వాహనాలు వెళ్లినట్టుగానే చీమలు సైతం ఇరు దిశల్లో ప్రయాణిస్తాయని పేర్కొన్నారు. జామ్‌లను నివారించేందుకు చీమలు అనుసరిస్తున్న పద్ధతులను పట్టణాల్లో ట్రాఫిక్ జామ్‌ల నియంత్రణకు వినియోగించవచ్చని పరిశోధకులు సూచించారు. సెల్ఫ్ డ్రైవ్ వాహనాల తయారీలో చీమల ప్రయాణ వ్యూహాన్ని జోడించి సవాళ్లను అధిగమించొచ్చని పేర్కొన్నారు.

# సింగిల్ డోస్‌తో బ్రెస్ట్ క్యాన్సర్‌కు చెక్!



రొమ్ము క్యాన్సర్ చికిత్స కాలాన్ని గణనీయంగా తగ్గించే కొత్త కృత్రిమ అణువును అమెరికన్ పరిశోధకులు అభివృద్ధి చేశారు. యూనివర్సిటీ ఆఫ్ ఇలినాయిస్‌కు చెందిన పరిశోధకులు తయారు చేసిన ఈఆర్ఎస్ఓ-టీఎఫ్‌పీవై అనే కృత్రిమ అణువుకు సంబంధించిన వివరాలు అమెరికన్ కెమికల్ సొసైటీ ప్రచురించే ఏసీఎస్ సెంట్రల్ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. ఈస్ట్రోజెన్ రెసెప్టార్ పాజిటివ్(ఈఆర్ పాజిటీవ్) బ్రెస్ట్ క్యాన్సర్ బాధితుల చికిత్సకు ఈ కృత్రిమ అణువును వినియోగించవచ్చని, ఒకే డోస్‌తో ఇది చిన్న క్యాన్సర్ కణతులను అంతమొందిస్తుందని, పెద్ద కణితులను తగ్గిస్తుందని పరిశోధకుడు పాల్ హెర్జెన్‌రోథర్ తెలిపారు. రొమ్ము క్యాన్సర్ బాధితుల్లో దాదాపు 70 శాతం మందికి ఈఆర్ పాజిటివ్ క్యాన్సర్ ఉంటుందని అంచనా. వీరికి శస్త్రచికిత్స చేసిన తర్వాత దాదాపు 5 -10 ఏండ్ల పాటు హార్మోన్ థెరపీ అందించాలి.

### సైడ్ ఎఫెక్ట్స్ సమస్య లేకుండా..

ఇలా ఎక్కువకాలం హార్మోన్ థెరపీ చేయడం వల్ల రక్తం గడ్డకట్టడం, కండరాల నొప్పి, లైంగిక సమస్యలు, అలసట వంటి సైడ్ ఎఫెక్ట్స్ వస్తాయి. వీటి వల్ల 20-30 శాతం మంది రోగులు మధ్యలోనే చికిత్సను వదిలేస్తున్నారు. ఈ నేపథ్యంలో క్యాన్సర్ కణాలను అంతం చేసేందుకు 2021లో పాల్ హెర్జెన్‌రోథర్ బృందం ఈఆర్ఎస్ఓ అనే కృత్రిమ అణువును తయారు చేసింది. అయితే,దీనితోనూ సైడ్ ఎఫెక్ట్స్ ఎక్కువ ఉండటంతో పలు మార్పులు చేసి ఈఆర్ఎస్ఓ-టీఎఫ్‌పీవైను తయారుచేశారు. ఎలుకలకు ఒకే డోస్ ఇవ్వగా చిన్న కణతులు అంతమయ్యాయి. పెద్ద కణతులు కూడా క్షీణించాయి. మనుషులపై దీని ప్రభావాన్ని తెలుసుకునేందుకు మరిన్ని పరిశోధనలు చేయాల్సి ఉందని పరిశోధకులు తెలిపారు.

# రక్తహీనత సమస్య ఉందా వీటిని తింటే రక్తం ఎక్కువగా తయారవుతుంది



ప్రస్తుతం చాలా మంది రక్తహీనత సమస్యతో బాధపడుతున్నారు. ఇది వచ్చేందుకు అనేక కారణాలు ఉంటున్నాయి. ముఖ్యంగా మహిళలు, చిన్నారుల్లో ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తోంది. అయితే రక్తహీనత వచ్చేందుకు పోషకాహార లోపమే ప్రధాన కారణమని వైద్యులు చెబుతున్నారు. పోషకాలు లేని ఆహారాన్ని తింటున్నందునే చాలా మందిలో రక్తం తగినంతగా ఉండడం లేదని వారు అంటున్నారు. ముఖ్యంగా ఐరన్ లోపం సమస్య చాలా మందికి వస్తోంది. అలాగే ఎర్ర రక్త కణాల ఉత్పత్తికి అవసరం అయ్యే విటమిన్ బి12 కూడా చాలా మందిలో లోపిస్తోంది. ఇది కూడా రక్తహీనతకు కారణం అవుతోంది. ఈ క్రమంలోనే కేవలం ఐరన్ మాత్రమే కాకుండా విటమిన్ బి12 ఉండే ఆహారాలను కూడా తీసుకోవాల్సి ఉంటుంది. అప్పుడే ఈ సమస్య నుంచి బయట పడవచ్చు. ఇక రక్తహీనత తగ్గాలంటే తీసుకోవాల్సిన ఆహారాలు ఏమిటో ఇప్పుడు తెలుసుకుందాం.

### జున్ను, బ్రౌన్ రైస్..

జున్ను నుంచి మనకు విటమిన్ బి12 పుష్కలంగా లభిస్తుంది. కనుక జున్ను పాలు లభించే అసలు విడిచిపెట్టకుండా తీసుకోండి. జున్నును విటమిన్ బి12కు గొప్ప వనరుగా చెప్పవచ్చు. అదేవిధంగా పాలు, పనీర్‌తోపాటు ఇతర పాల ఉత్పత్తుల్లోనూ విటమిన్ బి12 అధికంగానే ఉంటుంది. ఇది మన శరీరంలో ఎర్ర రక్త కణాలు తయారయ్యేలా చేస్తుంది. దీంతో రక్తహీనత నుంచి బయట పడవచ్చు. అలాగే బ్రౌన్ రైస్‌ను ఎక్కువగా తినాలి. బ్రౌన్ రైస్‌లోనూ మనకు విటమిన్ బి12 సమృద్ధిగానే లభిస్తుంది. ప్రస్తుతం చాలా మంది తెల్ల అన్నాన్ని ఎక్కువగా తింటున్నారు. దీన్ని తినడం వల్ల బరువు పెరగడంతోపాటు డయాబెటిస్ బారిన కూడా పడుతున్నారు. కనుక బ్రౌన్ రైస్‌ను ఆహారంలో భాగం చేసుకోవాలి. ఇందులో ఉండే విటమిన్ బి12 రక్తం తయారయ్యేందుకు దోహదపడుతుంది. అలాగే పలు ఇతర పోషకాలు కూడా మనకు లభిస్తాయి.

### పాలకూర జ్యూస్..

రక్తహీనత అధికంగా ఉన్నవారు రోజూ పాలకూరతో జ్యూస్ తయారు చేసి 30 ఎంఎల్ మోతాదులో సేవిస్తుంటే కచ్చితంగా ఫలితం ఉంటుంది. పాలకూర ద్వారా ఐరన్ సమృద్ధిగా లభిస్తుంది. ఇది రక్తకణాలు తయారయ్యేలా చేస్తుంది. దీంతో రక్తహీనత నుంచి బయట పడవచ్చు. అదేవిధంగా బీట్‌రూట్ జ్యూస్‌ను రోజూ ఒక కప్పు మోతాదులో తాగుతున్నా కూడా రక్తహీనత నుంచి బయట పడవచ్చు. బీట్‌రూట్‌లో బీటా కెరోటిన్ సమృద్ధిగా ఉంటుంది. అలాగే దీని ద్వారా ఐరన్ కూడా మనకు ఎక్కువగానే లభిస్తుంది. కనుక బీట్‌రూట్ జ్యూస్‌ను తాగుతుంటే రక్తం అధికంగా తయారవుతుంది. రక్తహీనత నుంచి బయట పడవచ్చు.

### దానిమ్మ పండ్లు..

దానిమ్మ పండ్లను కూడా ఆహారంలో భాగం చేసుకోవాలి. రోజూ ఈ పండ్లను తింటే రక్తం అధికంగా తయారవుతుంది. లేదా ఈ పండ్ల జ్యూస్‌ను అయినా సరే రోజుకు ఒక కప్పు మోతాదులో తాగుతుండాలి. ఈ పండ్లను తినడం వల్ల శరీరంలో రక్త సరఫరా సైతం మెరుగు పడుతుంది. దీంతో గుండె ఆరోగ్యంగా ఉంటుంది. అలాగే రోజూ గుప్పెడు కరివేపాకులను దంచి ఆ మిశ్రమాన్ని మజ్జిగలో కలిపి తీసుకుంటుండాలి. దీంతో రక్తాన్ని పెంచుకోవచ్చు. రక్తహీనత తగ్గుతుంది. రక్తం తయారయ్యేలా చేసేందుకు గాను తోటకూర కూడా ఎంతగానో పనిచేస్తుంది. తోటకూరతో జ్యూస్ తయారు చేసి రోజూ తాగవచ్చు. లేదా తోటకూరను కూరగా వండుకుని తింటుండాలి. దీంతో రక్తం తయారవుతుంది. ఇలా పలు రకాల ఆహారాలను తినడం వల్ల విటమిన్ బి12 ఇంకా ఐరన్‌ను పొందవచ్చు. దీంతో రక్తం తయారవుతుంది. రక్తహీనత నుంచి బయట పడతారు.

# తాటిబెల్లంలో ఉండే ఆరోగ్య ప్రయోజనాలు అన్నీ ఇన్నీ కావు రోజూ తినాల్సిందే



మన చుట్టూ ఉండే ప్రకృతిలో ఎన్నో ఆరోగ్యకరమైన ఆహారాలు అందుబాటులో ఉన్నాయి. కానీ చాలా మంది మాత్రం రోజూ అనారోగ్యకరమైన ఆహారాలనే తింటున్నారు. బేకరీ పదార్థాలు, జంక్ ఫుడ్, నూనె పదార్థాలు, స్వీట్లను ఎక్కువగా తింటున్నారు. దీని వల్ల రోగాల బారిన పడుతున్నారు. అయితే ఆరోగ్యకరమైన ఆహారాలను రోజూ తింటేనే మనం ఆరోగ్యంగా ఉంటాం. ఎలాంటి రోగాలు రాకుండా చూసుకోవచ్చు. ఇక ప్రకృతి మనకు అందిస్తున్న ఆరోగ్యకరమైన ఆహారాల్లో తాటి బెల్లం కూడా ఒకటి. దీన్ని మనం రహదారుల పక్కన చూడవచ్చు. చాలా మంది తాటిబెల్లాన్ని విక్రయిస్తుంటారు. అయితే తాటి బెల్లంను అది ఉన్న రంగు కారణంగా చాలా మంది ఇష్ట పడరు. కానీ ఇది అందించే ఆరోగ్య ప్రయోజనాలు తెలిస్తే తాటి బెల్లంను ఇప్పుడే తినడం మొదలు పెడతారు. అన్ని ఆరోగ్య ప్రయోజనాలను ఇది అందిస్తుంది.

### రక్తహీనతకు ఔషధం..

తాటిబెల్లంలో ఐరన్ సమృద్ధిగా ఉంటుంది. ఇది రక్తంలో హిమోగ్లోబిన్ స్థాయిలను పెంచుతుంది. దీంతో రక్తం ఎక్కువగా తయారవుతుంది. రక్తహీనత సమస్య ఉన్నవారికి తాటిబెల్లం చక్కని ఆప్షన్ అని చెప్పవచ్చు. రోజువారి ఆహారంలో తాటిబెల్లాన్ని తింటుంటే రక్తహీనత నుంచి బయట పడవచ్చు. అలాగే ఇందులో మెగ్నిషియం కూడా ఎక్కువగానే ఉంటుంది. ఇది నాడీ మండల వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. ముఖ్యంగా నరాల బలహీనత తగ్గుతుంది. రాత్రి పూట కాలి పిక్కలు పట్టుకుపోయే సమస్య ఉన్నవారు తాటిబెల్లంను ఆహారంలో భాగం చేసుకుంటే ఈ సమస్య నుంచి బయటపడవచ్చు. దీంతో కండరాలు కూడా ఆరోగ్యంగా ఉంటాయి. కండరాలు పట్టుకుపోకుండా చూసుకోవచ్చు.


### ఎముకల ఆరోగ్యానికి..

తాటిబెల్లంలో క్యాల్షియం సమృద్ధిగా ఉంటుంది. ఇది ఎముకలను ఆరోగ్యంగా ఉంచుతుంది. దీంతో ఎముకలు బలంగా మారుతాయి. తాటిబెల్లంలో పొటాషియం కూడా ఎక్కువగానే ఉంటుంది. ఇది శరీరంలో రక్త సరఫరాను మెరుగు పరుస్తుంది. దీంతో బీపీ నియంత్రణలోకి వస్తుంది. కనుక హైబీపీ ఉన్నవారికి తాటిబెల్లం ఒక వరం అనే చెప్పవచ్చు. దీంతో గుండె ఆరోగ్యంగా ఉంటుంది. హార్ట్ ఎటాక్ రాకుండా చూసుకోవచ్చు. తాటిబెల్లాన్ని మహిళలు తినడం వల్ల నెలసరి సమయంలో వచ్చే సమస్యలను తగ్గించుకోవచ్చు. ఇందులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు రక్తాన్ని శుద్ధి చేస్తాయి. శరీరంలో దెబ్బ తిన్న కణజాలానికి మరమ్మత్తులు చేస్తాయి. దీంతో స్త్రీలలో వచ్చే సమస్యలు తగ్గుతాయి.

### జీర్ణ సమస్యలకు..

తాటిబెల్లంలో ఫైబర్ సమృద్ధిగా ఉంటుంది. ఇది మలబద్ధకం, అజీర్తి సమస్యలను తగ్గిస్తుంది. శరీరంలోని టాక్సిన్లను బయటకు పంపుతుంది. క్యాన్సర్ కారకాలతో పోరాడి క్యాన్సర్‌ను నివారించే గుణాలు కూడా ఇందులో ఉన్నాయి. అలాగే తాటిబెల్లంను తింటే పొడి దగ్గు, ఆస్తమా వంటి శ్వాసకోశ సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. రోజూ ఒక టీస్పూన్ తాటిబెల్లం తినడం వల్ల మైగ్రెయిన్ నుంచి ఉపశమనం పొందవచ్చని ఆయుర్వేదం చెబుతోంది. అధిక బరువును తగ్గించేందుకు ఈ బెల్లం ఎంతగానో పనిచేస్తుందని డాక్టర్లు సైతం చెబుతున్నారు. కనుక తాటి బెల్లం మీకు కనిపిస్తే విడిచిపెట్టకుండా కొని తెచ్చి వాడండి. అన్ని రకాలుగా ఆరోగ్యంగా ఉండవచ్చు.

# ఉన్నది ఒకటే జిందగీ




సంపాదించడం తెలిసినవాళ్లకు ఖర్చు చేయడంపై కూడా అవగాహన ఉండాలి. లేకపోతే ఆదాయం పేరుకుపోతుంది కానీ, ఆనందం మీకు చిక్కకుండా ఎక్కడో కూరుకుపోతుంది! పొదుపు చేసిన సొమ్ము, మదుపు చేసిన మొత్తం మీ ముందుతరాలకు ఇచ్చేస్తే.. మీ తలరాతకు పరులు కూడా జాలిపడే పరిస్థితి వస్తుంది. జీవిత చరమాంకంలో అయినా, ఖుషీ చేయకపోతే ఎలా? ఉన్నది ఒక్కటే జిందగీ! మీ లైఫ్ సుఖాంతం కావాలంటే.. సంపాదించింది ప్లాన్డ్‌గా ఖర్చు చేయడమే మార్గం! ప్రతి మనిషి జీవితం గందరగోళంగానే మొదలవుతుంది. తల్లి కడుపు నుంచి బయటపడగానే ఏడ్చేస్తాం. అది ప్రకృతి ధర్మం కాబట్టి%ో% తెలియకపోయినా పాటిస్తాం. ఆకలి కాగానే తల్లిపాలు తాగుతాం. అది సృష్టివింత కాబట్టి.. తెలియకుండానే చేసేస్తాం. పెరిగి పెద్దయ్యేకొద్దీ మనలో ఆలోచనలు మొదలవుతాయి. చేయాల్సింది చేయకుండా ఉండటానికి ప్రయత్నిస్తాం. చేయకూడనివి చేయాలని తాపత్రయపడతాం. అలా తప్పుల మీద తప్పులు చేస్తూ పెరిగి పెద్దవుతాం. ఏళ్లొచ్చాక ఎక్కడ తప్పు చేసినా చెల్లుతుందేమో కానీ, ఆర్థిక విషయాల్లో పొరపాట్లకు తావిస్తే, జీవితం గ్రహపాటుగా మిగిలిపోతుంది. సంపాదించడం చేతకాని వాళ్లు తప్పు చేసే ఆస్కారం ఉండదు. దురదృష్టాన్ని నిందించుకుంటూ, ఇతరుల అదృష్టంపై ఏడుస్తూ భారంగా కాలం వెళ్లదీస్తుంటారు. వీళ్లను బాగు చేయడం ఎవరి తరమూ కాదు! కానీ, బాధ్యతగా బతుకుతూ, కుటుంబ బాధ్యతలు సక్రమంగా నిర్వర్తిస్తూ, కష్టాలకు ఎదురొడ్డి నిలబడి ఒకస్థాయికి చేరుకుంటారు కొందరు. ఈ క్రమంలో కోరికలు చంపుకుంటారు, కష్టాలకు ఎదురీదుతారు, రూపాయి రూపాయి పోగు చేసి సంపన్నుల జాబితాలో చోటు దక్కించుకుంటారు. జీవితం అంతా కుటుంబం కోసం పనిచేసిన ఈ వ్యక్తులు.. తమకంటూ ఓ లైఫ్ ఉందని అర్థం చేసుకోరు. అలా అర్థం చేసుకున్నవాళ్లు.. ఇదిగో ఈ పార్థసారథి గారిలా జిందగీని ముచ్చటగా ఎంజాయ్ చేస్తారు.

అందుకు ఆయనేం కోట్లు ఖర్చు చేయలేదు. ఒక్కటంటే ఒక్క కోటి రూపాయలు పదిలం చేశాడు. పార్థసారథి ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేసేవాడు. పిల్లలను బాగా చదివించాడు. సర్వీసులో ఉన్నప్పుడే పిల్లల పెళ్లిళ్లు అయిపోయాయి. కొడుకు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. కూతురు, అల్లుడూ బ్యాంకులో పనిచేస్తారు. రెండేండ్ల కిందట రిటైర్ అయ్యాడు. శేష జీవితం మనవలు, మనవరాళ్లతో ఎంజాయ్ చేయాలని ఫిక్సయ్యాడు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ అన్నీ కలిపితే రూ.కోటి దాకా వచ్చాయి. ఈ మొత్తాన్ని ఏం చేయాలో పార్థసారథికి అర్థం కాలేదు. అప్పటికే ఇల్లు ఉంది. ఒకటి రెండు ఆస్తులున్నాయి. పిల్లలకు తండ్రి సొమ్ము కావాలన్న ఆశ లేదు. 'ఈ కోటి ఏం చేయాలంటూ?' నా సలహా అడిగారు. జీవితం అంతా కష్టపడిన ఆయన్ను 'ఈ కోటి రూపాయలు ఖర్చు చేయడానికి సిద్ధంగా ఉన్నారా?' అని అడిగాను. ముందు కంగారుగా చూసినా.. తర్వాత తేరుకొని 'ఓ ఎస్' అన్నారు. ఈ కోటి రూపాయలను కరిగించకుండా.. జీవితాన్ని ఎంజాయ్ చేసే మార్గం ఉందని చెప్పడంతో.. ఆశ్చర్యంగా చూశారు. ఆ కోటి రూపాయలూ హైబ్రిడ్ ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయమని చెప్పాను. ఏటా మే 1వ తేదీన ఆ కోటిపై వచ్చే రిటర్న్స్ మొత్తాన్నీ రూపాయి మిగల్చకుండా విత్‌డ్రా చేసి, ఖర్చు చేయాలనే షరతును ఆయన అంగీకరించారు. అలా ఏడాది (2023-24) తిరిగే సరికి ఆ కోటి రూపాయలపై అచ్చంగా రూ.30 లక్షల రిటర్న్స్ వచ్చింది (మ్యూచువల్ ఫండ్స్ మార్కెట్ ఒడుదొడుకులకు లోబడి ఉంటాయి. అన్నిసార్లూ ఇలా రూ.30 లక్షలు వస్తాయన్న గ్యారెంటీ లేదు. కొన్నిసార్లు తక్కువ రావొచ్చు, అసలేం రాకపోవచ్చు కూడా! అయినా ఈ సొమ్ము వెకేషన్ నిమిత్తం కాబట్టి రాకపోయినా ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఎందుకంటే దీని మీద ఆధారపడి లేరు కదా!). అంత పెద్ద అమౌంట్‌ను ఏం చేయాలని మళ్లీ అడిగారు. ఫ్యామిలీతో ఇంటర్నేషనల్ వెకేషన్‌కి వెళ్లమని చెప్పాను. కుటుంబంతో పదిరోజులు రెండు దేశాలు చుట్టొచ్చారు పార్థసారథి. అప్పటికీ రూ.30 లక్షల్లో సగమే ఖర్చయ్యాయి. 'దీన్ని ఏం చేయమంటారు?' అని మళ్లీ సలహా కోరారు. 'కొడుకు, కోడలు, కూతురు, అల్లుడిని పిల్లలతో సహా డిన్నర్‌కు పిలిచి, ఇకపై నేను ఉన్నంత వరకు మీ పిల్లల చదువు ఖర్చు ఎంతైనా బాధ్యత నాదేనని' చెప్పమన్నాను! మార్కెట్ క్రాష్ అయినా, దీర్ఘకాలంలో మీ పెట్టుబడి పదిలంగా ఉంటుంది. రిటర్న్స్‌లో కొంత కోత పడుతుందేమో అంతే! తన పూర్తి పరివారంతో ఏడాదికి ఒక దేశం చుట్టేస్తూ జాయ్‌ఫుల్‌గా లైఫ్ ఎంజాయ్ చేస్తున్నారు పార్థసారథి. మనవలు, మనవరాళ్లనూ చదివిస్తూ మలిసంధ్యలో భారం అనుకోకుండా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. అందరికీ ఇంత ఈజీగా సొల్యూషన్ దొరక్కపోవచ్చు. కానీ, విదేశాల్లో 'డై విత్ జీరో' కాన్సెప్ట్ ఎప్పట్నుంచో ఉంది. పోయేలోపు ఉన్నదంతా ఖర్చు చేసి లైఫ్ ఎంజాయ్ చేయడమన్నమాట. అలాగని జల్సాలకే ఖర్చు పెట్టాలన్న నియమం లేదు. నలుగురికీ సాయం చేయొచ్చు. పదిమంది ఆకలి తీర్చొచ్చు. ఇలా మీ కష్టార్జితం మీ ఇష్టం వచ్చినట్టు వెచ్చించడం అన్నమాట! పార్థసారథి కూడా ఈ సూత్రాన్నే ఎంచుకున్నారు. వారసులకు ఇవ్వాల్సింది ఆస్తుల మూటలు కాదు. మంచి భవిష్యత్తు. బుద్ధిమంతులు ఏ ఆస్తీ ఇవ్వకున్నా.. హాయిగా బతికేస్తారు. బుద్ధిహీనులకు ఏడు తరాలకు సరిపడా ఆస్తి ఇచ్చినా ఊడ్చిపడేస్తారు. సో, మీ కష్టార్జితాన్ని ఎలా వినియోగిస్తారో ఇక మీ ఇష్టం!!

# జాయ సేనాపతి

చారిత్రక కాల్పనిక నవల



నీలాంబ ఉరివేసుకుని చనిపోయిన మరునాడే.. కళామందిరానికి వచ్చింది లలితాంబ. వెళ్లి దూరంగా కొందరు మహిళా కవయిత్రుల మధ్య కూర్చుంది. ఎక్కడో ఇద్దరి చూపులూ కలుసుకున్నాయి.. విడిపోయాయి. ఇద్దరి మధ్య పూర్తి నిశ్శబ్దం! అదొక నృత్త విన్యాసం.. దాని అర్థం ఆ పరమేష్టికే తెలియాలి!! జీవితం.. కనీసపు శారీరకతృష్ణ కూడా తీరని ఓ ఎండిన మోడుగానే బతుకు ముగిసిపోతుందా!? నీలాంబక్కను తల్పంపై అలా చూసేసరికి ఆరోజు లలితాంబ చేతిని తన గుండెకు తాకించడం తప్పయిందా?.. అప్పటికే తమమధ్య ఆమె కోరుకున్న భోగినీ పండుగ జరిగినట్లు భావించి ఆ సంతోషంలో.. శారీరక బాధల నుంచి విముక్తి కోరుకుని ఉరి వేసుకుందా!? అది కూడా ఖర్మకొద్దీ ఆ రోజునే.. ప్చ్! నీలాంబ మరణం కలిగించిన లోలోన ఘర్షణను మర్చిపోవడానికి అన్నట్లు ఈ పెళ్లిపనులు మీదికెత్తుకున్నాడు జాయచోడుడు. రాత్రింబవళ్లు మరో ఆలోచన రాకుండా అన్నీ తానై నిర్వహిస్తున్నాడు.కాకతీయ సామంత రాజ్యాలన్నీ కూడా గణపాంబ వివాహం తెచ్చిన ఉత్సవ వాతావరణంతో సంబరాలను జరుపుకొంటున్నాయి. సంబరాలతో పులకించిపోతోంది అనుమకొండ మహానగరం. నగరమంతా చలువ తాటాకులతో పెళ్లిపందిరులు వేస్తున్నారు. ఇక కాకతీయకోట, అందులో ఉన్న నియోగాలు, భవనాలు, రాజప్రాసాదాలు, రాజనగరి అన్నిటా సంతోష సందడులే. రాజనగరి మరీమరీ వెలిగిపోతోంది. రాజ్యమంతటా ఆనందసంద్రాలు పొంగి పొరలుతున్నాయి. పెళ్లి బరువు బాధ్యతల నడుమ కాబోయే కాకతీయ వారసులపై ఓ కన్నేసి ఉంచాడు జాయచోడుడు. ముఖ్యంగా పెద్ద మేనల్లుడు రుద్రమదేవుడు, రెండవ మేనల్లుడు మురారిదేవుడు.. వాళ్లిద్దరి కదలికలు, ఉత్సాహ ఉద్వేగాలు.. పెళ్లి సంబరాల్లో వాళ్ల ఆటపాటలు.. అన్నీ పరిశీలిస్తున్నాడు. హరిహరుడు, మురారి విసురునాడులోని గురుకులంలో యుద్ధవిద్యలు అభ్యసిస్తుండగా.. హరిహరుడు కాలధర్మం చెందాడు. మురారి అక్కడే చదువు కొనసాగిస్తున్నాడు. గణపాంబ పూర్తిగా రాజప్రాసాదంలోనే రాజగురువుల వద్ద చదువుకుంటుండగా.. రుద్రమదేవుడు త్రిపురాంతకం గోళకిమఠంలోని విద్యాకేంద్రంలో చదువుతున్నాడు. చదువుతోపాటు యుద్ధవిద్యల్లో కూడా నిష్ణాతుడని విన్నాడు. జాయచోడుని నాజూకు శరీరం రాలేదు గానీ.. అందంలో మేనమామకు తీసిపోడు మురారి. చుట్టూ పదిమంది మిత్రులను వెంటేసుకుని ఎప్పుడూ ఘళ్లుఘళ్లున నవ్వుతూ కేరింతలలో కనిపిస్తున్నాడు మురారి. రుద్రమదేవుడి పక్కన కూడా ఉన్నారు మిత్రులు.. కాదుకాదు అంతా మిత్రురాళ్లు! ఆశ్చర్యపోయాడు. రుద్రమదేవుడు.. గణపతి %-% సోమల దంపతుల ద్వితీయ సంతానం. చూపులకు ఏదో వింత శరీరుడిలా తోచాడు జాయచోడునికి. కాకతీయవంశానికి కాబోయే వారసుడు.. అతని ఆహార్యం వింతగా ఉంది. కంచుకంపై బంగారపు కవచం ధరించాడేమిటి? పరీక్షగా చూస్తే.. అది వక్షస్థలాన్ని నొక్కిపెడుతున్నట్లు! మరింత పరీక్షగా చూస్తే.. చూడకూడని యుక్తవయస్కురాలి యువ సమున్నతాలను దాచడానికి ప్రయత్నం చేస్తున్నట్లుగా తోచింది. సాధారణంగా యుద్ధవీరులైన మహిళలు అలాంటి కవచాలను ధరిస్తారు. కానీ యువ రారాజు, యుద్ధరంగంలో ఉన్నట్లు అక్క పెళ్లిసంబరాలలో దుస్తులపై కవచం ధరించడం ఏమిటి?! రుద్రమదేవుని జనన సమయంలో రాజ్యంలో చెలరేగిన వాద ప్రతివాదాలు గుర్తొచ్చాయి జాయచోడునికి. చతుష్పథం వద్ద మిత్రుల చర్చలు కళ్లముందు కదలాడాయి. ఇతనికోసమా అప్పట్లో రాజ్యమంతా అట్టుడికిపోయింది?! ఇతనా కాబోయే చక్రవర్తి? ఇతనా పరిణత రాజకీయవేత్త, రణరంగ నిపుణుడు, ఆయన కలలోకి వచ్చినా శత్రువు గుండె ఆగి మరణిస్తాడని కవులు కీర్తించే గణపతిదేవుని వారసుడు? అతణ్ని ఎగాదిగా చూసి జాయచోడుని ఆనందం ఆవిరైపోయింది. అప్పుడే రుద్రమదేవుడు కూడా జాయచోడుణ్ని పరిశీలనగా చూస్తున్నాడు. తననే చూస్తున్న రుద్రమదేవుణ్ని చూసి పలకరింపుగా నవ్వాడు జాయచోడుడు. అతను తిరస్కారంగా చూసి మూతి తిప్పుకొని వెళ్లిపోయాడు.

**దిమ్మెరపోయాడు జాయచోడుడు. వీరయువకుడు అలా మూతి తిప్పడం!??**

అభినయాలు ఎన్నిరకాలో, ప్రతి శరీరభాగ కదలికలు ఎలా ఉండాలో సప్రమాణంగా చెప్పగల మహానాట్యకారుడు జాయచోడుడు విభ్రాంతి చెందాడు. ఆ మూతి తిప్పడం?? ఎటువెళ్లినా.. ఏమి చేస్తున్నా.. ఆ మూతి తిప్పుడు దృశ్యమే మరీమరీ జాయచోడుని కళ్లముందు కదలాడుతోంది. అతనిపై దృష్టిపెట్టాడు జాయచోడుడు. అతడు ఎవ్వరితో కలవడంలేదు. పక్కన ఇద్దరు పరిచారికలు అన్నీ సమకూరుస్తూ అతని వెన్నంటి ఉన్నారు. 'వెన్నంటి ఉన్నారు' అనే కంటే.. ఎవ్వరినీ కలవకుండా కాపలా కాస్తున్నారు అనొచ్చు.వెలనాడు కార్యాలయంలోనే పనిచేస్తూ జాయచోడుడు అనుమకొండ వచ్చిన నాటినుంచి తిరిగి ఆయన ఆంతరంగిక వార్తాహరుడుగా వ్యవహరిస్తున్న వృద్ధుడైన అంకమరట్టని పిలిచి రుద్రమదేవుని కదలికలు పరిశీలించమన్నాడు. మరునాడు అంకమరట్ట చెప్పాడు చెవిలో.. “యువరాజుగారిలో అబ్బాయి కంటే అమ్మాయి లక్షణాలు ఎక్కువగా ఉన్నాయని యువకులే నవ్వుకుంటున్నారు. పైగా యువరాజుగారు యువకుల చెయ్యి తగిలినా చిరాకు పడిపోతున్నారట మహారాజా! ఇక భుజంపై చెయ్యి వేస్తే యుద్ధమేనట!”. చలువపందిళ్లు వేస్తున్నచోట ఉన్నాడు రుద్రమదేవుడు. యువకులంతా కబుర్లు చెప్పుకొంటూ పనిచేస్తుంటే.. అతను మాత్రం ఇద్దరు చెలికత్తెల మధ్య చెంపకు చెయ్యి ఆన్చి విస్ఫారిత నేత్రాలతో చూస్తున్నాడు. చెలికత్తెలు ఏదో చెప్తున్నారు. ముగ్ధ మనోహరంగా అచ్చమైన తెలుగింటి ఆడపిల్లలా నవ్వుతున్నాడు. నవ్వుతున్నప్పుడు ఆ బుగ్గలపై బుజ్జిబుజ్జి చొట్టలు చూడముచ్చటగా కనిపించీ కనిపించకుండా వచ్చి పోతున్నాయి. జాయచోడుని మనసంతా విచారం అలుముకుంది. రుద్రమదేవుడు కేవలం స్త్రీ అయితే ఎంత కన్నులపండువగా ఉంటుంది! తల్లిలా ఛాయ తక్కువైనా.. అందానికి తిరుగులేదు!!

**భగవంతుడా.. బావగారికి ఎంత పెద్ద పరీక్ష పెట్టావయ్యా!!**

ప్చ్.. బావగారితో వీడి గురించి చర్చించాలి అనుకుంటూ గణపాంబ ఉన్న మందిరంలోకి ప్రవేశించాడు. ఎదురుగా గణపాంబను అలంకరిస్తున్నారు సైరంధ్రిలు, పుష్పలావికలు. సహకరిస్తూ హాస్యమాడుతున్న మిత్రురాళ్లు, బంధువుల్లోని యువతులు. అదొక యువ యవ్వన కెరటాలు ఎగసిపడుతున్న సంద్రం. ఆ మందిరమంతా విరిసిన నవ్వుల నవ సుమపరిమళంతో పల్లవించి ప్రవహిస్తోంది. 'తను ఆ యవ్వనప్రాయపు సవ్వడులను దాటిపోయాడేమో..' పలకరింపుగా నవ్వి వెనుదిరిగాడు. “మామా..” పిలిచింది గణపాంబ. ఆగి వెనుదిరిగి చూశాడు. గణపాంబ ఆత్మీయంగా పరిగెత్తుకు వచ్చింది. “వీడు.. నా తమ్ముడు. రుద్రమదేవుడు!”. “ఆరోజు తండ్రిగారు పరిచయం చేశారుగా పెద్దతల్లి. కానీ, మాట్లాడలేదు” అన్నాడు రుద్రమదేవుణ్ని ఎగాదిగా చూస్తూ. “రుద్రా.. జాయచోడదేవుడు మామ. వినే ఉంటావు. దైవం ప్రసాదించిన మామ. ఎవరికోగానీ, ఇలాంటి మామ దొరుకడు. మహాయోధులు, మహానాట్యకారులు కూడా. అంతేకాదు తండ్రిగారికి అత్యంత నమ్మకస్తులు..” గొప్పగా చెప్పింది గణపాంబ. “విన్నాను. విన్నాను. పిఠాపుర యుద్ధంలో తండ్రిగారికి ఆయుధం అందించిన తీరు తండ్రిగారు ఎప్పుడూ చెబుతుంటారు. త్రిపురాంతకంలో మా యుద్ధగురువులు కూడా మామ ప్రతిభను పాఠాల వేళ ప్రస్తావిస్తుంటారు. ఇప్పుడు దగ్గరగా చూస్తున్నాను” అన్నాడు రుద్రమదేవుడు తిప్పుకొంటూ.అతని గొంతు.. హతవిధీ! ఎంత అన్యాయం చేశాడు దేవుడు. గొంతుకూడా స్త్రీలాలిత్యంతో ఎంత శ్రావ్యంగా ఉంది! రాత్రి ఆంతరంగిక మందిరంలో గణపతిదేవుడితో అన్నాడు జాయచోడుడు. “రుద్రమదేవుడి అంశంలో.. దేవుడు అన్యాయం చేశాడు బావగారు!”. పెళ్లి ఏర్పాట్లలో చాలా అలసిపోయినట్లు ముఖం పెట్టాడు గణపతిదేవుడు. “వాడు.. అక్కడే ఇంకా బాగాచదివి ప్రవర్ధిష్ణువు కావాలి. కానీ, అక్కపెళ్లి చూడాల్సిందేనని పట్టుబట్టి మరీ వచ్చాడు. ప్చ్! నిద్ర వస్తోంది జాయా..” అన్నాడు ఆవులిస్తూ. ఆయన ముక్తసరిగా సంభాషణ ముగించి.. 'వెళ్లిపో!' అన్నట్లు మాట్లాడటం ఆశ్చర్యపరచింది. మరునాడు రాజనగరిలో వివాహనికొచ్చిన అతిథులకు నాట్య ప్రదర్శనలు ప్రారంభమయ్యాయి. మొదటి ప్రదర్శనే జాయచోడుని నృత్తం. తొలి ప్రదర్శన కావడం.. అదీ జాయచోడుడు నర్తించనుండటంతో రాజనగరి నాట్యమండపం కిక్కిరిసిపోయింది.అందరూ ఆయన నృత్త విన్యాసాన్ని శారీరక కదలికలను విభ్రాంతితో చూస్తున్నారు. సాక్షాత్తూ నటరాజు కైలాసం వీడి అనుమకొండ వచ్చినట్లు.. ఆడుతున్నాడు జాయచోడుడు. కానీ, అతనిలో ఏకాగ్రత లేదు. భావప్రకటన విరుద్ధంగా ఉంది. పాద ముద్రలు తడబడుతున్నాయి. హస్తముద్రలైతే ఘోరం. కానీ, ప్రేక్షకులు ఎప్పటిలాగే విస్మయంతో చప్పట్లు కొట్టి ఆయనను అభినందనలతో ముంచెత్తారు. తీవ్ర విషాదంలో కూరుకుపోయాడు జాయచోడుడు. మొదటిసారి తను నృత్తంలో తప్పటడుగులు వేశాడు. నటుని తాదాత్మ్యత కోల్పోయాడు. విన్యాస విచిత్రాలకు మాత్రమే సాధారణ ప్రేక్షకులు మైమరుస్తారు. కానీ నాట్య ప్రవీణులు చూస్తే ముఖాన ఊస్తారు. పూర్తిగా ఘోరమైన మార్గినృత్తం. దీనికంటే ఓ మారుమూల పల్లెటూరిలో దేశీ ప్రదర్శన ఉత్తమం. తల వంచుకుని రంగమండపం దిగిపోతున్న జాయచోడుడు.. ప్రేక్షకుల్లో ఓ యువతి తనను పరికించి చూడటం గుర్తించాడు. ఎవరీమె? ఎక్కడో చూసినట్లు తెలుస్తోంది. ఎవరీమె.. ఎవరై ఉంటారు?.. ఆమె చేతులు జోడించి అభినందనగా చప్పట్లు చరచి తిరిగి చేతులు జోడించి నమస్కరించి అభినందనగా చూసి మాయమైంది.ఆ పిల్లను చూశాక అతని నృత్త విఫలత తాత్కాలికంగా పక్కకుపోయింది. ఎవరీ పిల్ల?! ఎక్కడ చూశాను అనే ఆలోచన పెరిగిపోయింది. వివాహం క్రతువు పదిరోజులు. ముందువెనకా సంబరాలు మొత్తంగా నెలరోజులు. ఇటు వియ్యాలవారి ఆచార వ్యవహారాలను సమాదరిస్తూ, అటు గణపతిదేవునికి, సోమలదేవికి సహకరిస్తూ శాస్త్రీయ వివాహతంతులలోనూ జాయచోడుడే. యువకులతో చెడుగుడు, యువతులతో పాత్ర గొండ్లి, గుర్రం భంజలి.. అందరినీ కలిపి బిళ్లంగోడు.. అలాగే యువతీ యువకులకు లాస్యనాట్యం, దండరాసకం నేర్పించి, ఆడించి, ఆడి, నాట్యం చేసి నవ్వించి కవ్వించి పెళ్లి వేడుకలను మరపురాని మధుర సంఘటనగా లిఖించాడు. అప్పగింతల వేళ రాజ ప్రాసాదమంతా ఉద్వేగపు కన్నీటిలో తడిసి ముద్దయ్యింది. సహజంగా స్త్రీలందరూ తీవ్రంగా దుఃఖిస్తున్నారు కానీ కాస్త ఎక్కువగా ఏడ్చింది మాత్రం నారాంబతోపాటు రుద్రమదేవుడు! వెక్కివెక్కి ఏడ్చిన ఏకైక మగాడు!! కానీ, మరి కొన్నిరోజులలో ఓ వార్త రాజధానిలో పుట్టి పెద్దలను భయవిహ్వలులను చేసింది. గణపతిదేవుని పెద్ద కుమారుడు.. యువరాజు రుద్రమదేవుడు ఆడమగ కానీ నపుంసకుడు!!

# ప్రొటీన్ ఎక్కువగా తీసుకుంటున్నారా.. ఈ సైడ్ ఎఫెక్ట్స్ తప్పవు



మనిషి ఆరోగ్యానికి ప్రొటీన్ ఎంతో మేలు చేస్తుంది. కానీ, మోతాదు మించితే రక్తంలో కలిసే ప్రొటీన్ విషంగా మారుతుంది. అందుకే మనిషి బరువును బట్టి అవసరమైన ప్రొటీన్ ను లెక్కగట్టి తీసుకోవాలంటున్నారు నిపుణులు. కిలో శరీరబరువుకు 0.8 గ్రాముల ప్రొటీన్ మాత్రమే అవసరం. కాబట్టి మీ బరువును బట్టి మీకెంత ప్రొటీన్ అవసరమో లెక్క వేసుకోవచ్చు. బరువు తగ్గేందుకు, కండరాల నిర్మాణానికి, కణాల రిపేర్ చేయడానికి ప్రొటీన్ చాలా అవసరం. అయితే ప్రొటీన్ అధికంగా ఆహారాన్ని అపరిమితంగా తింటే మాత్రం ఆరోగ్య సమస్యలు వస్తాయి.

**దాహం పెరుగుతుంది**

శరీరంలో ప్రొటీన్ ఎక్కువైతే శరీరం నీరసించి పోతుంది. తీవ్రమైన దాహం కలుగుతుంది. ఎందుకంటే.. అధిక ప్రొటీన్ వల్ల శరీరానికి ఎక్కువ నీరు కావాల్సి వస్తుంది. దాని వల్ల విపరీతమైన దాహం వేస్తుంది. దీనికి కారణం ప్రొటీన్లో ఉండే నత్రజని. ఇది అధికంగా రక్తంలో చేరడం వల్ల ఇలాంటి మార్పులు కలుగుతాయి. దీని వల్ల మూత్రపిండాలపై అధిక భారం పడుతుంది. వ్యర్థాలను బయటకు పంపేందుకు అధికంగా కష్టపడాల్సి వస్తుంది. ఎంత నీరు తాగిన శరీరానికి సరిపోదు. దీనివల్ల శరీరం బలహీనంగా మారిపోతుంది. తలనొప్పి ఎక్కువైపోతుంది. బరువు తగ్గి సన్నగా మారిపోతారు.

**నోటి దుర్వాసన దీని లక్షణమే..**

చాలా మంది నోటి దుర్వాసనతో బాధపడుతుంటారు. ఇందుకు ఆహారంలో అధిక ప్రొటీన్ కూడా కారణమేనంటున్నారు. ప్రొటీన్లో ఉండే రెండు ఆమ్లాల తీవ్రమైన దుర్గంధాన్ని కలిగిస్తాయి. ఇందుకోసం కూడా అధికంగా నీళ్లు తాగాల్సి వస్తుంది.

**మలబద్ధకం**

ప్రొటీన్ శరీరంలో అధికమైతే మలబద్ధకం సమస్య కూడా ఎక్కువవుతుంది. కార్బోహైడ్రేట్లు తగ్గి, ప్రొటీన్ పెరిగితే మాత్రం ఈ సమస్య మరీ తీవ్రంగా మారుతుంది. ప్రొటీన్ ఉండే ఆహారం అధికంగా తిన్నామనిపిస్తే, కార్బోహైడ్రేట్లు ఉండే ఆహారాన్ని అధికంగా తినాలి.


**ప్రొటీన్ అధికంగా ఉండే పదార్థాలు...**

కొన్ని ఆహారాల్లో ప్రొటీన్ అధికంగా దొరుకుతుంది. మటన్, చికెన్, గుడ్లు , చేపలు, రొయ్యలు, పాలు, పెరుగు, చీజ్, నట్స్ (బాదం, జీడిపప్పు,వాల్నట్స్, గుమ్మడి గింజలు, నువ్వులు, సన్ ఫ్లవర్ గింజలు, టోఫు, అన్ని రకాల బీన్స్, శెనగలు... వీటన్నింటిలో ప్రొటీన్ ఉంటుంది.

**ఒంటి నొప్పులు..**

ప్రొటీన్ ఎక్కువగా ఉండే ఆహారాలు శరీరంలో వేడిని కలిగిస్తాయి. ఉదాహరణకు చికెన్, గుడ్లు, రొయ్యలు వంటివి. వీటిని మోతాదుకు మించి తీస్కుంటే ఒంటి నొప్పులు వేధిస్తాయి.

# ప్రేమంటే ఏమిటంటే



'జనవరి జయం జయం.. ఫిబ్రవరి పెండ్లికి పిలుపు' అని చిన్నప్పటి గేయం. వాలంటైన్ పుణ్యమా అని ఫిబ్రవరి అంతా ప్రేమికుల మాసంగా మారిపోయింది. ఈ నెల కోసం యువత ఏడాదంతా ఎదురు చూస్తూ ఉంటుంది. ప్రేమను వ్యక్తం చేయడానికి, ప్రేమించిన వారితో సమయం గడపడానికి వాలెంటైన్ డేని చాలామంది ఓ ప్రత్యేకమైన సందర్భంగా భావిస్తారు. గిఫ్టులు, టూర్లు ప్లాన్ చేస్తారు. ఫిబ్రవరి 14వ తేదీ ఒక్కరోజులో ప్రపంచవ్యాప్తంగా కోట్ల రూపాయల వ్యాపారం జరుగుతుందంటే అతిశయోక్తి కాదు. గులాబీలు, చాక్లెట్లు, ఖరీదైన బహుమతుల కొనుగోళ్లతో అన్ని షాపులు బిజీ బిజీ. మనిషిని ఇంతలా వశపరచుకుంటున్న ఈ ప్రేమ ఎక్కడ మొదలవుతుంది? ఎన్ని రకాలుగా ఉంటుందో.. తెలుసుకుందాం.పరీక్షలఅప్పుడెప్పుడో గజినీ సినిమాలో సూర్య, అసిన్ 'హృదయం ఎక్కడున్నది.. హృదయం ఎక్కడున్నది..' అంటూ ప్రేమ గీతం పాడుకుంటే అందరూ ఫిదా అయ్యారు. ప్రేమ మనిషిలో ఎక్కడ ఉంటుందో తెలుసుకోవడానికి ఒక్కరూ ప్రయత్నించలేదు. సైకాలజిస్టులు మాత్రం ఈ అంశంపైన దృష్టి సారించారు. న్యూయార్క్‌లోని ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ మెడికల్ కాలేజ్‌కి చెందిన బినాక అస్విడో రొమాంటిక్ లవ్‌పై పరిశోధనలో భాగంగా ప్రేమ మెదడులో ఎక్కడ ఉంటుందో తెలుసుకోవడానికి ప్రయత్నించారు. ప్రేమలో ఉన్నవారికి ప్రేయసి లేదా ప్రియురాలు ఫొటో చూపించినప్పుడు మెదడులోని వెంట్రల్ టెగ్మెంటల్ ఏరియా (వీటీఏ), న్యూక్లియస్ అకమ్బన్స్, వెంట్రల్ పల్లిడియం, రఫే న్యూక్లియస్ ప్రాంతాలు ఉత్తేజితమయ్యాయని ఎఫ్.మ్యాగ్నెటిక్ రెజోనెన్స్ ఇమేజింగ్ ద్వారా తెలుసుకున్నారు.

**తొలి రోజుల్లో..**

వెంట్రల్ టెగ్మెంటల్ ఏరియా రివార్డ్ సిస్టంలో కీలకమైన ప్రాంతం. నూతన ప్రేమికుల్లో ఈ ప్రాంతం బాగా ఉత్తేజితమవుతుందని పరిశోధనలో తేలింది. వెంట్రల్ పల్లీడియం, రఫే న్యూక్లియస్ ప్రాంతాలు 20 ఏళ్ల తర్వాత కూడా ఒకరి పట్ల ఒకరికి ప్రేమ ఉండటానికి కారణమని తెలుస్తుంది. వెంట్రల్ పల్లీడియం అటాచ్‌మెంట్ హార్మోన్లను విడుదల చేసి బంధం నిలబడేలా చేస్తుంది. దీర్ఘకాలిక ప్రేమికుల్లో రఫే న్యూక్లియస్ సెరటోనిన్ హార్మోన్ రిలీజ్ చేసి బంధంలో కుదురుకునేటట్టుగా చేస్తుంది. మనుషుల్లో ప్రేమ భావన పెంపొందడంలో మెదడులోని రివార్డ్ సిస్టం కీలక పాత్ర పోషిస్తుందని న్యూరోసైన్స్ చెబుతుంది. మెదడులోని హిప్పో క్యాంపస్, మీడియల్ ఇన్సుల, యాంటీరియర్ సింగ్లేట్ భాగాలు రివార్డ్ సిస్టంలో ప్రధాన పాత్ర పోషించి ప్రేమ అనే భావన వృద్ధి చెందేలా చేస్తాయని పరిశోధనలో తేలింది.

**కెమికల్ గడబిడ ..**

ప్రేమ అనే ఫీలింగ్ కలిగినప్పుడు మెదడులో ఏం జరుగుతుందనే దానిపై హార్వర్డ్ మెడికల్ కళాశాల శాస్త్రవేత్తలు పరిశోధనలు చేశారు. మెదడులో విడుదలయ్యే కొన్ని రసాయనాల ఫలితమే ప్రేమ అని తేల్చి చెప్పారు. ప్రియురాలితో చూపు కలవగానే మెదడులో ఫినెల్ తలామిన్ అనే రసాయనం విడుదలవుతుంది. అరచేతుల్లో చెమట పట్టడం.. మోకాళ్లు వణకడం ఈ హార్మోన్ ప్రభావమే. ఈ లవ్ మాలిక్యూల్ కొద్ది మోతాదులో చాక్లెట్‌లా ఉంటుంది. అందుకనే వాలంటైన్ రోజు చాక్లెట్ల అమ్మకాలు ఊపందుకుంటాయి. ఒక మనిషిపై వ్యామోహం కలగడానికి మెదడు విడుదల చేసే అడ్రినలిన్, డోపమైన్, నారోఫినెప్రిన్ హార్మోన్లే కారణం. నచ్చినవారి చూడగానే శరీరంలో ఈ హార్మోన్లు విడుదలై అనేక స్పందనలు కలిగిస్తాయి. అందుకే ప్రేమికులు గంటల కొద్దీ కబుర్లు చెప్పుకొంటారు. ప్రపంచాన్ని మర్చిపోతారు. ఈ దశలో వీరిలో ఆక్సిటోసిన్ అనే హార్మోన్ రిలీజ్ అవుతుంది. దీని ప్రభావంతో ఒకరిని ఒకరు టచ్ చేయాలని, హగ్ చేసుకోవాలని అనిపిస్తుంది. ఈ హార్మోన్ల ప్రభావం 3 నెలల నుంచి 18 నెలల వరకూ ఉంటుంది. ఆ తర్వాత కూడా ప్రేమ ప్రయాణం దీర్ఘ కాలం కొనసాగితే వాసోప్రెసిన్ అనే హార్మోన్ విడుదల అవుతుంది. ఇది ఇద్దరి మధ్య బంధం మరింత బలపడటానికి దోహదపడుతుంది.

**ఏడు రంగుల వాన**

నేటి యువత ప్రేమ అని అనుకుంటున్నది ప్రేమ కాదు. కేవలం వ్యామోహం మాత్రమే. నిజమైన ప్రేమ అంటే ఏమిటో సైకాలజిస్ట్ స్టర్న్ బెర్గ్ తన త్రిముఖ ప్రేమ సిద్ధాంతంలో వివరించారు. ఇంద్రధనుస్సులో ఏడు రంగులు ఉన్నట్టే ప్రేమకు మౌలికాంశాలు అయిన సాన్నిహిత్యం, వ్యామోహం, నిబద్ధతల కలయికలతో ఏడు రకాల ప్రేమలు పుడతాయని ఆయన వివరించారు. లైకింగ్, ఇన్ ఫ్యాట్, లవ్, ఎంప్టీ లవ్, రొమాంటిక్ లవ్, కంపానియట్ లవ్, ఫటస్ లవ్, కంజుమేటివ్ లవ్ అని ఏడు రకాల ప్రేమలు ఉంటాయని వివరించారు. వీటన్నిటిలోనూ కంజుమెట్ లవ్ అనేది అతి ముఖ్యమైనది. నేటి యువత రొమాంటిక్ లవ్‌ను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటుంది. అది పరిపూర్ణమైన ప్రేమ కాదు. సాన్నిహిత్యం, వ్యామోహం, నిబద్ధత కలగలిసిన ప్రేమే నిజమైనది, శాశ్వతమైనది. దాన్ని సాధించడం ఎంత కష్టమో, నిలుపుకోవడం కూడా అంతే కష్టం. ప్రేమ స్వరూపాన్ని, పరిపూర్ణత్వాన్ని అర్థం చేసుకున్న వారికి అది ఒక ఎమోషన్‌లా కాకుండా, మోటివేషన్‌లా పనిచేస్తుంది. ప్రేమ సఫలమైనా, విఫలమైనా జీవితంలో ముందుకు తీసుకువెళ్తుంది.

రమాయణం


# అమ్మగార్లు.. అయ్యగార్లు

మొదట్లో మా ఇంట్లో వంటకు అయ్యగారు ఉండేవారు. అయితే, మేము మిడిల్ స్కూల్‌కు వచ్చేసరికి అమ్మే వంట చేసేది. ఏరోజూ ఏడెనిమిది మందికి తక్కువ కాకుండా తను వండాల్సి ఉండేది. అయినా.. కొన్ని ప్రత్యేక సందర్భాల్లో వంటల కోసం అయ్యగార్లు, అమ్మగార్లూ వచ్చేవారు. 'ఆడ ఇక మా నాన్న తన అమ్మమ్మకూ, తాతయ్యకూ దత్తపుత్రుడు కనుక వాళ్లిద్దరికీ తద్దినాలు పెట్టేవాడు. అది చాలా ఖర్చు, శ్రమతో కూడిందైనా, నాన్న తన ఎనభై మూడో ఏట చనిపోయేదాకా.. సుమారు తన పద్నాలుగో ఏట నుంచీ.. అంటే డబ్బై ఏళ్లపాటు ఎంతో శ్రద్ధగా ఆబ్దికాలు పెట్టేవాడు. “ఎందుకు నానా ఈ తద్దినం పెట్టడం?!” అని ఓసారి అడిగాను. దానికి నాన్న ఎంతో ఓపిగ్గా.. “మనం రోజూ అన్నం తింటం గద! మరి పై లోకానికి పోయినోళ్లకు ఎవరు పెడతరు?! మనకు ఒక సంవత్సరం అయితె వాండ్లకు ఒకరోజు అన్నట్టు. అందుకోసం వాండ్లకు ఏడాదికొక్కసారి పిండాలు పెట్టాలె. దాన్ని కాకులకో, పక్షులకో పెడుతం. వాండ్లు పక్షుల రూపంల ఒచ్చి తినిపోతరని, అట్ల వాండ్ల దీవెనలు ఉంటయని పెద్దవాండ్ల నమ్మకం!” అని చెప్పాడు. అట్లాగే ఇంకోమాట కూడా చెప్పాడు.. “పెద్దవాండ్ల విశ్వాసం కోసం అది చెయ్యాలె. ఆ పేరుతోటి ఆరోజు ఒక పదిమంది ఆకలితోటి ఉన్నవాండ్లకు భోజనం పెడితే బాగుంటదని నాకనిపిస్తది”.. ఆ మాట నాకు ఇప్పటికీ గుర్తుంది. వారం ముందే ఓ జీతగాడిని వెంటపెట్టుకుని వెళ్లి కిరాణా సామాను తెచ్చేవాడు నాన్న. అప్పుడే కాదు.. నాన్న ఎప్పుడు ఇంట్లోకి సామాను తెచ్చినా నాకూ, అక్కకూ చెరో బిస్కట్ ప్యాకెట్ తెచ్చి ఇచ్చేవాడు. మేము వాటికోసమే ఎంతో ఆత్రంగా ఎదురు చూసేవాళ్లం. అదే మాకు చాలా గొప్ప ఔట్ సైడ్ ఫుడ్. అదికూడా తరచుగా ఉండేది కాదు. ఏదైనా ఇంట్లో చేసింది తినడమే! తద్దినం రోజు ఏడింటికల్లా మా పక్కఊరు చాగల్లు నుంచి సింహయ్యగారు, ఆయన కొడుకు కేశవయ్యగారు వచ్చేవారు. ఆరోజు వీలైనంత వరకూ నేను బడి ఎగ్గొట్టడం తప్పనిసరి అని వేరే చెప్పక్కర్లేదుగా! వాళ్లు వస్తూనే మడిపంచెలు కట్టుకుని వంటింట్లో దూరేవారు. అమ్మకు ఒక్క వంట తప్పేది కానీ, మిగతా అన్ని పనులూ పెరిగేవి. ఓ పది రకాల వంటకాల కోసం బోలెడు కూరగాయలు కోసి, మిగతా వంట సామానంతా సిద్ధం చేసి ఉంచేది. వాళ్లు పిలిస్తే చాలు.. “ఏం గావాలె అయ్యగారూ!” అంటూ సిద్ధంగా ఉండేది. దగ్గరి మూడు కుటుంబాల బంధువులు భోజనాలకు వచ్చేవారు. ఇంకా పదిమంది దాకా పనివాళ్లకు, ఆరోజున ఎందరొస్తే అందరు బిచ్చగాళ్లకు భోజనాలు పెట్టడం అమ్మవంతే అయ్యేది. మేము కాస్త పెద్దయిం తరువాత వడ్డనలు చేసేవాళ్లం. అప్పుడు గ్రైండర్లు, మిక్సర్లు లేవు గనుక.. అయ్యగార్లు పెద్దరోటి ముందు కూచుని పప్పు రుబ్బేవారు. వాళ్లు చేసే గారెలు భలే రుచిగా ఉండేవి. మమ్మల్ని వంట చేసేటప్పుడు ఆ దరిదాపులక్కూడా రానిచ్చేవారు కాదు. మాకేమో మగవాళ్లు ఎలా వండుతారో చూద్దామని కుతూహలం. “ఇటు దిక్కు రావొద్దు.. మడి!” అనేవారు. ఇంకొక బ్యాచ్ బ్రాహ్మలు వచ్చి ఏవో మంత్రాలు చదివి నాన్నచేత తద్దినం పెట్టించేవారు. తరువాత అందరం వరుసగా కింద చిన్న చాపల మీద కూచొని.. ముందు విస్తర్లు పరుచుకుని ఉంటే, వాళ్లే వడ్డన చేసేవారు. సింహయ్య గారు అప్పటికే చాలా పెద్దాయన. ఆయనకు వంగడం వచ్చేది కాదు. అన్నిటినీ నిలబడే అంతెత్తునుంచి తపుక్కున విస్తట్లో వేసేవాడు. అయినా మేము భయంతో ఏమీ అనేవాళ్లం కాదు. ఆ తరువాత చాలా ఏళ్లపాటు కేశవయ్యగారు కూడా వచ్చేవాడు. నాన్న చనిపోయాక ఇక మా పుట్టింట్లో తద్దినాలు పెట్టడం ఆగిపోయింది. కొన్నాళ్లకు కేశవయ్యగారు మంచాన పడ్డాడని తెలిసి వెళ్లి చూసొచ్చాను. ఆయన పోయినా ఇప్పటికీ ఆ కుటుంబంతో టచ్‌లోనే ఉన్నాం. మా చిన్నప్పుడు కూనూరు నుంచి లక్ష్మయ్యగారు, వాళ్లన్నయ్య మత్స్యయ్యగారు మా ఇంటికి వచ్చి పోతుండేవారు. “గీ మత్స్యయ్య ఏం పేరు? గీయిన మనిషే గద.. చేప పేరు పెట్టుకున్నడేంది?!” అని అమ్మను అడిగాను. “నీకు కోతి మాటలు బాగ ఎక్కువయినయ్! శ్రీ మహావిష్ణువు దశావతారాలల్ల మొదటిది ఏంది?!” అన్నది అమ్మ. నాకు ఠక్కున గుర్తొచ్చింది. “తిరుపతి, యాదగిరి, సింహాచలం.. అని దేవుని గుళ్లుండే ఊరి పేర్లు పెట్టుకున్నట్టే.. మత్స్యగిరి, వరాహగిరి, కూర్మనాథం అని కూడా పెట్టుకుంటరు” అన్నది అమ్మ. అప్పుడర్థమైంది. ఇంతకూ ఈ మత్స్యయ్యగారి గురించి చెప్పొచ్చేదేంటంటే.. ఈయన ఎప్పుడూ మా అక్కాచెల్లెళ్లిద్దరి మధ్యలో ఏదోఒక గొడవో, పోటీనో పెట్టి తమాషా చూద్దామనుకునేవాడు. మేమేం తక్కువా?! ఆదర్శ అక్కాచెల్లెళ్లం మరి! మాకు పెద్దగా కొట్లాటలే వచ్చేవి కావు. ఆయన మా పుట్టినరోజులు గుర్తు పెట్టుకుని ఒకరోజు ముందుగానే వచ్చేవాడు. పుట్టినరోజంటే పెద్దగా కేక్ కట్‌చేయడం, స్నేహితుల్ని పిలవడం, సెలెబ్రేట్ చేయడం లాంటివి మాకు తెలియదు. ఆరోజు తలంటు పోసుకోవడం, ఉన్నంతలో కొత్త బట్టలు వేసుకోవడం చేసేవాళ్లం. అమ్మ ఏదైనా స్వీట్ చేసేది. ఈ మత్స్యయ్యగారు రాగానే.. “పోయినేడు మీ చెల్లె పుట్టినరోజుకు లడ్డూలు చేయించింది అమ్మ. మరి నీ పుట్టిన్రోజుకు ఏం చెయ్యాలె చెప్పు?! మీ అమ్మను అడుగు” అంటూ అక్కను రెచ్చగొట్టేవాడు. ఇక అక్క లడ్డూలు చేయించమని అమ్మ వెంటపడేది. ఆ తరువాత వచ్చే నా పుట్టినరోజు కూడా అంతే! “మీ అక్క పుట్టినరోజుకు లడ్డూలు చేసిన్రు. నీకు గూడ గవ్వే అయితె ఏం బావుంటది?! మంచిగ మైసూర్ పాక్ చేయించుకో.. అమ్మ తోటి చెప్పుపో!” అనేవాడు. “ఏం జెయ్యాల్నో అమ్మకు తెల్సు” అనేదాన్ని నేను. ఈయన కథ ఇలా ఉంటే.. అప్పుడప్పుడూ మా ఇంటికి కూనూరు నుంచి అండమ్మగారూ, లక్ష్మయ్యగారూ వచ్చేవారు. వాళ్ల ముచ్చట్ల గురించి వచ్చేవారం చెప్పుకొందాం!



## ఒక ఉద్యోగి వారంలో ఎన్ని గంటలు పనిచేయగలడు

# నిజంగా 90 గంటలు వర్క్ చేస్తే బతుకుతాడా?





ఓ జాతీయ బ్యాంక్‌లో ఉద్యోగం వస్తే ఎంత బాగుంటుంది. పైగా అందులో వెంటవెంటనే పదోన్నతులు వచ్చేస్తే విన్నవాళ్లకి ఈర్ష్య కలిగేంత అదృష్టంగా తోస్తుంది. కానీ పని ఒత్తిడి వల్ల అదే బ్యాంక్ ఉద్యోగి ఆత్మహత్య చేసుకుంటే? ఓ యాభై ఏళ్ల క్రితం వరకట్న హత్యల గురించి వార్తలు వినిపిస్తే, ఇప్పుడు పని ఒత్తిడితో ఇలాంటి మరణాల వార్తలు ఎక్కువవుతున్నాయి. సమాజంలో అంతా సవ్యంగా ఉందని ఎలా అనుకోగలం? చదువుతోనో, మహిళలకు ఉద్యోగ స్వేచ్ఛతోనో మనలో పరిపక్వత వచ్చేసిందని ఎలా సంబరపడగలం? అందుకే మరోసారి వృత్తిగత-వ్యక్తిగత జీవితాల మధ్య సమన్వయం గురించి మాట్లాడుకోవాల్సిందే! లేకపోతే సంస్థలు, వ్యాపారవేత్తల విజయం కోసం పాటుపడే బడుగు జీవులకు ఆ లాభాల్లో వాటా ఎలాగూ దక్కదు సరికదా%ఔ% సాయంకాలపు షికార్లు, పిల్లల కబుర్లు, ఇష్టమైన పాటలు, అనుబంధాలు, ఆరోగ్యాలూ అన్నీ చేజారిపోతాయి. నష్టాల పేరుతోనో, వ్యవస్థీకరణ అంటూనో అదే సంస్థ చేయి విదిలించిన రోజు తన భవిష్యత్ గడ్డివాములా చిటికెలో కాలిపోవడం కనిపిస్తుంది. ‘మీతో ఆదివారాలు కూడా పనిచేయించుకునే అవకాశం లేకపోవడం దురదృష్టం. అయినా ఇంటికి వెళ్లి ఏం చేస్తారు? ఎంతసేపని పెళ్లాం మొహం చూస్తూ కూర్చుంటారు? నేనైతే వారానికి 90 గంటలు పనిచేస్తాను’ దేశంలోనే అతిపెద్ద నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టీ కంపెనీ చైర్మన్ అన్నమాటలివి. ‘మన సంస్థను తప్ప నా కుటుంబాన్ని పట్టించుకోను. మీరు కూడా పట్టించుకోవడానికి వీల్లేదు. మీ కుటుంబం ఏమైపోయినా నాకు అనవసరం!’ ఓ జూమ్ మీటింగ్‌లో ఉన్నతాధికారి ఇచ్చిన తాఖీదు ఇది. పైకి చెప్పకపోవచ్చు, చెప్పినా అవి బయటికి రాకపోవచ్చు. కానీ, చాలా సందర్భాల్లో ఇలాంటి అభిప్రాయాలే యువతరంతో పనిచేయిస్తున్నాయి. అనే సంస్థ 21-30 ఏళ్ల వయస్కుల్లో ఒత్తిడిని నమోదు చేసే ప్రయత్నం చేసింది. ఇందుకోసం అయిదువేల మందిని ప్రశ్నించగా వారిలో 64 శాతం మంది ఉద్యోగంలో ఒత్తిడిని ఎదుర్కొంటున్నామని చెప్పుకొన్నారు. విచారించదగ్గ విషయం ఏమిటంటే మగవారితో పోలిస్తే, మహిళలు పని వాతావరణంలో మరింత ఒత్తిడికి లోనుకావడం. ఆఫీసుకు వెళ్లినా కూడా ఇల్లు, పిల్లల బాధ్యత కూడా తనదే అనే తీరు ఇందుకు కారణం కావచ్చు. వ్యక్తిగత జీవితాన్ని మాయం చేసేలా ఈ సమస్య ఎందుకు వస్తున్నది? దాని పర్యవసానాలు, పరిష్కారాలు ఓసారి తెలుసుకోవాల్సిందే!

### సమస్య ఇలా!

ఒకచోట తన పాత్ర, బాధ్యత, ప్రవర్తన%ఔ% మరో వ్యవస్థను ప్రభావితం చేస్తున్నదంటే కచ్చితంగా వృత్తి-కుటుంబాల మధ్య సమన్వయం లోపించినట్టే. కానీ, అసలు సమస్య ఎందుకు వస్తున్నదీ అంటే కొన్ని స్పష్టమైన కారణాలు కనిపిస్తాయి. ఏ పనికి ఎంత సమయం ఇవ్వవచ్చు అనే విశ్లేషణ సంస్థల్లో లేకపోవడం. పై నుంచి వస్తున్న పనిని వచ్చినట్టుగా కొంతమంది ఉద్యోగులతోనే పూర్తి చేయించే ప్రయత్నం. ఉద్యోగిని ఖాళీగా ఉంచకూడదు అనే దృక్పథం. పనిభారం ఎక్కువైనప్పుడు అది ఎంతైనా తట్టుకోవాల్సిందే అనే ఆలోచన. ముందు యంత్రాలు, తర్వాత కంప్యూటర్, తర్వాత కృత్రిమ మేధ ఒక్కో తరంలో ఒక్కో సాంకేతికత పలకరిస్తున్నది. అది వెల్లువలా ముంచెత్తినప్పుడల్లా ఉద్యోగుల మదింపు ఉంటున్నది. వీటికి తోడు కొవిడ్, ఆర్థిక మాంద్యం, యుద్ధం లాంటి సందర్భాల్లోనూ ఉపాధికి కోత ఉంటున్నది. ఈ అనిశ్చితిలో ఉద్యోగాన్ని స్థిరంగా ఉంచుకునేందుకు మరింత శ్రమిస్తున్నారు. కొవిడ్ ముప్పు ఎప్పుడో తొలగిపోయింది. కానీ, అది అలవాటు చేసిన వర్క్ ఫ్రం హోమ్ మాత్రం అలాగే ఉండిపోయింది. పేరుకే ఇంట్లోంచి పని. కానీ అన్నివేళలా అందుబాటులో ఉండాల్సిందే. ఆఖరికి కంపెనీలు తెరుచుకున్నా సరే ఇంటికి వెళ్లాక కూడా పనిచేసే సౌకర్యాన్ని యజమానులు వీలైనంత మేరకు వినియోగించుకుంటున్నారు. ఒకప్పుడు కార్మిక సంఘాలు ఉండేవి. ఉద్యోగుల తరఫున మాట్లాడేవి. సంస్థలో కూడా ఉద్యోగుల మధ్య స్పష్టమైన పని విభజన ఉండేది.

ఇప్పుడు ఈ రెండు కొరవడటంతో ఎవరితో ఏ పనైనా చేయించవచ్చు, అడిగితే ఊరుకునేది లేదు అనే పరిస్థితి కనిపిస్తున్నది. ఎవరు ఎక్కువ పనిచేస్తే వాళ్లే గొప్ప, వ్యక్తిగత జీవితాన్ని ఎంతలా త్యాగం చేస్తే అంత మంచి ఉద్యోగి, ఆఫీసు పూర్తయినా ఆదివారాలైనా అందుబాటులో ఉండేవాడిదే నిబద్ధత అనే తరహా భావనలు పెరిగిపోవడం. సమయానికి వచ్చి, సమయానికి వెళ్లిపోవడాన్ని బద్ధకంగా చూసే దృక్పథం. రోజుకు పది గంటలపాటు అజమాయిషీ చేయడం, పది గంటలపాటు శ్రమించడం రెండూ ఒకటే అనే అపోహలో ఉండే యజమానులు తాము పనిచేస్తున్నాం కాబట్టి ఉద్యోగులు కూడా పనిచేయాలని కోరుకోవడం. ఎంతవరకు పనిచేయాలి, చేయడం కుదరదని ఎప్పుడు చెప్పాలి, కుటుంబాన్ని తేలికగా తీసుకోకుండా వారికి ఎలాంటి ప్రాధాన్యం ఇవ్వాలి, ఇంట్లో సమయం గడపడం అంటే కాలక్షేపం కాదు కలిసి ఉండటం లాంటి ఎన్నో అంశాల్లో ఉద్యోగులలో అస్పష్టత, అయోమయం.

### నారాయణ మంత్రం

కొన్ని దశాబ్దాల నుంచి, మరీ ముఖ్యంగా ప్రపంచీకరణ నేపథ్యంలో ఇంటికీ, ఆఫీసుకీ మధ్య సరిహద్దులు చెరిగిపోయిన పరిస్థితుల నుంచీ వర్క్-లైఫ్ బ్యాలెన్స్ గురించి చర్చలు జరుగుతూనే ఉన్నాయి. పనిగంటల ప్రస్తావనా మోగుతున్నది. కానీ, గత ఏడాది ఇన్ఫోసిస్ వ్యవస్థాపకులు నారాయణమూర్తి ఈ పనిగంటల గురించి కొన్ని కఠినమైన అభిప్రాయాలు చెప్పినప్పటి నుంచి వేడి రాజుకుంది. ఓ పాడ్‌కాస్టులో మాట్లాడుతూ మూర్తి ‘పేదరికాన్ని తప్పించుకోవాలి అంటే కష్టపడి పనిచేయాల్సిందే అని మా తల్లిదండ్రులు నేర్పారు. ఆ మాటను అనుసరిస్తూ నేను 70 గంటల పనివారాన్ని సూచిస్తాను. ఎన్నో ఏళ్లుగా నేను వారానికి 85-90 గంటలు పనిచేస్తూనే వచ్చాను. పొద్దున 6.20 కల్లా ఆఫీసుకు వెళ్లి, రాత్రి 8:30 తర్వాతే బయటికి వచ్చేవాడిని’ అన్నారు. ఈ మాటలు తీవ్రమైన చర్చకు, ట్రోలింగ్‌కి దారితీశాయి. తన కెరీర్‌ను నిర్మించుకునే వ్యక్తికీ, ఇతరుల కోసం చాకిరీ చేసే వ్యక్తికీ మధ్య పనిలో ఉండే ఉత్సాహాన్ని, ఆ పని అందించే ఫలితాలను ఈ సూచన పట్టించుకోలేదన్నది అన్నిటికంటే ముఖ్యమైన విమర్శ. సంస్థల్లో తెలియకుండా పెరుగుతున్న పని ఒత్తిడికీ, యాజమాన్యాల అత్యాశకీ, కరిగిపోతున్న కుటుంబ సమయానికీ ఈ మాటలు ప్రతీక అని చాలామంది భావించారు. కానీ నారాయణమూర్తి మాత్రం తన వ్యాఖ్యలను సమర్థించుకున్నారు. తన మాటలకు ఎంతోమంది నుంచి అభినందనలు వెల్లువెత్తాయని మురిసిపోయారు. భర్తకు అండగా నిలిచే సుధామూర్తి ఈ వ్యాఖ్యల విషయంలోనూ భర్తను బలపరిచారు. వారానికి 70 గంటలు పనిచేసే అలవాటు తమ కుటుంబం అంతా ఉందని చెప్పారు. కానీ తమ వ్యాఖ్యల పట్ల మధ్యతరగతి కుటుంబాల్లో, సాధారణ ఉద్యోగులలో తీవ్రమైన వ్యతిరేకత వచ్చిందని గ్రహించారో అప్పుడు మూర్తి స్వరం మారింది. అది తన వ్యక్తిగత అభిప్రాయం అనీ, ఎన్ని గంటలు పనిచేయాలీ అన్నది ఒకరి పరిస్థితులు, ఇష్టాయిష్టాలను బట్టి ఉంటాయని వాటిని బలవంతంగా ఆపాదించలేమని చెప్పుకొచ్చారు.

### స్పష్టమైన సిద్ధాంతాలు!

పారిశ్రామిక విప్లవం మొదలయ్యాక ఎంత త్వరగా, ఎంత ఎక్కువసేపు పనిచేస్తే అంత వేతనం అన్న తీరు మొదలైంది. ‘ఒక మనిషికి ఓ పని అప్పచెప్పి రోజంతా చెయ్యమన్నా చేస్తాడు, పావుగంటలో చేయమన్నా చేస్తాడు. కాబట్టి వీలైనంత తక్కువ సమయంలోనే చేయించుకునే ప్రయత్నం చేయాలి’ అనే నమ్మకం బలపడింది. దాంతో పనిగంటలు పెరిగిపోయాయి. వాటిని నియంత్రించేందుకు కార్మిక చట్టాలు వచ్చినా కూడా, వాటి ప్రభావం స్వల్పం. పైగా ఇంటర్నెట్, వర్క్ ఫ్రం హోం లాంటి పరిస్థితుల్లో ఏ పని ఎక్కడి నుంచైనా చేయించుకునే సౌలభ్యం వచ్చింది. ఆఫీసు కాస్తా నేరుగా పడకగదిలోకి దూరిపోయింది. దాంతో వృత్తి-కుటుంబాల మధ్య సమన్వయం గురించి రకరకాల సిద్ధాంతాలు మొదలయ్యాయి. వాటిలో కొన్ని బోర్డర్ థియరీ: కుటుంబం, ఆఫీసు, స్నేహితులు, చుట్టాలు మనిషి ఇలా వేర్వేరు సామాజిక వ్యవస్థలలో ఉంటాడు. వీటిమధ్య కదులుతుంటాడు. వీటిలో ఏ ఒక్క వ్యవస్థ తనను కట్టడి చేసినా, ఇతర వ్యవస్థల్లోకి చొచ్చుకుపోయినా సమస్య తప్పదు. బౌండరీ థియరీ: బోర్డర్ థియరీ పరిమితుల గురించి మాట్లాడితే బౌండరీ థియరీ పాత్రల గురించి చెబుతుంది. ఓ తండ్రిగా, భర్తగా, ఉద్యోగిగా, యజమానిగా, మిత్రుడిగా, బంధువుగా, వినియోగదారుడిగా వేర్వేరు పాత్రలలో ఉండే మనిషి వాటిమధ్య అయోమయానికి గురైతే బంధాలు బీటలువారతాయి. ఉదా? ఉద్యోగిగా వచ్చిన చిరాకును భర్తగా చూపించడం. కాంపెన్సేషన్ థియరీ: ఒక వ్యవస్థలో తనకు సంతృప్తి కలగకపోతే మరో వ్యవస్థలో దానికి పరిహారం పొందే ప్రయత్నం చేస్తామనే సిద్ధాంతమే ఇది. ఇంట్లో సమస్యలు ఉంటే ఆఫీసులో మరింతగా కష్టపడటం, బాస్ సరిగ్గా లేకపోతే బార్‌లో సేదతీరడం ఈ కోవలోకే వస్తాయి. ఇన్‌స్ట్రుమెంటల్ థియరీ: ఒక వ్యవస్థలో సంతోషం కోసం మరో వ్యవస్థలో మరింత తీవ్రంగా పనిచేస్తామని సూచించే సిద్ధాంతం ఇది. ఉదాహరణకు కుటుంబంతో కలిసి సెలవులకు వెళ్లేందుకు కొన్నాళ్లు ఆఫీసులో పడీపడీ పనిచేయవచ్చు. జీతం పెంచుతారనే ఆశతో ఇంటిని పట్టించుకోకపోవచ్చు. ఇవే కాదు స్పిల్ ఓవర్, సెగ్మెంటేషన్, ఫోర్ బర్నర్, ఫెసిలిటేషన్ వ్యక్తిగత-వృత్తిగత సమన్వయాల గురించి చాలా సిద్ధాంతాలే ప్రచారంలో ఉన్నాయి. ఇవన్నీ చెప్పే మాట ఒక్కటే! కారణం ఏదైనా పని, కుటుంబం రెండిటి మధ్య ఉండే విభజన రేఖ చెరిగిపోతే సమస్యలు తప్పవు. కానీ అలా జరిగిందని తెలుసుకునేదెలా? అందుకు పర్యవసానాలేంటి?

### ప్రమాద సూచికలు!

ఉద్యోగపు ఒత్తిడితో ముందు పాడయ్యేది ఆరోగ్యం. రక్తపోటు పెరగడం, కుంగుబాటు, సంతానలేమి, కూర్చుని కూర్చుని మధుమేహం లాంటి సమస్యలు రావడంతో పాటు చిన్నపాటి వైరస్‌ను ఎదుర్కోలేనంతగా రోగ నిరోధక శక్తి తగ్గిపోతుందని తేలింది. హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో జరిగిన ఓ పరిశోధనలో వారానికి 55 గంటలకు మించి పనిచేసేవారిలో గుండెపోటు వచ్చే అవకాశం 13 శాతం ఎక్కువగా ఉన్నట్టు గుర్తించారు. గాలప్ అనే సంస్థ కనీసం 74 శాతం మంది ఉద్యోగులు ఏదో ఒక సమయంలో తట్టుకోలేని ఒత్తిడిని అనుభవిస్తున్నారనీ, ఓ 23 శాతం అయితే ఏకంగా హాస్పిటల్‌లో చేరుతున్నారని తేల్చింది. ఎక్కువ పనిచేయడం వల్ల ఎక్కువ ఉత్పాదకత పెరగడం అనేది భ్రమే అంటున్నారు. విరామం లేకుండా పనిచేయడం వల్ల ‘బ్రెయిన్ ఫాగ్’ లాంటి సమస్యలతో ఏకాగ్రత లోపిస్తుంది. నిస్సత్తువ, తలనొప్పి, అయోమయం లాంటి ఇబ్బందులు తలెత్తుతాయి. ఒకప్పుడు దశాబ్దాల తరబడి ఒకే సంస్థలో ఉద్యోగాలు చేసేవారు. కానీ, ఇప్పుడా పరిస్థితి కనిపించడం లేదు. దీనికి ముఖ్య కారణం ఒత్తిడి అని పేర్కొంటున్నారు. ఈ విషయమై ‘క్రోనోస్’ అనే సంస్థ తలపెట్టిన అభిప్రాయ సేకరణలో 46 శాతం మంది మానవవనరుల అధికారులు ఉద్యోగులు మానేయడానికి ఒత్తిడే ముఖ్య కారణంగా పేర్కొన్నారు. ఈ పరిస్థితి దీర్ఘకాలికంగా అటు యాజమాన్యానికీ, ఇటు ఉద్యోగులకు కూడా నష్టమే కలిగిస్తుంది. గాలప్ సంస్థ చేసిన మరో సర్వేలో కేవలం 21 శాతం మందే తాము చేస్తున్న పనిని ఇష్టపడుతున్నట్టుగా చెప్పారు. మూడోవంతు మంది మాత్రమే వృత్తితోపాటు వ్యక్తిగత జీవితాన్ని సమన్వయం చేసుకోగలుగుతున్నట్టు ఒప్పుకొన్నారు. చాలామంది ఎక్కువ పని ఒత్తిడితో జీవితమంటేనే విరక్తి చెందుతున్నారు. ఆర్థిక సమస్యలు ఎదురైనా సరే, ఎంత విలువైన ఉద్యోగాన్నయినా సరే తృణప్రాయంగా వదిలేస్తున్నారు. క్వైట్ క్విటింగ్, గ్రేట్ రెజిగ్నేషన్ లాంటి ట్రెండ్స్ ఇందుకు అద్దం పడుతున్నాయి. పనికి మారుపేరుగా నిలిచే జపాన్‌లాంటి దేశాల్లోనే ఈ పరిస్థితి ఎక్కువగా కనిపిస్తున్నదంటే పనితో జనం ఎంతగా విసిగిపోయారో అర్థం చేసుకోవచ్చు.

### పరిష్కారాలు ఉన్నాయి!

అనుమానం లేదు. కుటుంబం, ఉద్యోగాల మధ్య వైరుధ్యం స్పష్టంగానే ఉంది. కానీ ఇదేమీ పరిష్కారం లేని సమస్య కాదు. పెద్దల దగ్గర నుంచి వ్యక్తిత్వ వికాస నిపుణుల వరకూ చాలామంది చెబుతున్న సూచనల్లో కొన్ని ముఖ్యమైనవి ఇవీ! ఆఫీసు కూడా కుటుంబంలాంటిదే అని చెప్పడం తేలికే. కానీ ఉద్యోగి తన అసలు కుటుంబానికి కూడా కాస్త సమయం కేటాయించేలా సంస్థలే వెసులుబాటు కల్పించాలి. కచ్చితమైన పనివేళలు, నైపుణ్యానికి తగిన పని, శ్రమకు తగిన గుర్తింపు ఇవేవీ అసాధ్యం కాదు. అవసరం కూడా! సంస్థకు ఏం కావాలి, ఉద్యోగి ఏం చేయాలనుకుంటున్నాడు అనే అంశాల మధ్య సమన్వయం సాధిస్తే పని తేలికైనట్టే! మానవవనరుల విభాగం అంటే కేవలం ఉద్యోగులను నియమించే, తొలగించే, సదుపాయాలు కల్పించే వ్యవస్థగానే ఇప్పటికీ ఉంది. అది యజమానికి అనుగుణంగానే పనిచేస్తుందనే అపప్రథ బలపడుతూనే వస్తున్నది. ఉద్యోగులతో వ్యక్తిగతంగా మాట్లాడటం, వారి ఇబ్బందులను తెలుసుకోవడం లాంటి చర్యలు ఉండాలి. అవసరమైతే ఒక మానసిక నిపుణుడు కూడా అందుబాటులో ఉండాలి. సెలవులను వాడుకోవడం ఓ హక్కు. చేస్తున్న పనికి ప్రతిఫలం. కుటుంబంతో గడిపేందుకు, సేదతీరేందుకు అవకాశం. అందుకే చాలా సంస్థలు సెలవులను పూర్తిగా వాడుకోమంటూ ప్రోత్సహిస్తున్నాయి. షిఫ్ట్ డ్యూటీలలో పనిచేసేవారికి ఈ వర్క్-లైఫ్ సమన్వయం మరింత గడ్డుగా మారుతుంది. వీరికి అమలుచేయాలని సూచిస్తున్నారు. వారంలో నాలుగు రోజులు ఎక్కువ గంటలు పనిచేసి, మిగతా మూడు రోజులు సెలవు తీసుకోవడం ఈ విధానానికి ఓ ఉదాహరణ. ఇంట్లో మొబైల్ ఫోన్ల వాడకం శ్రుతిమించడం వల్ల అందులో ఉండే ఆఫీసు పనుల మీద దృష్టి మళ్లుతుందనీ, అలాకాక కాలక్షేపం కోసం ఫోన్ చూసినా కుటుంబంతో గడిపే సమయం మీద ప్రభావం ఉంటుందని హెచ్చరిస్తున్నారు. భార్యాభర్తలు ఇద్దరూ ఇంటి పనిని పంచుకోవడం వల్ల ఆఫీసు ఒత్తిడిని మర్చిపోతారనీ, కుటుంబంతో బంధాన్ని పెంచుకుంటారనీ పరిశోధనలు చెబుతున్నాయి.

వృత్తి నైపుణ్యాలను పెంచుకోవడం వల్ల ఉద్యోగ భద్రత పెరుగుతుంది. తక్కువ పనివేళలతో ఎక్కువ ప్రభావాన్ని చూపగలుగుతారు. నచ్చిన సంస్థను ఎంపిక చేసుకోగలుగుతారు. ఆఫీసు రాజకీయాలతో పనిలేకుండా రాణించగలుగుతారు. అలాంటివారి వృత్తి-వ్యక్తిగత జీవితాల మధ్య సమన్వయం ఎక్కువగా ఉన్నట్టు తేలింది.

ఇవి కొన్ని సూచనలు మాత్రమే! సమస్య ఉందీ అని గుర్తించడమే కీలకం. అది స్పష్టమయ్యాక అటు యాజమాన్యాలు, ఇటు ఉద్యోగులు ఏదో ఒక పరిష్కారం కోసం ప్రయత్నించినప్పుడు సవాలక్ష మార్గాలు కనిపిస్తాయి. ఇంట్లో వ్యక్తులు కూడా తమ మధ్యే తిరుగుతూ మధనపడుతున్న ఆ వ్యక్తి బాధను గుర్తించే ప్రయత్నం చేయాలి. ‘ఏదో ఆఫీసు గొడవ అయి ఉంటుంది’ అని సరిపెట్టుకోకుండా తన బాధను తెలుసుకునే ప్రయత్నం చేయాలి. ఇంటికి వచ్చాక ఆఫీస్ మెయిల్స్ చూసుకోవడం, అవసరమైనప్పుడు వాటికి జవాబు ఇవ్వడం చాలా చిన్నవిషయంగా తోచవచ్చు. కానీ అలాంటి పనులు కూడా వ్యక్తిగత జీవితంలోకి చొరబాటే అంటున్నది వర్జీనియా టెక్ వెలువరించిన ఓ పరిశోధన పత్రం.

### సైన్స్ చెబుతున్న కబుర్లు

రోజూ కాసేపు వ్యాయామం చేయడం వల్ల మరింత ఆత్మవిశ్వాసంగా, చురుగ్గా పని చేయగలమనీ%ఔ% తద్వారా ఉద్యోగపు ప్రభావం వ్యక్తిగత జీవితం మీద ఉండదని ఓ 500 మంది మీద జరిగిన పరిశోధనలో తేలింది. వర్క్-లైఫ్ బ్యాలెన్స్ మనుషుల సమస్య మాత్రమే కాదట. పుట్టిన పిల్లల్నీ, వేటనీ చూసుకోవాల్సిన సింహాలుబీ పెద్ద గుంపు మధ్య ఉండే చీమలకు కూడా ఈ ఇబ్బంది ఉన్నదట. డెస్క్ పక్కన ఓ చిన్న మొక్క పెట్టుకోవడం లేదా పనిచేసేవారికి కనిపించేట్టుగా మొక్కలు ఉంచడం వల్ల పని ఒత్తిడి తగ్గి ఇంటికి దగ్గరగా ఉన్న భావన కలుగుతుందని జపాన్‌లోని హ్యోగో విశ్వవిద్యాలయంలో జరిగిన పరిశోధన చెబుతున్నది. పని ఒత్తిడి ఎక్కువగా ఉండేవారు తమ పిల్లల పోషక అవసరాలను సరిగా తీర్చలేకపోతున్నారని ‘టెంపుల్ యూనివర్సిటీ’ పరిశోధన నిరూపించింది. 3,700 మంది తల్లిదండ్రులను పరిశీలించాక తేల్చిన విషయమిది.

### నాణ్యత ముఖ్యం

వారానికి 70 లేదా 90 గంటలు పనిచేయాలన్న మాట పెద్ద చర్చకే దారితీసింది. ఈ సందర్భంగా కొందరు వ్యాపారవేత్తలు చెప్పిన అభిప్రాయాలు కూడా ఆసక్తికరంగానే ఉన్నాయి.

1 ఎంతసేపు పని చేశాం అన్నది కాదు ఎంత నాణ్యంగా పనిచేశామన్నదే ముఖ్యం. అయినా ఇంట్లో గడపకుండా, స్నేహితులతో మాట్లాడకుండా, పుస్తకాలు చదవకుండా, ఆలోచించడానికే సమయం ఇవ్వకుండా మనం సరైన నిర్ణయాలను ఎలా తీసుకోగలం? (ఆనంద్ మహీంద్ర %-% మహీంద్ర గ్రూప్ చైర్మన్)

2 మన దేశంలో పని సంస్కృతి మారాలి. పై స్థాయిలో వ్యక్తులు కేవలం కబుర్లతోనే ఆగిపోకూడదు. ఆ మాటకు వస్తే ఎక్కువ గంటలు పనిచేయాలనే సిద్ధాంతం వారితోనే మొదలైతే బాగుంటుంది. (రాహుల్ బజాజ్ బజాజ్ ఆటో మేనేజింగ్ డైరెక్టర్)

3 నేను వారానికి వంద గంటలు పనిచేసిన రోజులు కూడా ఉన్నాయి. దానివల్ల నా ఆరోగ్యం దెబ్బతిన్నది. ఒత్తిడితో ఏడ్చేదాన్ని. కానీ ఎంత ఎక్కువ పనిచేస్తే అంత ఉత్పాదకత అన్న భ్రమలు తొలగిపోయాయి. ఎంత తెలివిగా, సులువుగా పనిచేస్తామో అంత ఉత్పాదకత వస్తుంది. (రాధిక గుప్త %-% ఎడల్‌వెస్ మ్యూచ్యువల్ ఫండ్ సీఈఓ)

4 అతిగా పనిచేయడం విజయానికి కాదు, అనారోగ్యానికి దారితీస్తుంది. వ్యక్తిగత జీవితానికి ప్రాధాన్యం ఇవ్వడం అనేది ఓ ఎంపిక కాదు అవసరం. నా దృష్టిలో తెలివిగా పనిచేయడానికీ బానిసలా పనిచేయడానికీ తేడా ఉంది. (హర్ష్ గోయెంకా %-% ఆర్‌పీజీ గ్రూప్ చైర్మన్) పని ఒత్తిడి ఆధునిక జీవితం కోసం చేసిన త్యాగమో, కష్టపడటం వల్ల ఏర్పడే దుష్ప్రభావమో కాదు. దాన్ని ఓ సామాజిక సమస్యగా అందరూ గుర్తించినప్పుడే వ్యక్తికీ, తను చేసే పనికీ, తను భాగస్వామి అయిన సమాజానికి విలువ, సార్థకత!

# అది ఎవరు నిద్రాదేవి




‘పండుగ అని కూడా లేదు. ఎప్పుడూ నట్టింట్లో నిద్రపోవడమేనా?’ మిట్ట మధ్యాహ్నం సోఫాలో పడుకున్న నిశితతో కోపంగా అన్నాడు మిథేశ్. ‘నిద్రాదేవి రమ్మన్నప్పుడు రాదు. వచ్చినప్పుడే పడుకోవాలి’ అని కసిరింది నిశిత. ‘ఈ మధ్య నీ వ్యవహారం ఏమీ బాలేదు’ కరుగ్గా అన్నాడు మిథేశ్. ‘నేనేం చేశా?’ విసుగ్గా అంది నిశిత. ‘సాయంత్రం మీ అమ్మవాళ్ల ఇంటికి వెళ్లి.. అక్కడే దీనిపై మాట్లాడదాం’ అంటూ రూమ్‌లోకి వెళ్లి డోర్ వేసుకొన్నాడు మిథేశ్. గంట గడిచింది మిథేశ్ గదిలోంచి వణుకుతూ బయటికి వచ్చిన వంట మనిషి రాము మెట్లు దిగుతూ.. ‘అమ్మగారూ.. మన మిథేశ్ బాబును ఎవరో చంపేశారు’ అంటూ కేకేశాడు. దీంతో మిగతా ఇద్దరు పనివాళ్లు పరుగెత్తుకొచ్చారు. రాము అరుపులకు వెంటనే నిద్ర మేల్కొన్న నిశిత.. గదిలోకి పరిగెత్తింది. రక్తపు మడుగులో మిథేశ్ పడి ఉన్నాడు. అది చూసి హతాశురాలైంది నిశిత. అరగంటలో క్రైమ్ స్పాట్‌కు రుద్ర అండ్ టీమ్ చేరుకున్నారు. ఏం జరిగిందంటూ అందర్నీ ప్రశ్నించడం మొదలుపెట్టారు. ‘ఇంట్లో మొత్తం ఎంతమంది?’ నిశితను ప్రశ్నించాడు రుద్ర. ‘మిథేశ్, నేను ఇంకో ముగ్గురు పనివాళ్లు’ సమాధానం ఇచ్చింది. ‘ఇద్దరికి ముగ్గురు పనివాళ్లా?’ ఆశ్చర్యపోయాడు హెడ్‌కానిస్టేబుల్ రామస్వామి. ‘మా ఇల్లు చాలా పెద్దది సార్. ఇద్దరం ఉద్యోగులమే! ఇంటిని చక్కబెట్టేవాళ్లు, వంట చేసేవాళ్లు.. ఇలా ఉండాలిగా’ బదులిచ్చింది నిశిత. ‘ముందుగా హత్యను ఎవరు చూశారు?’ అడిగాడు రుద్ర. రాము వైపు చేయి చూపించింది నిశిత. ‘నీ పేరేంటి?’ ప్రశ్నించాడు రుద్ర. ‘రాము సార్!’ అన్నాడు.. ‘ఏం చేస్తావ్?’ మళ్లీ ప్రశ్నించాడు రుద్ర. ‘వంటవాణ్ని సార్’ అన్నాడు. ‘హత్య జరిగిన సమయంలో ఏం చేస్తున్నావ్?’ అని ప్రశ్నించాడు. ‘సార్‌కు బ్రేక్‌ఫాస్ట్ రెడీ చేసి గదిలోకి తీసుకెళ్లా సార్.. ఇంతలో ఆయన రక్తపు మడుగులో ఉండటం చూసి భయపడిపోయా. వెంటనే కిందికి వచ్చి అమ్మగారికి చెప్పా’ వణికిపోతూనే చెబుతూ ఒక్కసారిగా స్పృహకోల్పోయాడు రాము. వెంటనే అతణ్ని పక్కకు తీసుకెళ్లిన సిబ్బంది.. కాస్త మజ్జిగ అందించారు. మిథేశ్ సిటీలో ఓ పాపులర్ ఆంత్రప్రెన్యూర్ కావడంతో హత్య విషయం దుమారం రేపింది. మిథేశ్ ఇంటి చుట్టూ మీడియా ప్రతినిధులు గుమిగూడారు. అక్కడ అంతా గందరగోళంగా ఉంది. ఇదే సమయంలో అక్కడే ఉన్న పనివాళ్లు రుద్ర దగ్గరికి వచ్చారు. ‘సార్.. మేం ఇంటికి వెళ్తాం’ అన్నారు. ‘ఎందుకు.. అంత అర్జెంట్??’ ప్రశ్నించాడు రుద్ర. ఇద్దరూ మిన్నకుండిపోయారు. ఇంటికి వెళ్తామన్న ఇద్దరు పనివాళ్లు దంపతులు. భర్త సుబ్బయ్య తోటమాలిగా పనిచేస్తే.. భార్య శాంతమ్మ ఇంటిని చక్కబెడుతుంది. ‘మేడమ్.. మీ భర్త హత్య జరిగిన సమయం సుమారు ఒంటిగంట. అప్పుడు మీరు ఏం చేస్తున్నారు?’ నిశితను అడిగాడు రుద్ర. ‘మధ్యాహ్నం నాకు నిద్రపోవడం అలవాటు. దీంతో నేను హాల్‌లో పడుకొన్నాను. మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఇంటికొచ్చిన మిథేశ్.. నాతో ఇదే విషయమై చిన్న గొడవపడ్డాడు. తర్వాత రూమ్‌లోకి వెళ్లి తలుపు వేసుకొన్నాడు. ఇలాంటి గొడవలు మాకు ఎప్పుడూ ఉండేవే. దీంతో నేనూ పడుకొన్నాను. గంట-గంటన్నర తర్వాత రాము పరుగెత్తుకొంటూ వచ్చి నన్ను నిద్రలేపాడు. అయ్యగారు చనిపోయారంటూ బోరుమన్నాడ’ని చెప్పూపోయింది నిశిత. ‘మీకు ఎవరైనా శత్రువులు ఉన్నారా?’ అని రుద్ర అడిగిన ప్రశ్నకు లేరంటూ తలూపింది నిశిత. ‘పనివాళ్లు ఎంతకాలంగా ఇక్కడ పనిచేస్తున్నారు?’ అడిగాడు. సుమారు ఐదేండ్లుగా అంటూ బదులిచ్చింది. వాళ్లను కూడా ఇంటరాగేషన్ చేయడానికి రుద్ర వెళ్తుండగా.. ‘సార్.. వాళ్ల మీద నాకు ఎలాంటి అనుమానం లేదు. ఎందుకంటే ఒంటిగంట సమయంలో శాంతమ్మ స్టోర్ రూమ్‌లో పాత సామాను సర్దుతున్నది. సుబ్బయ్య మొక్కల పని చూస్తున్నాడు’ చెప్పింది నిశిత. ‘మరి.. రాము?’ సూటిగా ప్రశ్నించాడు రుద్ర. ‘వాడు.. వంట వండుతున్నాడు’ బదులిచ్చింది. నిశిత చెప్పింది నిజమేనన్నట్టు పనివాళ్లు ఇద్దరు తలూపారు. ఇంతలో రాముకు మెలకువ వచ్చింది. హత్య జరిగిన సమయంలో ఏం చేస్తున్నావంటూ అప్పుడే లేచిన రామును రుద్ర ప్రశ్నించాడు. వంట చేస్తున్నట్టు బదులిచ్చాడు. గదిలో ఎలాంటి క్లూస్ దొరకలేదని ఫోరెన్సిక్ టీమ్ చెప్పింది. ‘సార్.. ఇది హై ప్రొఫైల్ కేసు. త్వరగా సాల్వ్ చేయాలి’ అంటూ రామస్వామి అంటుండగానే.. ‘ఇది హైప్రొఫైల్ కేసు.. నిజమే బాబాయ్.. అయితే, లో ఐక్యూతో నేరస్తులు ఇంత త్వరగా దొరుకుతారని అనుకోలేదు’ అంటూ రుద్ర నవ్వాడు. ఏమీ అర్థం కాలేదన్నట్టు రామస్వామి విస్తుపోయాడు. ఇంతలో లేడీ కానిస్టేబుల్ నిశితను తమదైన శైలితో విచారించడంతో అసలు విషయాన్ని మొత్తం చెప్పేసింది. అంతకుముందే రాముకు కూడా ఇదే ట్రీట్‌మెంట్ ఇవ్వడంతో.. నిశిత, తాను కలిసే మిథేశ్‌ను హత్య చేసినట్టు ఒప్పేసుకొన్నాడు. ఇంతకీ, మిథేశ్‌ను నిశిత-రాము కలిసి హత్య చేశారని రుద్ర ఎలా కనిపెట్టినట్టు?

### అది ఎవరు?

మిథేశ్ హత్య జరిగిన సమయం మధ్యాహ్నం ఒంటిగంట. ఆ సమయంలో ఎవరైనా లంచ్ చేస్తారు. అయితే, మిథేశ్‌కు బ్రేక్‌ఫాస్ట్ ఇవ్వడానికి వెళ్లానని రాము అబద్ధం చెప్పి రుద్రకు అనుమానం కలిగించాడు. మరోవైపు, మిథేశ్ హత్య జరిగిన సమయంలో తాను పడుకొన్నానని, రాము వచ్చి పిలిస్తేనే తనకు మెలకువ వచ్చిందన్న నిశిత.. హత్య సమయంలో పనిమనుషులు ఎవరేం చేస్తున్నారో కరెక్ట్‌గా చెప్పింది. అంటే, ఆమె నిద్రపోవడం అబద్ధమని తేలింది. కాగా, భార్య-భర్తలైన పనివాళ్లు సుబ్బయ్యకు, శాంతమ్మకు అనుమానం రాకుండా రాము, నిశిత కలిసే ఈ హత్య చేశారని, రాముతో తనకున్న అక్రమ సంబంధాన్ని కనిపెట్టిన మిథేశ్ ఎక్కడ దాన్ని బయటపెడతాడోనన్న భయంతో నిశిత ఈ ఘాతుకానికి ఒడిగట్టినట్టు విచారణలో తేలింది.

## ఈ రెండు ఇన్ఫెక్షన్లు క్యాన్సర్‌కు ప్రధాన కారణం కావచ్చు



క్యాన్సర్ ఒక ప్రమాదకరమైన, తీవ్రమైన వ్యాధి, ఇది శరీరంలోని ఏ భాగంలోనైనా సంభవించవచ్చు. దీనికి సకాలంలో చికిత్స చేయకపోతే, అది మరణానికి కూడా దారితీయవచ్చు. దీని కారణంగా, రోగులు ప్రాణాలు కూడా కోల్పోవచ్చు. అటువంటి ప్రమాదాలను తగ్గించడానికి, మీరు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలి. క్యాన్సర్ మొదటి దశలో ఉన్నప్పుడు, దాని ప్రారంభ పరీక్షల ద్వారా వ్యాధిని గుర్తించవచ్చు. ఈ రోజు మనం క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచే అటువంటి ఇన్ఫెక్షన్ల గురించి తెలుసుకుందాం..

### హెపటైటిస్ బి, సి వైరస్లు

హెపటైటిస్ బి, సి వైరస్‌లు కాలేయ క్యాన్సర్‌కు కారణమయ్యే దీర్ఘకాలిక ఇన్ఫెక్షన్‌లు. ఈ వైరస్‌లు రక్తం, లైంగిక సంబంధం ద్వారా లేదా తల్లి నుండి బిడ్డకు వ్యాపిస్తాయి. హెపటైటిస్ నివారించడానికి మొదటి క్యాన్సర్ వ్యాక్సిన్ 1985 లో ప్రవేశపెట్టారు. హ్యూమన్ పాపిల్లోమావైరస్ ఈ వైరస్ గర్భాశయ క్యాన్సర్‌తో ముడిపడి ఉంది. ఈ బ్యాక్టీరియా కడుపు క్యాన్సర్ ప్రమాదాన్ని పెంచుతుంది.

### గర్భాశయ సంక్రమణ

గర్భాశయ ఇన్ఫెక్షన్ విషయంలో సరైన చికిత్స చాలా ముఖ్యం. ఇది వేగంగా కోలుకోవడానికి సహాయపడుతుంది. ఇది తీవ్రమైన రూపాన్ని తీసుకోకుండా సమయానికి ఆపడం చాలా ముఖ్యం. గర్భాశయ సంక్రమణకు సకాలంలో చికిత్స చేయకపోతే, మహిళలు సంతానోత్పత్తి సంబంధిత సమస్యలను ఎదుర్కొంటారు. గర్భాశయ ఇన్ఫెక్షన్ కారణంగా క్యాన్సర్ వచ్చే ప్రమాదం గణనీయంగా పెరుగుతుంది. గర్భాశయ ఇన్ఫెక్షన్ కారణంగా గర్భాశయ క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉంది.

### మానవ పాపిల్లోమావైరస్

హ్యూమన్ పాపిల్లోమా వైరస్ అనేది ఒక రకమైన ఇన్ఫెక్షన్, ఇది తరచుగా లైంగిక సంపర్కం ద్వారా వ్యాపిస్తుంది. వైరస్ కణాలలో మార్పులకు కారణమవుతుంది. దీనివల్ల ఈ క్యాన్సర్ కణాలు అదుపు లేకుండా పెరుగుతాయి. ఒక వ్యక్తి శరీరంలో రోగనిరోధక శక్తి బలహీనమైనప్పుడు ఇది జరుగుతుంది. ఆపై శరీరం ఇకపై వైరస్‌తో పోరాడలేకపోతుంది. ఇంటర్నెట్‌లో సేకరించిన సమాచారం ఆధారంగా ఈ వివరాలు మీకు అందించటం జరిగింది. ఇందులోని అంశాలు కేవలం అవగాహన కోసం మాత్రమే. తదుపరి జరిగే ఎలాంటి పరిణామాలకు ఆంధ్రజ్యోతి బాధ్యత వహించదు.)

తెలంగాణ సేన
TELANGANA SENA TELUGU DAILY
ఆదివారం 16 - 03 - 2025

## విపణిలోకి స్కోడా కైలాక్ ఎస్‌యూవీ

ప్రారంభ ధర రూ.7.89 లక్షలు



ఎస్‌యూవీ సెగ్మెంట్‌ను మరింత బలోపేతం చేసే ఉద్దేశంలో భాగంగా స్కోడా..కైలాక్ మాడల్‌ను దేశీయ మార్కెట్లోకి అందుబాటులోకి తీసుకొచ్చింది. ఎస్‌యూవీ సెగ్మెంట్‌లో పోటీని మరింత తీవ్రతరం చేయాలనే ఉద్దేశంతో ప్రవేశపెట్టిన ఈ కారు ప్రారంభ ధర రూ.7.89 లక్షలుగా నిర్ణయించింది. 1.0 టీఎస్ఐ ఇంజిన్‌తో తయారైన ఈ కారు లీటర్ పెట్రోల్‌కు 19.68 కిలోమీటర్ల మైలేజీ ఇవ్వనున్నది. క్లాసిక్, సిగ్నిచర్, సిగ్నిచరం, ప్రిస్టేజ్ వంటి నాలుగు రకాల్లో లభించనున్న ఈ కారుకు 5 స్టార్ రేటింగ్, ఆరు ఎయిర్‌బ్యాగ్‌లు, 25 బలమైన భద్రత ఫీచర్లు ఉన్నాయని స్కోడా ఆటో ఇండియా బ్రాండ్ డైరెక్టర్ పెట్రా జనేబా తెలిపారు. కేవలం 10.5 సెకండ్లలో 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకోనున్న ఈ కారు గంటకు 188 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. ఈ కారుపై మూడేండ్లు లేదా లక్ష కిలోమీటర్ల వ్యారెంటీ సదుపాయాన్ని కల్పిస్తున్నది.

## ట్రంప్ ఎఫెక్ట్.. దేశీయ స్టాక్ మార్కెట్లు క్రాష్



దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం భారీగా నష్టపోయాయి. అమెరికా నూతన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. మళ్లీ పరస్పర సుంకాల సమరానికి కాలుదువ్వుతున్నట్టు సంకేతాలు రావడంతో మదుపరులు ఒక్కసారిగా భయాందోళనకు లోనయ్యారు. ఈ క్రమంలోనే అమ్మకాల ఒత్తిడిలోకి జారుకోగా.. అటు బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ సెన్సెక్స్, ఇటు నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ రెండూ పెద్ద ఎత్తున క్షీణించాయి. సెన్సెక్స్ 824.29 పాయింట్లు లేదా 1.08 శాతం కోల్పోయి 76వేల స్థాయికి కింద 75,366.17 వద్ద ముగియగా, నిఫ్టీ 263.05 పాయింట్లు లేదా 1.14 శాతం పడిపోయి 23వేల స్థాయికి దిగువన 22,829.15 వద్ద స్థిరపడింది. దీంతో గత ఏడాది జూన్ నుంచి ఈ స్థాయిల్లోకి సూచీలు క్షీణించడం ఇదే తొలిసారైనెట్టైంది. ఒకానొక దశలోనైతే సెన్సెక్స్ 922.87, నిఫ్టీ 305.30 పాయింట్లు పతనమయ్యాయి.

**9.28 లక్షల కోట్ల సంపద ఆవిరి...**

ఈ ఒక్కరోజే బీఎస్ఈ నమోదిత సంస్థల మార్కెట్ విలువ రూ.9,28,229.09 కోట్లు హరించుకుపోయింది. చివరకు రూ.4,10,23,624.90 కోట్ల వద్ద ఆగింది. బీఎస్ఈ స్మాల్‌క్యాప్ 3.51 శాతం, మిడ్‌క్యాప్ 2.68 శాతం మేర నష్టపోయాయి. ఐటీ, టెక్నాలజీ, మెటల్, హెల్త్‌కేర్, ఇండస్ట్రియల్స్, చమురు-గ్యాస్ షేర్లు 3.31 శాతం నుంచి 2.41 శాతం వరకు నష్టపోయాయి. ఇదిలా ఉంటే ఈ ఏడాది మొదలు బీఎస్ఈలో ఇన్వెస్టర్ల సంపద 32 లక్షల కోట్లకుపైగా కరిగిపోయింది.

## హట్సన్ జహీరాబాద్ ప్లాంట్ విస్తరణ




అరుణ్ ఐస్‌క్రీం పేరుతో ఐస్‌క్రీం ఉత్పత్తులను విక్రయిస్తున్న హ్యాట్సన్ ఆగ్రో ప్రొడక్ట్ లిమిటెడ్.. జహీరాబాద్ ప్లాంట్ సామర్థ్యాన్ని భారీగా పెంచుకున్నది. గతంలో రోజుకు లక్ష కిలోల ఐస్‌క్రీంలను ఉత్పత్తి అవుతున్న ఈ ప్లాంట్ సామర్థ్యాన్ని 1.27 లక్షల కిలోలకు పెంచుకున్నట్లు కంపెనీ చైర్మన్ ఆర్‌జీ చంద్రమోగన్ తెలిపారు. దీంతో ఈ యూనిట్ దేశంలో అతిపెద్ద ఐస్‌క్రీం యూనిట్ కావడం విశేషమన్నారు. దీంతో గ్రూపు టర్నోవర్ బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని ఆశిస్తున్నట్లు చెప్పారు. అలాగే హైదరాబాద్‌లోని సూరారం వద్ద రోజుకు 2.8లక్షల లీటర్ల పాలను కలుపుకొని 20 ప్లాంట్లలో రోజుకు 32 లక్షల లీటర్ల పాలను సేకరిస్తున్నదని చెప్పారు.

## కెనరా బ్యాంక్ లాభం 4,104 కోట్లు



ప్రభుత్వరంగ ఆర్థిక సేవల సంస్థ కెనరా బ్యాంక్ ఆకర్షణీయమైన ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికిగాను బ్యాంక్ రూ.4,104 కోట్ల స్టాండలోన్ నికర లాభాన్ని గడించింది. ఆదాయం పుంజుకోవడం, నిరర్థక ఆస్తులు తగ్గిపోవడంతో అంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో వచ్చిన రూ.3,656 కోట్ల లాభంతో పోలిస్తే 12.25 శాతం పెరుగుదల నమోదైందని వెల్లడించింది. బ్యాంక్ ఆదాయం కూడా రూ.32,334 కోట్ల నుంచి రూ.36,114 కోట్లకు ఎగబాకినట్లు బీఎస్ఈకి సమాచారం అందించింది. స్థూల నిరర్థక ఆస్తుల విలువ 4.39 శాతం నుంచి 3.34 శాతానికి దిగొచ్చాయని, అలాగే నికర నిరర్థక ఆస్తుల విలువ కూడా 0.99 శాతం నుంచి 0.89 శాతానికి తగ్గినట్టు బ్యాంక్ ఎండీ, సీఈవో కే సత్యనారాయణ రాజు తెలిపారు.

**బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం ఏడాది ప్రాతిపదికన 2.85 శాతం తగ్గి రూ.9,149 కోట్లకు పరిమితమైంది.**

**బ్యాంక్ గ్లోబల్ డిపాజిట్లు 8 శాతం పెరిగి రూ.13.69 లక్షల కోట్లకు చేరుకోగా, గ్లోబల్ అడ్వాన్స్‌లు 10 శాతం అధికమై రూ.10.49 లక్షల కోట్లకు చేరాయి. మొత్తం బ్యాంక్ గ్లోబల్ బిజినెస్ రూ.24.19 లక్షల కోట్లుగా నమోదయ్యాయి.**

# చైనీస్ డీప్‌సీక్ యాప్ సంచలనం

# అమెరికా కంపెనీలకు ట్రంప్ వార్నింగ్




న్యూయార్క్: డీప్‌సీక్ యాప్.. అమెరికాలో సంచలనం సృష్టిస్తోంది. చైనాకు చెందిన ఆ కొత్త తరహా ఏఐ యాప్.. వారం క్రితమే మార్కెట్లోకి రిలీజైంది. కానీ ఆ యాప్ అమెరికా మార్కెట్‌తో పాటు ప్రపంచదేశాల్లో మార్కెట్లను షేక్ చేస్తున్నది. డీప్‌సీక్ టెక్నాలజీ.. అమెరికా టెక్నాలజీ పరిశ్రమకు మేల్కొలుపులాంటిదని దేశాధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ తెలిపారు. లేజర్ ఫోకస్‌తో కాంపిటీషన్‌పై దృష్టి పెట్టి విజయం సాధించాలని ట్రంప్ పేర్కొన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కు చెందిన డీప్‌సీక్ యాప్ తన ప్రత్యర్థులను వెనక్కి నెట్టేసింది. చాట్‌జీపీటీని కూడా డీప్‌సీక్ యాప్ వెనక్కి నెట్టేసింది. అమెరికాలో అత్యధిక సంఖ్యలో ఫ్రీగా డౌన్‌లోడ్ చేసిన యాప్‌గా డీప్‌సీక్ నిలిచింది. డీప్‌సీక్ టెక్నాలజీతో.. అమెరికా ఏఐ ఇండస్ట్రీ ఆందోళనకు గురయ్యే అవకాశాలు ఉన్నాయి. తక్కువ ఖర్చుతో తయారైన డీప్‌సీక్ ఏఐ యాప్‌తో.. అమెరికా స్టాక్‌మార్కెట్‌లో ప్రకంపనలు వచ్చాయి. వాల్‌స్ట్రీట్ వణికిపోయింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో మేటిగా భావించిన ఎన్విడియా కంపెనీ షేర్లు దారుణంగా పడిపోయాయి. ఒక్కసారిగా ఆ కంపెనీ 500 బిలియన్ల డాలర్లు కోల్పోయింది. అనేక టెక్నాలజీ కంపెనీల షేర్లు కూడా సోమవారం ట్రేడింగ్‌లో పతనం అయ్యాయి. అయితే ఆ రోజునే తమపై సైబర్ దాడి జరిగినట్లు డీప్‌సీక్ కంపెనీ వెల్లడించింది. తన లేటెస్ట్ మోడల్‌పై డీపీసీక్ ఓ రిపోర్టు రిలీజ్ చేసింది. జానుస్-ప్రో-7బీ మోడల్ .. ఇమేజ్ జనరేషన్‌లో అత్యద్భుతంగా పనిచేస్తుందని పేర్కొన్నది. ప్రత్యర్థులు ఓపెన్‌ఏఐ, స్టెబిలిటీ ఏఐ కన్నా మెరుగ్గా జానుస్ మోడల్ ఉందని డీప్‌సీక్ తెలిపింది. డీప్‌సీక్‌కు చెందిన చాట్‌బాట్ యాప్‌ను జనవరి నెలలో డౌన్‌లోడ్ చేసుకున్న వారి సంఖ్య ఎక్కువగా ఉన్నట్లు నిపుణులు చెబుతున్నారు. మరోవైపు వాట్ ఈజ్ డీప్‌సీక్ అని ఇంటర్నెట్‌లో జోరుగా సెర్చ్ జరుగుతోంది. కోట్లాది సంఖ్యలో నెట్ యూజర్లు ఆ యాప్ గురించి అన్వేషిస్తున్నారు. డీప్‌సీక్ హ్యాష్‌ట్యాగ్ ట్రెండ్ అవుతోంది. చైనాకు చెందిన టిక్‌టాక్ యాప్ తర్వాత మళ్లీ.. డీప్‌సీక్ గురించి ఎక్కువగా చర్చిస్తున్నారు. ప్రస్తుతం చైనాలో కొత్త సంవత్సర వేడుకలు సాగుతున్నాయి. చైనీస్ సోషల్ మీడియాలో ఏఐ, డీప్‌సీక్.. ట్రెండింగ్ టాపిక్‌గా నడుస్తోంది. కొత్త ఇయర్‌కు డీపీసీక్ పెద్ద గిఫ్ట్ అని చైనీయులు భావిస్తున్నారు. ఇప్పటికే అమెరికాలో పాపులర్ అయిన టిక్‌టాక్‌ను మైక్రోసాఫ్ట్ సంస్థ కొనుగోలు చేసే అవకాశాలు ఉన్నట్లు ట్రంప్ తెలిపారు.

# బీమాకు పన్ను సుస్తీ.. ఈసారి

# బడ్జెట్‌లోనైనా ఊరట లభించేనా?

### ఆరోగ్య బీమా, ఔషధాలపై పన్నుల భారం తగ్గించాలన్న డిమాండ్లు




ఆరోగ్య సంరక్షణ, ఔషధ రంగాలు ఈసారి బడ్జెట్‌పై భారీ అంచనాల్నే పెట్టుకున్నాయి. సగటు మనిషి సైతం ఖరీదెక్కిన వైద్య చికిత్సల నుంచి ఉపశమనాన్ని ఆశిస్తున్నాడు. ఈ క్రమంలోనే రాబోయే బడ్జెట్‌లో ఔషధాలపై పన్నులను తగ్గించాలని, ఆరోగ్య బీమాపై వస్తు, సేవల పన్ను (జీఎస్టీ)కు సంబంధించి పడుతున్న భారాన్ని కట్టడి చేయాలన్న డిమాండ్లు గట్టిగా వినిపిస్తున్నాయి. దేశంలో ఇప్పటికీ చాలామందికి ఆరోగ్య బీమా లేదన్న విషయాన్ని ఇన్సూరెన్స్ ఇండస్ట్రీ కూడా గుర్తుచేస్తున్నది. పన్నులకు కోత పెడితే అందరికీ సులువుగా బీమా ప్రయోజనాలు అందుతాయంటున్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2025-26)గాను ఫిబ్రవరి 1న పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్‌ను ప్రవేశ పెట్టబోతున్నారు. నిర్మలా సీతారామన్‌కు ఇది ఎనిమిదో బడ్జెట్ కానుండగా, వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చిన మోదీ సర్కారుకు రెండోది. అయితే గత ఏడాది ఎన్నికల నేపథ్యంలో ఈ దఫాకు ఇదే తొలి పూర్తిస్థాయి బడ్జెట్ కానున్నది.

**ప్రోత్సాహకాలివ్వాలి...**

ప్రజారోగ్య సదుపాయాలకు బడ్జెట్‌లో నిధుల కేటాయింపు, ప్రైవేట్ రంగానికి ఇతర ప్రోత్సాహకాలను అందిస్తే సామాన్యులకు నాణ్యమైన ఆరోగ్య సేవలు దక్కుతాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఆరో గ్య సంరక్షణ సేవలపై ఇన్‌పుట్ జీఎస్టీని తగ్గించాలంటున్నారు. ప్రీమియంలతో పోల్చితే వాటి క్లెయింల విలువ ఎక్కువని, కాబట్టి బీమా ఇండస్ట్రీకి ప్రోత్సాహకాలు లభిస్తే బాగుంటుందని చెప్తున్నారు.



**సెక్షన్ 80డీ...**

ఐటీ చట్టంలోని సెక్షన్ 80డీ కింద ప్రస్తుతం వ్యక్తిగత కుటుంబ ఆరోగ్య బీమా కొనుగోలుపై 25,000 వరకు పన్ను మినహాయింపును కోరవచ్చు. ఒకవేళ ట్యాక్స్‌పేయర్ వయసు 60 ఏండ్లు దాటితే ఇది రూ.50,000గా ఉన్నది. అలాగే తల్లిదండ్రుల కోసం తీసుకునే ఆరోగ్య బీమాకూ మరో రూ.25,000 వరకు పన్ను మినహాయింపును అందుకోవచ్చు. వారి వయసు 60 ఏండ్లు దాటితే ఈ ప్రయోజనం రూ.50,000. మొత్తంగా ఆరోగ్య బీమాలకు ఏటా చేసే చెల్లింపుల్లో గరిష్ఠంగా లక్ష రూపాయలదాకా పన్ను మినహాయింపులు తీసుకోవచ్చు. అయితే ద్రవ్యోల్బణం దృష్ట్యా ఎక్కువ ప్రయోజనాలున్న సమగ్ర పాలసీలనే ఇప్పుడు తీసుకోవాల్సి వస్తున్నది. వాటి ప్రీమియంలూ ఎక్కువే. అందుకే ఈసారి బడ్జెట్‌లో ఈ పన్ను మినహాయింపులను ఇంకా పెంచాలన్న డిమాండ్లు పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి. కాగా, సెక్షన్ 80డీడీ కింద ట్యాక్స్‌పేయర్స్ తమపై ఆధారపడిన దివ్యాంగుల వైద్య చికిత్సకు చేసే చెల్లింపులకుగాను ఏటా రూ.1.25 లక్షలదాకా పన్ను మినహాయింపును అందుకోవచ్చు. వ్యక్తిగత వైద్య చికిత్స ఖర్చులకూ సెక్షన్ 80డీడీబీ కింద లక్ష రూపాయల వరకు క్లెయిం చేసుకోవచ్చు.

**ఎస్బీఐ నివేదిక..**

ఇక టర్మ్, హెల్త్ ఇన్సూరెన్స్ ప్రీమియంలపై జీఎస్టీ, పన్నుల మినహాయింపును ప్రభుత్వం పరిశీలిస్తున్నదని ఎస్బీఐ రిసెర్చ్ చెప్తున్నది. వైద్య పరికరాలపై జీఎస్టీ రేట్లు 5, 12 శాతం మించకుండా నిర్ణయం రావచ్చని తెలుస్తున్నది. ప్రస్తుతం 18 శాతం పడుతున్నది. కాగా, 'టర్మ్/పూర్తి జీవిత బీమా, ఆరోగ్య బీమా ప్రీమియంలపై జీఎస్టీ లేదా ఎలాంటి పన్నులు ఉండరాదు' అని ఎస్బీఐ తమ రిపోర్ట్‌లో పేర్కొన్నది. ఎన్‌పీఎస్‌కు వీలుగా పాత/కొత్త పన్ను విధానాల్లో జీవిత, ఆరోగ్య బీమా కోసం ప్రత్యేకంగా పన్ను మినహాయింపు రూ.25,000, 50,000 ఉండాలంటున్నది. ఇదే క్రమంలో ఏపీవై, పీఎం-ఎస్‌వైఎం, పీఎం-కేఎంవై, ఎన్‌పీఎస్-ట్రేడర్లు వంటి అన్ని ప్రభుత్వ స్పాన్సర్డ్ పెన్షన్ స్కీములను ఒకే గొడుగు కిందకు తీసుకురావచ్చన్న అంచనాలు కూడా ఉన్నాయి.

**పాత పన్ను విధానానికి స్వస్తి?**

ప్రస్తుతం ఆదాయ పన్ను చెల్లింపుదారులకు పాత, కొత్త పన్ను విధానాలు అందుబాటులో ఉన్న విషయం తెలిసిందే. ఐదేండ్ల కిందట కొత్త పన్ను విధానాన్ని పరిచయం చేసిన కేంద్ర ప్రభుత్వం.. ఏటా దాన్ని మరింత ఆకర్షణీయంగా మారుస్తూ రకరకాల ప్రోత్సాహకాలు, మినహాయింపుల్ని ఇస్తున్న సంగతీ విదితమే. ఈ క్రమంలో పాత పన్ను విధానాన్ని పూర్తిగా పట్టించుకోవట్లేదన్నా అతిశయోక్తి కాదు. ఈ నేపథ్యంలో ఈసారి బడ్జెట్‌లో పాత పన్ను విధానానికి స్వస్తి పలుకనున్నారన్న అంచనాలున్నాయి. దీనివల్ల ఇకపై ఒకే పన్ను విధానం ఉండనున్నది. ఆయా సెక్షన్ల కింద వివిధ రకాల పెట్టుబడులు, పొదుపు, ఖర్చులపై ట్యాక్స్‌పేయర్స్ పాత పన్ను విధానంలో పన్ను మినహాయింపుల్ని క్లెయిం చేసుకోవచ్చు. కానీ కొత్త పన్ను విధానంలో ఇవేవీ ఉండవు. వార్షిక ఆదాయం నిర్ణీత పరిమితి దాటిందంటే ఏ మినహాయింపులకు తావు లేకుండా అందరికీ ఆయా శ్లాబుల ప్రకారం పన్నులు వర్తిస్తాయి. మరోవైపు పాత పన్ను విధానాన్ని ఒకేసారి ఎత్తేయకుండా, రెండేండ్ల తర్వాత రైద్దె పోతుందన్న నిర్ణయాన్ని ఈసారి బడ్జెట్‌లో ప్రకటించవచ్చన్న అభిప్రాయాలు కూడా ఉన్నాయి. ఏదిఏమైనా పాత పన్ను విధానాన్ని తొలగిస్తే మదుపు, పొదుపులకు పెద్దగా ఎవరూ ఆసక్తి కనబర్చకపోవచ్చన్న వాదనలు వస్తుండటం గమనార్హం. ముఖ్యంగా మధ్యతరగతి ఉద్యోగులకు నష్టమేనంటున్నారు. ఇక ట్యాక్స్‌పేయర్స్ ఐటీఆర్‌లను దాఖలు చేసేటప్పుడు కొత్త పన్ను విధానమే డీఫాల్ట్‌గా సెలక్ట్ ఉంటుంది. దీన్ని గుర్తించి పాత పన్ను విధానాన్ని ట్యాక్స్‌పేయర్సే ఎంచుకోవాలి. లేదంటే ఐటీ రిటర్నులు కొత్త పన్ను విధానంలోనే ఫైలింగ్ జరిగిపోతాయి.

## ఏఐ పవర్డ్ ఫీచర్లతో లావా యువ స్మార్ట్.. రూ.6000లకే లభ్యం




ప్రముఖ స్మార్ట్ ఫోన్ల తయారీ సంస్థ లావా ఇంటర్నేషనల్ భారత్ మార్కెట్లో సోమవారం లావా యువ స్మార్ట్ ఫోన్ ఆవిష్కరించింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) మద్దతుతో 13-మెగా పిక్సెల్ డ్యుయల్ కెమెరా సెటప్‌తో వస్తున్నదీ స్మార్ట్ ఫోన్. రూ.10 వేల లోపు ధరకే అందుబాటులో ఉంటుంది. 60 హెర్జ్ రీఫ్రెష్ రేట్‌తోపాటు 6.75 అంగుళాల స్క్రీన్‌తో వస్తుంది. లావా యువ స్మార్ట్ ఫోన్ ఇంట్రడ్యూసరీ ధర రూ.6000గా ప్రకటించింది లావా ఇంటర్నేషనల్. ప్రముఖ ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్స్ అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌ల్లోనూ లభిస్తుందీ లావా యువ స్మార్ట్ ఫోన్. గ్లాసీ బ్లూ, గ్లాసీ లావెండర్, గ్లాసీ వైట్ కలర్ ఆప్షన్లలో వస్తున్న ఈ ఫోన్‌పై ఏడాది వారంటీ, ఫ్రీ సర్వీస్ ఎట్ హోం అందిస్తుంది. యూనిసోక్ 9863ఏ ఒక్టోకార్ ప్రాసెసర్, 3జీబీ ం 3జీబీ (వర్చువల్) ర్యామ్ విత్ 64 జీబీ స్టోరేజీ వేరియంట్ అందుబాటులో ఉంటుంది. మైక్రో ఎస్డీ కార్డ్ సాయంతో 512 జీబీ వరకూ స్టోరేజీ కెపాసిటీ పెంచుకోవచ్చు. ఆండ్రాయిడ్ 14 గో వర్షన్‌పై పని చేస్తుందీ ఫోన్. లావా యువ స్మార్ట్ ఫోన్ ఎల్ఈడీ ఫ్లాష్‌తోపాటు 13 %-% మెగా పిక్సలె డ్యుయల్ రేర్ కెమెరా సెటప్ ఉంటుంది. ఏఐ పవర్డ్, హెచ్‌డీఆర్ మద్దతుతో పోర్ట్రైట్, నైట్ మోడ్‌లకు మద్దతుగా నిలుస్తుంది. సెల్ఫీలూ వీడియో కాల్స్ కోసం 5-మెగా పిక్సెల్ కెమెరా ఉంటుంది. స్లో మోషన్ వీడియో, ఏఐ మోడ్స్ ఉంటాయి. డ్యుయల్ 4జీ వోల్ట్, వై-ఫై 5,బ్లూటూత్ 4.2, ఓటీజీ సపోర్ట్, యూఎస్బీ టైప్-సీ పోర్ట్ కనెక్టివిటీ ఉంటుంది. 10వాట్ల చార్జింగ్ మద్దతుతో 5000 ఎంఏహెచ్ కెపాసిటీ గల బ్యాటరీతో వస్తోంది. సెక్యూరిటీ కోసం సైడ్ మౌంటెడ్ ఫింగర్ ప్రింట్ సెన్సర్, ఫేస్ అన్‌లాక్, క్యూఆర్ కోడ్ స్కానర్ బ్యాటరీ సేవర్ మోడ్ వంటి ఫీచర్లు ఉంటాయి.

Editor, printed and owned by Bommarboyina Venkanna, Associate Editor K Rajendra Prasad “office: Amber Nagar, Parshigutta, Secundrabad, Cell.no: 099592 36324, 9912824332